

సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ



కోటాలో 'నీట్' అభ్యర్థిని ఆత్మహత్య

సుప్రీంకోర్టు ప్రత్యేక లోక్ అదాలత్ దశాబ్దాలనాటి పలు కేసులకు పరిష్కారం 07



సంపుటి 29, సంచిక: 69 | గురువారం | 27-08-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00




## అతివేగం.. ఘోర ప్రమాదం

**ఆరుగురు మృతి**

14 మందికి తీవ్రగాయాలు
కోదాడ సమీపంలో ఘటన

ప్రజాపక్షం/కోదాడ/కోదాడ రూరల్

గమ్యస్థానానికి చేరుకుని హాయిగా నిద్రలేవాలనుకున్న ప్రయాణికుల ఆశలు మార్గమధ్యంలోనే అవిరయ్యాయి. తెల్లవారుజామున చిమ్మచీకటిలో ఊహించని ప్రమాదం మృత్యు ఘంటికలు మోగించింది. కనురెప్ప మూసి తెరిచేలోపే ఆరుగురి ప్రాణాలు గాల్లో కలిసిపోగా, మరో 14 మంది తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. ప్రమాదం తర్వాత క్షతగాత్రుల హాహాకారాలు, బంధువుల ఆర్తనాదాలతో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రి విషాదంలో మునిగిపోయింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దోరకుంట సమీపంలో హైద్రాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున ప్రమాదానికి గురైన కంటైనర్ డివైడర్‌పై నిలిచి ఉండగా, దాన్ని తరువాయి 8లో



## టిబెట్‌లో భూకంపం..
# నేపాల్‌లో జలప్రళయం

- 95 మృతదేహాలు స్వాధీనం
- జాడ తెలియని 133 మంది హైదరాబాదీలు, 391 మంది విదేశీయులు
- 80 మంది పైగా నేపాలీ భద్రతా సిబ్బంది క్షణాల్లో అదృశ్యం
- కొట్టుకుపోయిన గ్రామాలు, వంతెనలు
- డజను జల విద్యుత్ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలు ధ్వంసం

**500 మంది పర్యాటకులు గల్లంతు**



**కాఠ్మండు :** టిబెట్ వైపు భూకంపం,హిమనీ నద విస్ఫోటనం (గ్లేసియర్ లేక్ ఔట్ బరస్ట్)తో నేపాల్‌లో ఘోర వరద విలయం సంభవించింది. నేపాల్ రషువాలోని భోట్‌కోషి నదికి టిబెట్ సరిహద్దు ప్రాంతం నుండి ఆకస్మిక వరదలు రావడంతో 133 మంది భారతీయులు సహా దాదాపు 500 మంది పర్యాటకులు గల్లంతయ్యారు. వివిధ ప్రాంతాలలో ఉన్న 44 మంది నేపాల్ సైనికులు సహా 80 మంది పైగా భద్రతా సిబ్బంది క్షణకాలంలో కనిపించకుండా అదృశ్యమయ్యారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఈ పెను జల ప్రళయం మహోగ్రంగా ఆకాశం ఎత్తున లేచి వస్తూ ఉండటంతో ఆ జలఘోష విని ప్రజలు హా..హా..కారాలు చేస్తూ ప్రాణాలు రక్షించుకోవడానికి విఫలయత్నం చేశారు. టిబెట్ సరిహద్దుల్లో ఉన్న రసువా, ధాడింగ్ సహా ఏడు నేపాలీ జిల్లాల పరీవాహక ప్రాంతాలపై వరద తరంగాలు ఉవ్వెత్తున లేచి పడి జనావాసాలను తుడిచిపెట్టాయి. పలుగ్రామాలు,వంతెనలు కొట్టుకుపోయి అపారనష్టం వాటిల్లింది. అనేక ఇళ్ళు ధ్వంసమయ్యాయి.లాంగ్టాంగ్ ఖోలా హైడ్రో పవర్ ప్రాజెక్టులో పనిచేసే 60 మంది సిబ్బందితో సంబంధాలు తెగిపోయినట్లు అధికారులు ప్రకటించారు. ఈ నదీపరీవాహక ప్రాంతంలోని రహదారులపై ప్రయాణిస్తున్న విదేశీ పర్యాటకులున్న వాహనాలు వరద ఉద్ధృతిలో కొట్టుకుపోయాయి. వీరిలో ఎంతమంది సజీవంగా ఉన్నారో తెలియదు. గల్లంతైనవారిలో తరువాయి 8లో



## పాలమూరు బిడ్డగా.. సురవరం త్యాగాలు అమూల్యం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- సుధాకరరెడ్డి స్వగ్రామం కంచుపాడులో ఘనంగా ప్రథమ వర్ధంతి సభ
- పలువురు నేతలు నివాళి

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల

పాలమూరు బిడ్డగా సురవరం చేసిన త్యాగాలు అమూల్యమని, జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగినా తన సొంత గడ్డ అభివృద్ధిని ఎప్పుడూ మరువలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండల పరిధిలోని ఆయన స్వగ్రామం కంచుపాడులో సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ స్థాయి నుంచి దేశ రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదిగిన సురవరం సేవలను, ఆయన చేసిన పోరాటాలను ఈ సందర్భంగా తరువాయి 12లో

### రూ.4.15 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

సురవరం సుధాకర్ రెడ్డి వర్ధంతి సభను పురస్కరించుకుని కంచుపాడు గ్రామంలో పలు కీలక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మంత్రులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కంచుపాడు గ్రామం నుండి నేషనల్ హైవే 44 వరకు రూ.3.15 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణపనులకు, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రూ.1 కోటి నిధులతో పాఠశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. యువతలో విజ్ఞానాన్ని, క్రీడా నైపుణ్యాలను పెంపొందించే దిశగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సురవరం సుధాకర్‌రెడ్డి గ్రంథాలయం (లైబ్రరి), సురవరం సుధాకర్ రెడ్డి, క్రీడా ప్రాంగణాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు గ్రామంలోని నిరుపేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మంజూరు చేసిన 5 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు అందజేశారు. సురవరం వెంకటరామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ద్వారా గ్రామీణ మహిళలకు కుట్టుమిషన్, కంప్యూటర్, ఏఐ శిక్షణలతో పాటు క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి మైదానాలు అందుబాటులోకి తెచ్చినట్లు సురవరం కుటుంబ సభ్యులు వెల్లడించారు.

## మరింత సంక్షోభంలోకి...

**కలిసిరాని వాతావరణం సాగు రంగంపై ఎల్‌నినో దెబ్బ**



ప్రజాపక్షం/ ఖమ్మం

దేశంలో ప్రధాన రంగంగా ఉండి ఇప్పటికి 50 శాతానికి పైగా ఆధారపడిన వ్యవసాయ రంగం ఇప్పుడు మరింత సంక్షోభంలోకి కూరుకుపోతుంది. రైతాంగం అప్పులపాలై సాగును వదిలి ప్రత్యామ్నాయ మార్గాల వైపు జీవనోపాధి కోసం వెళ్తున్నారు. పాలకుల విధానాలలో మార్పు రాకపోవడం, ప్రకృతి సాగుకు అనుకూలంగా లేకపోవడం వ్యవసాయ రంగ సంక్షోభానికి కారణమవుతుంది. ఒక ఏడాది కాస్త ఫర్వాలేదనుకుంటే రెండేళ్లు తీవ్రంగా నష్టపోవడం రైతాంగానికి ఆనవాయితీగా మారింది. గతేడాది వాణిజ్య పంటలతో పాటు ఆహార పంటల దిగుబడులు కాస్త ఆశాజనకంగా అనిపించాయి. దీనికి తగిన రీతిలో ధరలు కూడా ఉండడంతో రైతులు కాస్త ఉపశమనం పొందారు. ఈ ఏడాది మళ్లీ మొదటికొచ్చింది. వర్షాభావ పరిస్థితుల్లో పంటలు ఎండిపోవడమో అతివృష్టికారణంగా పంటలు కొట్టుకుపోవడమో జరుగుతున్న నేపథ్యంలో ఎల్‌నినో పుణ్యమా అని వర్షాలు కురవకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వర్షాలు లేకపోవడం, వేసవిని తలపించే రీతిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో కొన్ని ప్రాంతాల్లో పంటలు సాగు చేసిన ఆశించిన స్థాయిలో ఎదుగు బొదుగు లేకుండాపోయాయి. కొన్ని ప్రాంతాలలో పత్తి పంట పరిస్థితి ఇప్పటికైతే ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది వరి సాగు గణనీయంగా తగ్గింది. వర్షాలు లేకపోవడంతో నీటి వనరులు వట్టిపోతున్నాయి. రాష్ట్రంలో 11 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే నాగార్జున సాగర్ ప్రాజెక్టులోకి ఈ ఏడాది కొత్త నీరు చేరలేదు. దీనితో సాగర్ ఎడమ కాలువ పరిధిలో 11లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి లేదు. మధ్యతరహా ప్రాజెక్టులలో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలో ఒక్క తాలిపేరు మినహా ఏ మధ్యతరహా ప్రాజెక్టులోనూ నీరు లేదు. చెరువులు, కుంటల పరిస్థితి చెప్పాల్సిన తరువాయి 12లో



## పోలీసుల అదుపులో ఆరేళ్ళ బాలుడు?

వైరల్‌గా మారిన పట్నా వీడియో

**పట్నా :** బిహార్ రాజధాని పట్నాలో మంగళవారం జరిగిన యువజన నిరసనలో పాల్గొన్న ఆరేళ్ల బాలుడు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించాడు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ముఖ్యమంత్రి రాజీనామాను డిమాండ్ చేస్తున్న ఆ బాలుడికి సంబంధించిన అనేక వీడియోలు వైరల్ అయ్యాయి. అయితే, నిరసన ప్రదేశం నుండి పోలీసులు అతన్ని బలవంతంగా తరలిస్తున్న ఒక వీడియో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఆరేళ్ల బాలుడిని అదుపులోకి తీసుకోవడంపై పోలీసుల తీరును కాక్రోచ్ జనతా పార్టీ తప్పుబట్టింది. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో అక్రమాలపై వందలాది మంది విద్యార్థులు నిరసన తెలుపుతుండగా, ఆ బాలుడు పట్నాలోని డాక్ బంగ్లా క్రాసింగ్ వద్దకు చేరుకున్నాడు. ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి నివాసాన్ని ముట్టడించడానికి నిరసనకారులు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆ బాలుడు చేతిలో త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని, నిరుద్యోగ సమస్యపై నినాదాలు చేస్తూ, ముఖ్యమంత్రి రాజీనామాను డిమాండ్ చేయడం వైరల్ విడియోలో కనిపించింది. 'విద్యార్థులకు ఉద్యోగాలు ఎందుకు రావడం లేదు? ఉద్యోగాల కల్పన గురించి మీరు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి, సమ్రాట్ చౌదరీ? ఆయన పదవి నుంచి దిగిపోవాలి' అని ఆ ఆరేళ్ల బాలుడు అనడం వినిపిస్తుంది. మరో వీడియోలో, పోలీసు చర్యను ఎదుర్కోవడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ధైర్యంగా చెబుతుండడం కనిపించింది. కొద్ది నిమిషాల తర్వాత, మహిళా పోలీసులతో సహా కొంతమంది పోలీసులు ఆ బాలుడిని, తల్లితో సహా బలవంతంగా నిరసన ప్రదేశం నుండి తీసుకువెళ్లడం కనిపించింది.

## 29న శాసనసభ ఎథిక్స్ కమిటీ సమావేశం

**కడియం శ్రీహరిపై పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తనను పరిశీలించనున్న కమిటీ**

ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభలో సీనియర్ సభ్యులు, మాజీ మంత్రి కడియం శ్రీహరి పట్ల ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరుపై శాసనసభ ఎథిక్స్ కమిటీ సమావేశం ఈ నెల 29వ తేదీన ఉదయం 11 గంటలకు అసెంబ్లీ భవనాల కమిటీ హాల్‌లో జరగనుంది. ఈ ఏడాది మార్చి 29న శాసనసభలో సభ్యులు కడియం శ్రీహరి పట్ల ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరుపై వచ్చిన అంశాన్ని శాసనసభ ఎథిక్స్ కమిటీకి నివేదించింది. ఈ వ్యవహారాన్ని పరిశీలించి, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై సిఫారసులు చేసేందుకు కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ శాసన సభ సచివాలయం అధికారికంగా బుధవారం నోటీసు జారీ చేసింది.


**పోలీస్‌లను ఆయుధంగా ఉపయోగిస్తున్న బిహార్ సర్కార్**

కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శ



07




## వంద శాతం కాంగ్రెస్‌లోనే..

స్పష్టం చేసిన కొండా మురళి
సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

ప్రజాపక్షం/హైదరాబాద్

తమ కుమార్తె కొండా సుస్మిత వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. తాము 100 శాతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని, పార్టీ అధిష్టానం, గాంధీ కుటుంబంపై తరువాయి 12లో

## కాంగ్రెస్‌లో కొండంత ఉత్కంఠ

- పరిణామాలపై సైలెంట్‌గా కొండా శిబిరం
- చర్యలు తప్పవంటూ వస్తున్న వార్తలతో కలకలం
- తాజాగా డిప్యూటీ సిఎం భట్టితో కొండా మురళి భేటీ




ప్రజాపక్షం/హనుమకొండ

వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుటుంబాన్ని చుట్టుముట్టిన పరిణామాలు ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. ఒకవైపు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలపై మంత్రి సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యల వ్యవహారంలో క్రమశిక్షణ సంఘం నివేదిక పీసీసీ చీఫ్ కు చేరడం.. మరోవైపు మంత్రి మాజీ ఓఎస్డీ సుమంత్ పై నమో దైన హత్యాయత్నం కేసులో వరుస అరెస్టులు, జూబ్లీహిల్స్ ఇన్ స్పెక్టర్ ముత్తు యాదవ్ సస్పెన్షన్.. ఇలా ఒకదాని వెంట ఒకటి పరిణామాలు చోటుచే సుకోవడంతో ఇక కొండాపై ఏం తేల్చనున్నారు? అన్న చర్చ పొలిటికల్ సర్కిళ్లలో సాగుతోంది.జరుగుతున్న తాజా పరిణామాలపై కొండా వర్గం వేచి చూసే దోరణిలో ఉంది. కాగా తాజాగా మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సమావేశం అయ్యారు.మరోవైపు కొండా సురేఖ పై చర్యలు తప్పవని వస్తున్న వార్తలతో కొండా శిబిరంలో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో కొండా మురళి భట్టి విక్రమార్కతో సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు రెండు రోజులుగా వరంగల్ నగరంలో పర్యటిస్తున్న మంత్రి సురేఖ మౌనం పాటిస్తున్నారు. తనను కలుస్తున్న మీడియాకు తరువాయి 12లో

## పోలీసు బారికేడ్లను ఛేదించుకొని రైతుల ట్రాక్టర్ ర్యాలీ




**హనుమాన్‌గఢ్ జిల్లాలో ఉద్రిక్తత**



**జైపూర్:** రాజస్థాన్‌లోని హనుమాన్‌గఢ్ జిల్లాలో బుధవారం రైతులు చేపట్టిన ట్రాక్టర్ ర్యాలీ సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. అటల్ భూజల్ యోజన కింద నిర్మించిన వ్యవసాయ చెరువులకు సంబంధించిన పెండింగ్ సబ్సిడీని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు పోలీసు బారికేడ్లను దాటడంతో కొందరు రైతులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, తమకు రావాల్సిన సబ్సిడీ మొత్తాన్ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధన్ మండి మార్కెట్ నుంచి ట్రాక్టర్ ర్యాలీ ప్రారంభమైంది. రైతులను అడ్డుకునేందుకు పోలీసులు అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. రైతులు వాటిని పక్కకు నెట్టడంతో కొందరు ఆందోళనకారులు, పోలీసు సిబ్బంది మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అనంతరం తరువాయి 8లో

# ప్రమాదం తర్వాతే మేల్కొంటారా?

ఒక ప్రైవేట్ బస్సు ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు హైదరాబాద్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడు అంతస్తుల భవనం కుప్పకూలుతుంది. చూడడానికి ఇవి రెండూ ఘటనలు. కానీ, అవి సంధించే ప్రశ్న మాత్రం ఒకటే. 'నిబంధనలు ఉన్నప్పుడు అవి అమలులో ఎందుకు కనిపించవు?' అనేది పదేపదే పునరావృతమవుతున్న ప్రశ్న. భవనం కూలిన తర్వాత అధికారులు అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్లు నడుపుతున్నారు. తనిఖీలు, నోటీసులు, కూల్చివేతలు మొదలవుతాయి. ఈ అక్రమ నిర్మాణాలు ఒక్క రాత్రిలో పుట్టాయా? అని నిలదీస్తున్న ప్రజలకు సమాధానం ఎవరు చెప్తారు? ఒక భవనం నిర్మించడానికి అనుమతులు అవసరం. ప్లాన్ ఆమోదం, నిర్మాణ తనిఖీలు, భద్రతా ప్రమాణాలు, విద్యుత్, అగ్నిమాపక వంటి అనేక అంశాలు ఉంటాయి. మరి నిబంధనలకు విరుద్ధంగా ఒక భవనం ఏడు అంతస్తులకు ఎదిగే వరకు సంబంధిత అధికారులు ఎక్కడ ఉన్నారు? ఇదే ప్రశ్న ప్రైవేట్ బస్సు ప్రమాద విషయంలోనూ తలెత్తుతుంది. వాహనానికి ఫిట్‌నెస్ ఉందా? డ్రైవర్‌కు తగిన విశ్రాంతి లభిస్తున్నదా? వాహనాన్ని సక్రమంగా నడిపిస్తున్నారా? ప్రయాణికుల భద్రతా ప్రమాణాలు పాటించారా? డ్రైవర్‌పై పని భారం అధికంగా ఉందా? ఈ ప్రశ్నలు ప్రమాదం జరిగిన తర్వాతే ఎందుకు గుర్తుకు వస్తాయి? ప్రతిసారీ ప్రమాదం జరిగిన తర్వాతే నిబంధనలు గుర్తుకు రావడం మన పరిపాలనా వ్యవస్థలోని తీవ్రమైన వైఫల్యాలలో ఒకటి. అవినీతి అంటే కేవలం లంచం తీసుకోవడం కాదు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తి నుంచి డబ్బు తీసుకుని కళ్లుమూయడం అవినీతి అయితే, ఉల్లంఘన తెలిసినా చర్య తీసుకోకపోవడం కూడా పరిపాలనా అవినీతికి దారితీసే నిర్లక్ష్యమే. అయితే మొత్తం తప్పును ప్రభుత్వ ఉద్యోగులపై మాత్రమే మోపడం కూడా సరికాదు. అక్రమ నిర్మాణం చేయాలనుకునే వ్యక్తి, భద్రతా ప్రమాణాలను పట్టించుకోని వాహన యజమాని, నిబంధనలను తప్పించుకోవాలని ప్రయత్నించే వ్యాపారి, లంచం ఇచ్చి పని త్వరగా పూర్తి చేయాలనుకునే పౌరుడు కూడా ఈ దుర్మార్గంలో భాగస్వాములే. అవినీతి ప్రభుత్వ కార్యాలయంలో మాత్రమే ఉండదు. అది సమాజంలోనూ ఉంటుంది. 'లంచం ఇవ్వనిదే పనులు కావు' అని స్థిరీకరించి, ఒక రకంగా ప్రజలే అవినీతి వ్యవస్థకు ఊపిరిపోస్తున్నారు. పెంచి పోషిస్తున్నారు. అవినీతిని సాధారణ జీవితంలో భాగం చేస్తున్నారు. చట్టాన్ని ఉల్లంఘించడం తెలివిగా, చట్టాన్ని పాటించడం మూర్ఖత్వంగా కనిపించే స్థితి ఏ సమాజానికైనా ప్రమాదకరం. అవినీతిని నియంత్రించడానికి కేవలం నైతిక బోధనలు సరిపోవు. వ్యవస్థలో మార్పులు అవసరం. ఈ క్రమంలో, ప్రభుత్వ సేవలను సాధ్యమైనంత వరకు డిజిటలైజ్ చేయాలి. అనుమతులు, లైసెన్సులు, నిర్మాణ దరఖాస్తులు, వాహన ఫిట్‌నెస్ వంటి ప్రక్రియల్లో ఎవరు, ఎప్పుడు, ఏ నిర్ణయం తీసుకున్నారో డిజిటల్ రికార్డు ఉండాలి. నిర్ణయాలకు కాలపరిమితి ఉండాలి. దరఖాస్తును తిరస్కరించడానికి గల కారణాలను స్పష్టంగా పేర్కోవాలి. తనిఖీలను ప్రమాద ఆధారంగా నిర్వహించాలి. గతంలో నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలు, వాహనాలు లేదా సంస్థలపై మరింత కఠిన పర్యవేక్షణ అవసరం. ప్రతి ప్రమాదం తర్వాత భారీ తనిఖీలు నిర్వహించడం కంటే, ప్రమాదం జరగకముందే ప్రమాదాన్ని గుర్తించడం సమర్థవంతమైన పరిపాలన అనిపించుకుంటుంది. అధికారులకు బాధ్యతను నిర్ధారించాలి. ఒక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు సంవత్సరాల పాటు కొనసాగితే, వాటిని నిర్మించినవారినే కాదు, పర్యవేక్షణ బాధ్యత వహించిన అధికారుల పనితీరును కూడా పరిశీలించాలి. ఒక ప్రమాదకర వాహనం పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తే, యజమానితో పాటు పర్యవేక్షణ వ్యవస్థ ఎలా పనిచేసిందో కూడా ప్రశ్నించాలి. తప్పు చేస్తే శిక్ష తప్పదనే నమ్మకం కలగాలి. చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా అవి సంవత్సరాల తరబడి అమలుకాకపోతే ప్రయోజనం ఉండదు. న్యాయస్థానాల్లో కేసులు సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా ఉండడం అవినీతిపరులకు ఎక్కడలేని ధైర్యాన్నిస్తుంది. అందుకే, వేగవంతమైన, నిష్పక్షపాత విచారణ అవసరం. అదే సమయంలో నిజాయితీగా పనిచేసే అధికారులకు రాజకీయ లేదా అనవసర ఒత్తిళ్ల నుంచి రక్షణ ఉండాలి. ఇక్కడ, రాజకీయ వ్యవస్థ పాత్రను కూడా విస్మరించలేం. అక్రమ నిర్మాణాలు, అనధికార వ్యాపారాలు లేదా రవాణా ఉల్లంఘనలకు రాజకీయ రక్షణ లభిస్తే, చట్టాన్ని అమలు చేసే అధికారి బలహీనపడతాడు. ప్రజాప్రతినిధి ప్రజల ప్రతినిధి. చట్టాన్ని ఉల్లంఘించే వారి రక్షకుడు కాదు. ఇక సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాలి. తన ఇంటి నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించి, పక్కింటి అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదు. లంచం ఇచ్చి పని త్వరగా చేయించుకోవడం కూడా అవినీతి వ్యవస్థకు బలం ఇస్తుంది. ఒక బస్సు ప్రమాదం జరిగిన తర్వాత లేదా ఒక భవనం కుప్పకూలిన తర్వాత హడావిడి చేయడం, ఆ తర్వాత తిరిగి గాఢ నిద్రలోకి జారుకోవడం ఈ వ్యవస్థలో ఆనవాయితీగా మారింది. అందుకే, ప్రతి ప్రమాదం తర్వాత అదే నాటకం పునరావృతమవుతున్నది. సంతాపాలు, సమావేశాలు, తనిఖీలు, బుల్డోజర్లు, హామీలు. కొద్దిరోజులకు అన్నీ మామూలవుతాయి. తరువాత మరో ప్రమాదం. మళ్లీ ఒక చిన్న అలజడి. ప్రమాదం తర్వాత ప్రభుత్వం ఏం చేసింది? అనేది కీలకం కాదు. ప్రమాదం జరగకముందే ప్రభుత్వం ఏం చేస్తున్నదో చెప్పాలి. అదే ప్రశ్నకు నిజాయితీగా సమాధానం చెప్పగలిగిన రోజునే మన పరిపాలన ప్రతిచర్యాత్మక వ్యవస్థ నుంచి బాధ్యతాయుతమైన ప్రజా వ్యవస్థగా మారుతుంది. ప్రభుత్వానికి కీలక బాధ్యత ఉన్నప్పటికీ, అవినీతికి వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత సమాజం, వ్యక్తులపైన కూడా ఉంది. అధికారి తన బాధ్యతను నిర్వర్తించాలి. ప్రజాప్రతినిధి చట్టానికి కట్టుబడి ఉండాలి. వ్యాపారి భద్రతా ప్రమాణాలను ఖర్చుగా కాకుండా బాధ్యతగా చూడాలి. పౌరుడు లంచాన్ని ఒక సాధారణ ప్రక్రియగా భావించడం మానుకోవాలి. అప్పుడే సమస్యకు కొంతవరకైనా పరిష్కారం లభిస్తుంది. ●



## ● న్యాయవ్యవస్థ సరిపడా ప్రజాస్వామ్యయుతంగా లేదు

న్యాయవాదులు, న్యాయమూర్తులు, ప్రభుత్వ సౌలభ్యం చుట్టూనే మన న్యాయ వ్యవస్థ మొత్తం తిరుగుతోంది. ఇది కక్షిదారుల కేంద్రంగా లేదు. నేటికీ, ఒక ఒక కక్షిదారుడు వృత్తిపరమైన న్యాయ సహాయం లేకుండా తన న్యాయపరమైన చిక్కుముడిని ఛేదించుకోవడం సాధ్యం కాదు. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడిచినా న్యాయ పరిపాలనావ్యవస్థ ఉండాల్సినంత ప్రజాస్వామ్యయుతంగా, దానిని ఉపయోగించుకునేవారికి జవాబుదారీగా లేదు.

– డి.ఎస్.బోర్కర్ స్మారకోపన్యాసంలో ఒడిషా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎస్.మురళీధర్



# యువత ఆశలు – ప్రభుత్వ వైఫల్యాలు!

దేశాభివృద్ధికి చలనచిత్రం వంటి అత్యంత కీలకమైన శక్తి మన యువత. ప్రతిష్టాత్మకమైన ఎర్రకోట బురుజుల పైనుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలో 'వికసిత్ భారత్' సాధనలో యువత పాత్రను ఆకర్షణీయమైన పదజాలంతో కొనియాడారు. అయితే, ఆ శబ్దాల వెనుక దాగి ఉన్న చేదు నిజాలు, క్షేత్రస్థాయిలోని సామాజిక, ఆర్థిక సవాళ్లు మాత్రం తీవ్రమైన ఆందోళనను కలిగిస్తున్నాయి. విద్యా వ్యవస్థలోని వ్యవస్థాగత లోపాలు, పెరుగుతున్న నిరుద్యోగం, ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలలో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమాల వల్ల నేటి యువత తీవ్ర నిరాశానిస్పృహల్లో మునిగిపోయింది. ఈ క్లిష్టమైన సమయంలో, ప్రభుత్వం మూల సమస్యలను పరిష్కరించకుండా కేవలం ఉపరితల ప్రకటనలతో సత్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం తీవ్రమైన విమర్శలకు దారితీస్తోంది.

యువత నుంచి వ్యక్తమవుతున్న ఆగ్రహాన్ని, నిరసనలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కొన్ని సంస్కరణలను, హామీలను తెరపైకి తెచ్చింది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సౌకర్యం, కోటిమంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) లో శిక్షణ ఇవ్వడం అందులో ప్రధానమైనవిగా కనిపిస్తున్నాయి. కానీ, లోతుగా విశ్లేషిస్తే ఇవి అసలైన సమస్యను పక్కదారి పట్టించే చర్యలుగానే తోస్తున్నాయి. ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల అధిక రుసుముల భారాన్ని తగ్గించే నెపంతో ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రతిపాదన తెచ్చినప్పటికీ, పరీక్షల నిర్వహణలో రోజురోజుకూ క్షీణిస్తున్న విశ్వసనీయతను ఇది పునరుద్ధరించజాలదు. పేపర్ లీకేజీలు, ముందస్తు కుంభకోణాలు, ఫలితాల ప్రకటనలో అంతులేని జాప్యం ఉన్నంత కాలం ఎన్ని ఉచిత కోచింగ్ కేంద్రాలు అందుబాటులోకి తెచ్చినా విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి భద్రతా ఉండదు.

అలాగే కృత్రిమ మేధలో కోటిమందికి శిక్షణ ఇవ్వడం సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచడానికి మేలు చేస్తుందనడంలో సందేహం లేదు. కానీ, ఇప్పటికే విద్యాభ్యాసం పూర్తి చేసుకుని వీధుల్లో ఉన్న కోట్లాది మంది నిరుద్యోగులకు కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించకుండా కేవలం నైపుణ్యాలు పెంచుతామనడం సమస్యను కాలయాపన చేయడమే అవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులు, ముఖ్యంగా దేశ మార్పును కాంక్షించే యువత లోపభూయిష్టమైన విధానాలను ప్రశ్నించడం ఒక సహజమైన, రాజ్యాంగబద్ధమైన హక్కు. తమ భవిష్యత్తు నాశనం అవుతోందని ఆవేదనతో గొంతు ఎత్తిన యువతపై 'దిమాగీ నక్సల్స్' అని వ్యాఖ్యానించడం లేదా వారి నిరసన వెనుక కుట్రలు ఉన్నాయని చిత్రీకరించడం భావప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమే అవుతుంది. నిరసన తెలిపిన ప్రతి ఒక్కరినీ రాజ్యానికి వ్యతిరేకులుగా ముద్ర వేయడం వల్ల ప్రజాస్వామ్య పునాదులే బలహీనపడతాయి. విమర్శలను సానుకూలంగా స్వీకరించి, అవసరమైన సంస్కరణలు చేయాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న పాలకులపై ఉంది.

భారతదేశం 2026 నాటి వర్తమానంలో దేశ యువత అనుభవిస్తున్న నిరుద్యోగిత, మానసిక ఒత్తిడి, విద్యా వ్యవస్థలోని అవినీతికి తక్షణ పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పరీక్షా వ్యవస్థల సమగ్ర ప్రక్షాళన, పారదర్శక నియామక ప్రక్రియలు, ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ పోస్టుల తక్షణ భర్తీ, విద్యా రంగానికి సరైన బడ్జెట్ కేటాయింపులు మాత్రమే ఈ సమస్యలకు అసలైన, శాశ్వత పరిష్కారాలు కాగలవు.

యువతను కేవలం ఓటు బ్యాంకుగా లేదా ఉచిత పథకాల లబ్ధిదారులుగా చూడటం వారి అపరిమిత సామర్థ్యాన్ని తక్కువ చేసి చూపడమే. యువశక్తి ఏ దేశ పురోగతికైనా అత్యంత బలమైన వెన్నుముక వంటిది. వారి న్యాయమైన ప్రశ్నలకు సరైన జవాబులు చెప్పకుండా, వారి నిరసనలను భయభ్రాంతులకు గురిచేసి అణచివేయాలని చూస్తే, ఆ అసంతృప్తి భవిష్యత్తులో తీవ్రమైన సామాజిక ఉద్రిక్తతలకు దారితీస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పగటి కలల నుంచి బయటకు వచ్చి, యువతలో సడలిన విశ్వాసాన్ని మళ్లీ పునరుద్ధరించేలా ఆచరణాత్మకమైన, పారదర్శకమైన చర్యలు చేపట్టి తమ బాధ్యతను నిరూపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వెంకగారి భూమయ్య, 9848559863

# రక్తాక్షరాల్లో రాసిన తెలంగాణ గాథ...వీర బైరాన్ పల్లి



మామిండ్ల రమేష్ రాజా
7893230218

తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కొన్ని గ్రామాల పేర్లు కేవలం భౌగోళిక గుర్తులుగా మిగలలేదు. అవి ఒక తరం ఆత్మగౌరవానికి, ప్రజా ప్రతిఘటనకు, త్యాగానికి ప్రతీకలయ్యాయి. ఆనాటి జనగాం తాలుకాలోని బైరాన్‌పల్లి అలాంటి పేరు గలది. దొరల పెత్తనం, వెట్టిచాకిరీ, భూస్వామ్య దోపిడీ, రజాకార్ల హింసకు వ్యతిరేకంగా పల్లె ప్రజలు సంఘటితమై తమ ఊరిని తామే రక్షించుకున్న గ్రామం అది. 1948 ఆగస్టు 27న అదే బైరాన్‌పల్లి భారీ సాయుధ దాడికి గురై సామూహిక హత్యాకాండకు సాక్ష్యమైంది. కానీ బైరాన్‌పల్లి చరిత్రను కేవలం చనిపోయిన వారి సంఖ్యతో కొలిస్తే ఆ పల్లె అసలు చరిత్రను మనమే చిన్నదిగా చేసినట్టవుతుంది. బైరాన్‌పల్లి ముందు ఒక ప్రతిఘటన. ఆ తర్వాత నరమేధం. ముందు ప్రజల ఐక్యత. ఆ తర్వాత అధికార హింస. ముందు స్వేచ్ఛా ఆకాంక్ష. ఆ తర్వాత దానిని తుపాకీతో అణచివేయాలన్న ప్రయత్నం.

1947 ఆగస్టు 15న భారతదేశం బ్రిటిష్ వలస పాలన నుంచి స్వాతంత్ర్యం పొందింది. కానీ హైదరాబాద్ సంస్థానంలో ఆ స్వాతంత్ర్యపు వెలుగు వెంటనే పడలేదు. నిజాం భారత యూనియన్‌లో విలీనానికి నిరాకరించి తన సంస్థానాన్ని స్వతంత్రంగా కొనసాగించాలని పట్టుబట్టాడు. గ్రామీణ తెలంగాణలో దొరల పెత్తనం, వెట్టిచాకిరీ, అక్రమ వసూళ్లు, భూస్వామ్య దోపిడీ కొనసాగాయి. రజాకార్ల సాయుధ హింస వాటికి మరింత బలం చేకూర్చింది. దేశం స్వతంత్రమైందన్న వార్త పల్లెలకు చేరింది. కానీ పేద రైతు జీవితంలో స్వేచ్ఛ కనిపించలేదు. భూమిని దున్నేవాడికి భూమిపై హక్కు లేదు. కష్టపడేవాడికి తన కష్టానికి ఫలితంపై హక్కు లేదు. దొర మాటే చట్టం. వెట్టి చేయకపోతే శిక్ష. పన్నులు చెల్లించకపోతే దౌర్జన్యం. రజాకారు తుపాకీతో ఇంట్లోకి వస్తే ఎదిరించే హక్కు లేదు. అక్కడే ప్రజల మనసులో ఒక ప్రశ్న పుట్టింది. దేశం స్వతంత్రమైతే గ్రామం ఎందుకు బానిసగా ఉండాలి? భూమిని దున్నేవాడికి భూమి దక్కకపోతే స్వాతంత్ర్యానికి అర్థమేమిటి? చెమటోడ్చిన రైతు పంటను దొర దోచుకుపోతే స్వేచ్ఛ ఎక్కడుంది? తన ఇంట్లోనే మనిషి భయంతో బతకాల్సి వస్తే ఆ స్వాతంత్ర్యం ఎవరి కోసం?

ఈ ప్రశ్నలు వ్యక్తిగత అసంతృప్తులుగా మిగలలేదు. అవి సామూహిక చైతన్యంగా మారాయి. ఆంధ్ర మహాసభ ద్వారా గ్రామాల్లోకి చేరిన రాజకీయ అవగాహన, రైతాంగ సంఘటనలు, కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం ప్రజల ఆలోచనలను మార్చాయి. తమ బాధ వ్యక్తిగతం కాదని, దోపిడీ ఒక వ్యవస్థ అని ప్రజలు అర్థం చేసుకోవడం ప్రారంభించారు. దొర ఎదుట ఒంటరిగా నిలబడటం కాదు, ప్రజలుగా సంఘటితమై నిలబడటమే మార్గమని తెలుసుకున్నారు. భూమి, బతుకు, గౌరవం కోసం జరిగిన పోరాటం క్రమంగా గ్రామ రక్షణ పోరాటంగా కూడా మారింది.

బైరాన్‌పల్లి ఈ చైతన్యానికి ఒక ముఖ్యమైన కేంద్రంగా ఎదిగింది. రజాకార్ల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామస్థులు తమ రక్షణ కోసం గ్రామ రక్షక దళాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గ్రామం చుట్టూ రక్షణ గోడ నిర్మించారు. గ్రామంలోని ఎత్తయిన బురుజును రక్షణ కేంద్రంగా మార్చుకున్నారు. అక్కడ నిరంతరం కాపలా ఉండేది. ప్రమాదం కనిపిస్తే నగారా మోగేది. ఆ నగారా కేవలం హెచ్చరిక కాదు. అది ఒక పల్లె నుంచి మరో పల్లెకు వెళ్లే ప్రజా పిలుపు. బైరాన్‌పల్లి నగారా మోగితే చుట్టుపక్కల వల్లంపట్ల, కూటిగల్, బెక్కల్, కొండాపూర్, లింగాపూర్, దూళ్మిట్ట తదితర గ్రామాల నుంచి ప్రజలు కదిలేవారు. ఒక గ్రామంపై దాడి జరిగితే అది ఆ గ్రామం సమస్య కాదనే భావన అక్కడ బలపడింది. దోపిడీదారులు ప్రజలను కులం, మతం, ఊరు, వర్గం పేర్లతో విడదీయాలని చూస్తే ప్రజలు తమ అనుభవాల నుంచి ఐక్యతను నిర్మించుకున్నారు. ఒకరి బాధను మరొకరు తమ బాధగా స్వీకరించారు. ఒక గ్రామం మంటల్లో ఉంటే పక్క గ్రామం చూస్తూ ఊరుకోలేదు.

లింగాపూర్‌పై జరిగిన రజాకార్ల దాడి దీనికి స్పష్టమైన ఉదాహరణ. ఇళ్లను తగులబెట్టి, వస్తువులను దోచుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన రజాకార్ల దాడి వార్త బైరాన్‌పల్లికి చేరింది. తమ గ్రామం కాదని ప్రజలు వెనక్కి తగ్గలేదు. బైరాన్‌పల్లి నుంచి సుమారు ముప్పై మంది, దూళ్మిట్ట నుంచి మరో ముప్పై మంది వరకు కదిలారు. కర్రలు, గొడ్డళ్లు, కొడవళ్లు చేతుల్లోకి వచ్చాయి. రజాకార్లను ఎదుర్కొన్నారు. దోచుకున్న సామాగ్రిని వదిలేసి వారు వెనక్కి వెళ్లాల్సి వచ్చింది. ఈ సంఘటన బైరాన్‌పల్లి రక్షక దళం పట్ల రజాకార్లలో మరింత ఆగ్రహాన్ని పెంచింది.

బైరాన్‌పల్లిపై రజాకార్లు పలుమార్లు దాడి చేయడానికి ప్రయత్నించారు. కొన్ని స్థానిక వృత్తాంతాలు మూడు, నాలుగు దాడులను ప్రస్తావిస్తాయి. ప్రతి ప్రయత్నాన్నీ గ్రామ రక్షక దళం ప్రతిఘటించింది. రజాకార్లకు బైరాన్‌పల్లి సాధారణ పల్లె కాదని స్పష్టమైంది. స్థానిక రజాకార్ల దాడులు విఫలమవుతున్న కొద్దీ ప్రతీకారం పెరిగింది. చివరకు గ్రామాన్ని భారీ సైనిక బలంతో ముంచెత్తాలన్న నిర్ణయానికి దారితీసింది.

ఈ సందర్భంలో ఖాసిం రజ్వీ పాత్రను విస్మరించలేం. మజ్లిస్‌ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ నాయకత్వంలో రజాకార్లను ఒక సాయుధ రాజకీయ శక్తిగా విస్తరింపజేసిన ప్రధాన నాయకుడు ఖాసిం రజ్వీ. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కాకూడదన్న కఠిన రాజకీయాన్ని అతడు సమర్థించాడు. నిజాం పాలనకు మద్దతుగా రజాకార్లను సంఘటితం చేసి, ప్రజల విలీన ఆకాంక్షను అణచివేయడానికి సాయుధ శక్తిని వినియోగించే రాజకీయానికి నాయకత్వం వహించాడు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రతిఘటన పెరుగుతున్న కొద్దీ రజాకార్ల హింస కూడా తీవ్రతరమైంది.

ఆగస్టు 26 అర్ధరాత్రి దాటిన తర్వాత సైనిక కదలికలు ప్రారంభమయ్యాయి. జనగామ వైపు నుంచి వచ్చిన బలగాలు ముత్యాల మీదుగా బైరాన్‌పల్లి వైపు కదిలి తెల్లవారుజామున గ్రామాన్ని చుట్టుముట్టాయి. దాడికి వచ్చిన బలగాల సంఖ్య విషయంలో ఆధారాలు ఏకాభిప్రాయంగా లేవు. ప్రభుత్వ డిజిటల్ జిల్లా రిపాజిటరీ సుమారు 500 మంది రజాకార్లు ఆధునిక ఆయుధాలతో ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో దాడి చేసినట్లు నమోదు చేస్తోంది. కొన్ని పత్రికా, స్థానిక వృత్తాంతాలు 1200 మంది వరకు బలగం ఉన్నట్లు పేర్కొంటాయి. సంఖ్యలో ఈ వ్యత్యాసం ఉన్నప్పటికీ దాడి భారీ సాయుధ బలగంతో జరిగిందన్న విషయంలో సందేహం లేదు. ఫిరంగులు, మెషిన్‌గన్నులు, స్టెన్‌గన్నులు, రైఫిళ్లు, ఇతర ఆధునిక ఆయుధాలు దాడిలో ఉపయోగించబడ్డాయి.

వేకువ ఇంకా పూర్తిగా విరియలేదు. బైరాన్‌పల్లి నిద్రలో ఉంది. గ్రామానికి కొంతదూరంలో సాయుధ బలగాలు స్థానాలు ఆక్రమించాయి. ప్రమాదాన్ని గుర్తించిన రక్షక దళం నగారా మోగించింది. ఆ శబ్దం గ్రామాన్ని ఒక్కసారిగా మేల్కొలిపింది. ఆయుధాలు అందుకున్నారు. బురుజుపైకి చేరుకున్నారు. గ్రామ రక్షణకు సిద్ధమయ్యారు.

ఒకవైపు దేశీయ తుపాకులు, పరిమిత మందుగుండు సామాగ్రి, కర్రలు, కొడవళ్లు, తమ ఊరిని కాపాడుకోవాలన్న సంకల్పంతో నిలిచిన రైతులు, కూలీలు, యువకులు. మరోవైపు ఫిరంగులు, మెషిన్ గన్నులు, స్టెన్‌గన్నులు, రైఫిళ్లతో కూడిన సాయుధ బలగం. ఈ ఆయుధ అసమానతే బైరాన్‌పల్లి విషాదానికి ప్రధాన నేపథ్యం.

మరణాల సంఖ్య విషయంలో చరిత్ర ఆధారాల్లో ఇప్పటికీ భేదాలున్నాయి. భారత ప్రభుత్వ డిజిటల్ జిల్లా రిపాజిటరీ 99 మంది హతమైనట్లు నమోదు చేసింది. పలు తెలుగు పత్రికా వృత్తాంతాలు 96 మందిని ప్రధాన సంఖ్యగా పేర్కొంటాయి. మరికొన్ని వృత్తాంతాల్లో 118, 119, 200 వరకు సంఖ్యలు కనిపిస్తాయి. స్థానిక మౌఖిక వృత్తాంతాల్లో ఇంకా ఎక్కువ సంఖ్యలు వినిపిస్తాయి. ఈ భేదాలను దృష్టిలో ఉంచుకుని పరిశోధనలో ఒక సంఖ్యను మాత్రమే తుది సత్యంగా ప్రకటించడం కంటే ఆధారాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని నమోదు చేయడం అవసరం.

కానీ ఈ సంఖ్యా భేదం నరమేధం తీవ్రతను ఏమాత్రం తగ్గించదు. 96 అయినా, 99 అయినా, 118 అయినా, అంతకంటే ఎక్కువైనా ప్రతి సంఖ్య వెనుక ఒక మనిషి ఉన్నాడు. ఒక కుటుంబం ఉంది. ఒక తల్లి ఉంది. ఒక భార్య ఉంది. ఒక బిడ్డ ఉంది. ఒక పొలం ఉంది. ఒక బతుకు ఉంది. అందుకే బైరాన్‌పల్లి చరిత్రను సంఖ్యలతో మాత్రమే కొలవలేం.

హింస బైరాన్‌పల్లితో ఆగిపోలేదు. సమీపంలోని కూటిగల్ గ్రామంపైనా దాడి జరిగి ప్రజలు హతమైనట్లు ప్రభుత్వ రికార్డులు పేర్కొంటున్నాయి. స్థానిక వృత్తాంతా లు అక్కడి మరణాల సంఖ్యను మరింత ఎక్కువగా చెబుతున్నాయి. బైరాన్‌పల్లి వంటి గ్రామం ప్రతిఘటిస్తే దాని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు భయం కలిగించాలన్న ఉద్దేశం ఈ హింసలో స్పష్టంగా కనిపిస్తుంది.



బైరాన్‌పల్లిని కేవలం 'నరమేధం'గా గుర్తుంచుకోవ డం సరిపోదు. ఎందుకు ఆ గ్రామం లక్ష్యమైందో అర్థం చేసుకోవాలి.అది రజాకార్లను ఎదిరించింది. తనను తాను రక్షించుకోవడానికి రక్షక దళాన్ని నిర్మించుకుంది. పక్క గ్రామాలతో ఐక్యత పెంచుకుంది. ప్రజలు తమ బలాన్ని తామే గుర్తించారు. అందుకే బైరాన్‌పల్లి మీద జరిగిన దాడి కేవలం ప్రతీకార చర్య కాదు. అది ప్రజా ప్రతిఘటనను అణచివేయడానికి జరిగిన రాజకీయ హింస.

ఈ అర్థంలోనే బైరాన్‌పల్లిని తెలంగాణ జలియన్ వాలాబాగ్ ను తలపించే ఘటనగా పిలిచారు. ఈ పోలికను చారిత్రక సమానత్వంగా చూడాల్సిన అవసరం లేదు. జలియన్‌వాలాబాగ్ బ్రిటిష్ వలస పాలనలో జరిగింది. బైరాన్‌పల్లి హైదరాబాద్ సంస్థానంలోని నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల సైనిక హింస నేపథ్యంలో జరిగింది. రెండు సందర్భాలు వేరు. కానీ ప్రజల స్వేచ్ఛా ఆకాంక్షకు తుపాకీతో సమాధానం చెప్పిన అధికార హింస అనే విషయంలో రెండూ రక్తసాక్ష్యాలుగా నిలిచాయి.

1948 సెప్టెంబర్‌లో నిజాం పాలన ముగిసింది. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయింది. రజాకార్ల రాజకీయ ఆధిపత్యం కూలిపోయింది. తరాలు మారాయి. బైరాన్‌పల్లి కూడా మారింది. కానీ ఆ గ్రామం లేవనెత్తిన ప్రశ్నలు మాత్రం చరిత్రలో మిగిలిపోయాయి. స్వేచ్ఛ అంటే ఏమిటి? ప్రజాస్వామ్యం ఎవరి కోసం? భూమిని దున్నేవాడికి భూమిపై హక్కు ఎప్పుడు? ప్రజల గౌరవాన్ని తుపాకీతో అణచివేయగలమా?

చరిత్రను గుర్తుచేసుకోవడం అంటే గతాన్ని పూజించడం కాదు. గత పోరాటాల నుంచి వర్తమానానికి దారి వెతకడం. బైరాన్‌పల్లి మన గతం మాత్రమే కాదు. మన వర్తమానాన్ని ప్రశ్నించే చరిత్ర.

వీర బైరాన్‌పల్లి తెలంగాణ ప్రజా పోరాట చరిత్రలో చెరిగిపోని రక్తాక్షరం.

# తెగడ్తల నుంచి పొగడ్తల దాకా ఎందుకు?

దేశ రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో జంతర్ మంతర్‌లో ప్రారంభమైన జన్ జి యువత ఉద్యమాన్ని దేశద్రోహుల ఉద్యమమని, విదేశీ శక్తుల కుట్ర అని, మురికి జనరేషన్ అంటూ అవహేళన చేసి, తిట్టిపోసిన వారి స్వరాల్లో ఇప్పుడు మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది. జెన్ జికి బాధ్యత లేదని, వారి నిరసనలను తక్కువ చేసినవారు, సామాజిక మాధ్యమాల మత్తులో జోగుతున్న తరంగా చిత్రీకరించినవారు ఇప్పుడు గత్యంతరం లేక జెన్ జీ తరమే దేశ భవిష్యత్తని కీర్తిస్తున్నారు. ఆదిలో అసహనం వ్యక్తం చేసిన ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్, ప్రధాని నరేంద్ర మోదీ సహా కొందరు నేతలు మొదలు, అభ్యంతరకరమైన తీవ్ర వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎంపి, సినీ నటి కంగనా రనౌత్ స్వరాల్లో మార్పు వచ్చింది.

జన్ జి యువత ఉద్యమం ప్రారంభమైనప్పుడు ఆందోళనల్లో పాల్గొంటున్న యువతపై ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ ఆ ఉద్యమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ ఘాటుగా మాట్లాడారు. ఇప్పటి యువత ప్రశ్నిస్తున్నదని, దేవుళ్లకు కోతి, ఏనుగు ముఖాలు ఎందుకు ఉన్నాయని ఈ తరం పిల్లలు అడుగుతున్నారని, యువత ప్రతిదానికి లాజిక్‌లు వెతుకుతున్నారని పేర్కొన్నారు. తాము యువకులుగా ఉన్నప్పుడు ఆ పని చేయలేదని అంటూ, ప్రశ్నించే తత్వానికి వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. యువకులుగా నాడు తమకు ఉన్న విధేయత ఈనాటి జన్ జికి లేదని పేర్కొన్నారు.

యువత ఆవేశంతో కాకుండా బాధ్యతతో వ్యవహరించాలని, నిరసనల వెనుక రాజకీయ ప్రేరేపణలు ఉన్నాయన్న భావనను వ్యక్తం చేశారు. ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రభావం చూపడంతో ఇప్పుడు ఆయన మాటల్లోనూ తేడా వచ్చింది. జంతర్ మంతర్ ఉద్యమం పూర్తయ్యా క ఆయన స్వరం కూడా మారింది. యువత ఉద్యమాన్ని అణచివేయడం, నిర్లక్ష్యం చేయడం కంటే, యువతలోని అసంతృప్తికి కారణాలను గుర్తించాలనే పల్లవి ఎత్తుకున్నారు. వారు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉందని అంటున్నారు. ఆ ఉద్యమ తరుణంలో యువత తీరును తప్పుబట్టిన ఆయనే ఇప్పుడు జన్ జీ దేశ భవిష్యత్తుకు కీలక శక్తిగా, వారి ఆకాంక్షలను గౌరవించాల్సిన అవసరం ఉందని వారితో మీటింగులు పెట్టి మరీ పేర్కొంటున్నారు. దీన్ని ఆయనలో వ్యక్తిగతంగా ఏర్పడ్డ అభిప్రాయ మార్పుగా చూడలేం. ప్రజా ఉద్యమం బలపడినప్పుడు, దాని ప్రభావాన్ని అన్ని వ్యవస్థలు గుర్తించక తప్పదనే వాస్తవానికి ఇది నిదర్శనం.

ప్రధాని మోదీ తొలుత యువత ఆందోళనను, అసంతృప్తిని సోషల్ మీడియా ప్రభావంగానే భావించినట్టు కనిపించింది. ఇది తాత్కాలిక ఆవేశంగాను, ఒకటి రెండు రోజుల్లో అదే సమసిపోతుందని ఆయన భావించి ఉండవచ్చు. ఆ ఉద్యమం ఉధృతమై దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన తర్వాత ఆయన ఆలోచనలో, మాటల్లో మార్పు వచ్చింది. ముందు ప్రశ్నించే యువతను నిర్లక్ష్యం చేసిన ఆయన ఇప్పుడు మన యువత భవిష్యత్తే అత్యంత ముఖ్యమైనదని, జన్ జీ ఒక మంచి మార్పుకు శక్తిగా మారుతోందని ప్రశంసించే స్థాయికి చేరారు. ఆదిలో జన్ జీనే కొత్త సమస్య అన్నట్టుగా వ్యవహరించిన వారి నోట ఇప్పుడు జన్ జి నే దేశ భవిష్యత్తు అనే దాకా మారవలసి వచ్చింది.

జన్ జి ఉద్యమ ప్రారంభంలో అధికార పార్టీకి చెందిన వివాదాస్పద ఎంపికంగనా రనౌత్ జన్ జిని ఉద్దేశించి మురికి ('గట్టర్') అంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని లేపా యి. ఆ వ్యాఖ్య తీవ్ర విమర్శలకు దారి తీసింది. సమస్యలపై యువతలో వ్యక్తమవుతున్న ఆగ్రహాన్ని, అసంతృప్తిని అర్థం చేసుకునే ప్రయత్నం చేయకుండా, ఉద్యమకారులను అవమానించేలా మాట్లాడటం ద్వారా ఆమె తన అసహనాన్ని బయటపెట్టుకున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును తక్కువ చేస్తూ సమస్యను పక్కదారి పట్టించాలని చూశారు. ఉద్యమం ఆగలేదు. విమర్శలు, అవమానాలు, రాజకీయ ఆరోపణలను దాటి జన్ జీ ఉద్యమం మరింత విస్తరించింది. విద్యాశాఖ మంత్రి రాజీనామా రూపంలో ఒక విజయాన్ని నమోదు చేసింది. దీంతో జన్ జిని 'గట్టర్' అన్న నోటితోనే ఇప్పుడు పొగడాల్సి వచ్చింది.

ఇప్పుడు తిరుగుబాటు తత్వాన్ని ప్రదర్శిస్తున్న జనరేషన్ జి తరం నూతన సామాజిక, ఆర్థిక, రాజకీయ వాస్తవాల మధ్య పెరిగిన తరం. ఇప్పుడు వారు తెరపైకి తెస్తున్న సమస్యలేవీ వారి వ్యక్తిగతమైనవి కావు. సమాజం సామూహికంగా ఎదుర్కొంటున్నవి. పేపర్ లీకేజీ అనేది ఆ పరీక్ష రాసిన కొందరి సమస్యగానో, ఆ సమస్య వలన ఆత్మహత్యకు పాల్పడిన వారి సమస్యగానో భావించలేదు. ఒక విద్యార్థికి జరిగిన అన్యాయం వేలమంది విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యగానే చూసింది. ఒక పరీక్షలో జరిగిన అవకతవక లక్షలాది మంది విద్యార్థుల ఆగ్రహానికి ప్రతీకగా మారింది.

ఎంతో కాలంగా జన్ జి తరంలో గూడు కట్టుకున్న ఆవేదనకు కారణమైన పాలకుల వైఫల్యాలపై సామాజిక మాధ్యమాల ద్వారా నిలదీసి, ఎంతకూ చలించకపోవడంతో ఇక రోడ్ల మీదే అమీ తుమీ తేల్చుకోవాలని, ప్రశ్నను ఆయుధంగా ప్రతిఘటించి, అధికారానికి సవాల్ విసిరి ప్రభుత్వం మెడలు వంచింది. ఇదే రీతిన భవిష్యత్‌లోనూ మరిన్ని సామాజిక సంస్కరణ పోరాటాలు తప్పవనే సంకేతాలు ఇచ్చింది. జనం మధ్యకే వచ్చి సమస్యను వింటూ మళ్లీ ప్రశ్నలు సంధించడానికి సిద్ధమైంది. ఇందుకోసం ఒక ప్రణాళిక వేసుకుని వస్తుండడంతో అధికార పక్షంతో పాటు వారి మద్దతుదారుల్లో అసలైన భయం మొదలైంది. ఈ తరుణంలోనే నిన్నటి దాకా తిట్టిపోసిన వారు జెన్ జి యువతను నేడు పొగడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామం అమాంతంగా జన్ జి తరంపై ఏర్పడ్డ ప్రేమ కాదు. తాము చెప్పింది విని, కులం, మతం మత్తులో నిద్రిస్తున్నదని భావించిన జన్ జి రానున్న రోజుల్లో బలమైన రాజకీయ శక్తిగా ఎదగనున్నదనే భయం, ఇది మరింత విస్తృతమైతే తమ అధికార పీఠం కూసాలు కదులుతాయనే ఆందోళనతో పాలక పక్షపు దిద్దుబాటు చర్యే ఈనాటి పొగడ్తల పర్వం.

డాక్టర్ సి.ఎన్.క్షేత్రపాల్ రెడ్డి, 9059837847

# పెట్టుబడులు ఆకర్షించేలా 'ఇన్వెస్ట్ తెలంగాణ'

### నిపుణులతో కమిటీల ఏర్పాటు
### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో భారీగా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026'లో భాగంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సమ్మిట్ నిర్వహణ కోసం ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, ప్రముఖ అతిథులకు ఆహ్వాన పత్రాలను ఎలాంటి జాప్యం లేకుండా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. మహాత్మా పూలే ప్రజాభవన్‌లో బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన వివిధ అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ప్రత్యేక వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను ఒక సీనియర్ అధికారి ఆధ్వర్యంలో చేపట్టేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసే వివిధ కమిటీల్లో అవసరమైన రంగాలకు చెందిన నిపుణులు, కీలక అధికారులను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. గతంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదిరిన అవగాహన ఒప్పందాల అమలు, ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను పెద్దఎత్తున ఆకర్షించేలా విస్తృతంగా రోడ్‌షోలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాలని సూచించారు. సమ్మిట్ ఏర్పాట్లలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా ప్రతి కమిటీకి అప్పగించిన బాధ్యతలను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం గంట సమయం కేటాయించి రోజువారీ సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. పెట్టుబడులను ఆకర్షించేలా సమన్వయంతో పనిచేసి 'ఇన్వెస్ట్ తెలంగాణ' సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

### బొగ్గు నుంచి కీలక ఖనిజాల దిశగా సింగరేణి

తెలంగాణకు గుండెకాయలాంటి ప్రభుత్వరంగ సంస్థ సింగరేణిని లాభదాయక సంస్థగా నిలబెట్టి భవిష్యత్ తరాలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా కీలక, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, మైనింగ్‌లోకి సింగరేణిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. క్రిటికల్ మినరల్స్‌తో పాటు బొగ్గు గనులకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే అన్ని వేలం ప్రక్రియల్లో సింగరేణి చురుగ్గా పాల్గొనాలని సూచించారు. బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సింగరేణి అధికారులతో భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమలరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సంస్థ భవిష్యత్ విస్తరణ, బొగ్గు ఉత్పత్తి, కొత్త మైనింగ్ అవకాశాలు, కీలక ఖనిజాల అన్వేషణ తదితర అంశాలపై సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు పెరిగిన నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా సింగరేణి బొగ్గు ఉత్పత్తిని పెంచాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన భద్రతలో సింగరేణి మరింత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు సంస్థను ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. సింగరేణి కేవలం బొగ్గు మైనింగ్‌కే పరిమితం కాకుండా అన్ని రకాల మైనింగ్ రంగాల్లోకి ప్రవేశించాల్సిన అవసరం ఉందని భట్టి విక్రమార్క అన్నారు. రానున్న కాలంలో వెనేడియం, టైటానియం వంటి కీలక ఖనిజాల బ్లాక్‌లు వేలానికి వచ్చే అవకాశం ఉన్నందున వాటిని దక్కించుకునేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు.

ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఆయా రంగాల్లో పెట్టుబడులు, మైనింగ్ అవకాశాలను అధ్యయనం చేసేందుకు దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి దేశాల కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించినట్లు వెల్లడించారు. కీలక ఖనిజాల రంగంలోకి సింగరేణి ప్రవేశించడం ద్వారా సంస్థ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు రాష్ట్రానికి కొత్త ఆదాయ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మారుతున్న ప్రపంచ ఆర్థిక, పారిశ్రామిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాత్మక ప్రణాళికతో సింగరేణిని విస్తరించి, లాభదాయక సంస్థగా మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.

# పూర్తి పారదర్శకంగా... ఇందిరమ్మ టవర్స్ లాటరీ

**● ఆగస్టు 28 నుంచి 31 వరకు నిర్వహణ ● యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం: హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ పథకం కింద హైదరాబాద్ పరిధిలో నిర్మించనున్న ఇళ్ల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు 16 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన లాటరీని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లాటరీ ప్రక్రియను యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నామని, ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. స్థలాభావం, భద్రతా కారణాల దృష్ట్యా లాటరీ కేంద్రాల్లోకి దరఖాస్తుదారులందరినీ అనుమతించడం సాధ్యం కాదని గౌతం తెలిపారు. అయితే లాటరీ జరుగుతున్న తీరును ఆయా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే స్క్రీన్లపై ప్రజలు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. లాటరీ ప్రత్యక్ష ప్రసారాన్ని tghb.telangana.gov.in వెబ్‌సైట్‌తో పాటు హౌసింగ్ డిపార్ట్‌మెంట్ సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వీక్షించవచ్చని వివరించారు. లాటరీ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారం జరుగుతుందని, ఎలాంటి మధ్యవర్తులకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపుపై వచ్చే వదంతులు, అపోహలను నమ్మవద్దని దరఖాస్తుదారులకు సూచించారు.

**28న మొదటి రోజు :** ఈ నెల 28న కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి సంబంధించిన లాటరీని గాజులరామారం గండిమైసమ్మ ఫంక్షన్ హాల్‌లో, సికింద్రాబాద్ కంటోన్మెంట్ లాటరీని బోయినపల్లిలోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించిన లాటరీని మైలార్‌దేవ్‌పల్లిలోని లక్ష్మీ గూడ పొదుపు సంఘం హాల్‌లో, నాంపల్లి నియోజకవర్గ లాటరీని రెడ్‌హిల్స్‌లోని వెట్స్ గార్డెన్‌లో నిర్వహించనున్నారు.

**29న రెండవ రోజు :** ఈనెల 29న ఖైరతాబాద్ నియోజకవర్గ లాటరీని ఎమ్మెల్యే కాలనీలోని కుమ్రంభీం ఆదివాసీ భవన్, సేవాలాల్ బంజారా భవన్‌లో, కూకట్‌పల్లి నియోజకవర్గ లాటరీని కెపిహెచ్‌బి కమ్యూనిటీ హాల్‌లో, అంబర్‌పేట నియోజకవర్గ లాటరీని మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో, బహదూర్‌పుర నియోజకవర్గ లాటరీని ఎస్‌డిఆర్ పెర్ల్ ప్యాలెస్‌లో నిర్వహించనున్నారు.

**30న మూడవ రోజు :** ఈ నెల 30న శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గం ప్రాజెక్టు లాటరీని గచ్చిబౌలిలోని నిర్మిత కేంద్ర ప్రాంగణంలో, మలక్‌పేట నియోజకవర్గ లాటరీని చంపాపేటలోని సాదియా ఫంక్షన్ హాల్‌లో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ లాటరీని బండ్లగూడలోని రాజీవ్ స్వగృహ కమ్యూనిటీ హాల్‌లో, మేడ్చల్ నియోజకవర్గ లాటరీని పోచారం స్వగృహ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నారు.

**31న 4వ రోజు :** ఈనెల 31న మల్కాజిగిరి కౌకూర్ ప్రాజెక్టు లాటరీని ఆల్వాల్‌లోని వీబీఆర్ గార్డెన్స్‌లో, సనత్‌నగర్ పాటిగడ్డ లాటరీని హెవెన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో, మహేశ్వరం జల్‌పల్లి ప్రాజెక్టు లాటరీని బడంగ్‌పేట ప్రజాభవన్‌లో, కార్వాన్ కుల్సుంపుర ప్రాజెక్టు లాటరీని నిర్ణయించిన కేంద్రంలో నిర్వహించనున్నట్లు హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా ప్రజాభవన్

### భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవాలి: విహెచ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత ప్రభుత్వం ప్రగతి భవన్ నిర్మించి ప్రజలు తమ సమస్యలను చెప్పుకునే అవకాశం లేకుండా చేసిందని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్య ల పరిష్కార కేంద్రంగా తీర్చిదిద్దిందని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అన్నారు. గాంధీ భవన్‌లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తన దృష్టికి ప్రధానంగా భూ సమస్యలే ఎక్కువగా వచ్చాయని చెప్పారు. గతంలో పటేల్‌పట్వారి వ్యవస్థ ఉన్న సమయంలో భూ సమస్యలు తక్కువగా ఉండేవని హనుమంతరావు పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో ధరణి వ్యవస్థతో పాటు అనేక కొత్త సమస్యలు తలెత్తాయని ఆరోపించారు. ఇందిరాగాంధీ హయాంలో పేదలకు పంపిణీ చేసిన భూములను సైతం కొందరు భూస్వాములు తిరిగి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ పలు తప్పిదాలు జరుగుతున్నాయని, వీటిపై రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్య లు తీసుకోవాలని హనుమంతరావు కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా భూ సమస్యలను త్వ రితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

## పేదల ఇళ్లకు కేంద్రం నిధులు ఇవ్వకపోయినా వెనక్కి తగ్గం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా తెలంగాణ ప్రజా ప్రభుత్వం వెనక్కి తగ్గేది లేదని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్రం నుంచి సహాయం అందుతుందనే ఆశతో ఏడాది కాలంగా ఎదురుచూడడమే కాకుండా పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ కేంద్రం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత 20142023 వరకు ఈ 10ఏళ్ల కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల నిర్మాణం జరగలేదని, ప్రజల నుంచి భారీగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీని, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారని, ఇటీవల ఎంపీలతో కలిసి తాను కూడా స్వయంగా కేంద్ర మంత్రిని కలవడం జరిగిందన్నారు. అయినప్పటికీ స్పందన రాకపోవడంతో, కేంద్రం నిధుల కోసం పేద ప్రజలను ఇంకా ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతో చివరి బిల్లుల చెల్లింపు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుందని ఆయన వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టంగా ఉన్నప్పటికీ, మార్చి 31వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న 15,475 మంది లబ్ధిదారుల కోసం రూ.185 కోట్లను విడుదల చేశామని చెప్పారు. ఈ ఆఖరి బిల్లుల మొత్తం గురువారం నాటికి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతుందని, మిగిలిన వారికి కూడా విడతల వారీగా చెల్లింపులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పేదలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన సంకల్పమని ఆయన పునరుద్ఘాటించారు.

## ముంబయి తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

### 15 రోజుల్లో ముంబయిలో సమావేశం నిర్వహిస్తామని హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన ముంబయి తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు సంబంధించి 15 రోజుల్లో ముంబయిలో సమావేశం నిర్వహించి అక్కడి ఉద్యమకారుల వివరాలు, సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం (అమరజ్యోతి) వద్ద తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ప్రతినిధులతో ముంబయి తెలంగాణ ఉద్యమకారుల బృందం బుధవారం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములు నాయక్, కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డి సమావూవేశమైయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ముంబైలో నిర్వహించిన ఉద్యమాలు, ఆందోళనలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, పత్రికా కథనాలు, ఇతర ఆధారాలను కమిటీకి సమర్పించింది. తెలంగాణలోని ఉద్యమకారులకు అందుతున్నట్లుగానే ముంబయిలో ఉద్యమించిన అర్హులైన వారికి కూడా తగిన గుర్తింపు, న్యా యం కల్పించాలని ప్రతినిధులు కోరారు. దీంతో కమిటీ సభ్యులు సమస్యలను సానుకూలంగా పరిశీలించిన కమిటీ సభ్యులు ముంబయి ఉద్యమకారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 15 రోజుల్లో ముంబయిలో సమావేశం నిర్వహించి ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమ సంఘీభావ వేదిక స్టీరింగ్ కమిటీ సభ్యులు అక్కనపెల్లి దుర్గేష్, ఏలిజాల శ్రీనివాస్, బత్తుల లింగం, పొట్ట వెంకటేష్, గుండారపు శ్రీనివాస్‌తోపాటు మొత్తం 25 మంది ప్రతినిధుల బృందం సమావేశంలో పాల్గొన్నారు. ముంబైలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో పాల్గొన్న ప్రతి అర్హుడికి గుర్తింపు కల్పించే వరకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని ప్రతినిధులు తెలిపారు.

# తెలంగాణను 'స్కిల్ క్యాపిటల్'గా తీర్చిదిద్దుతాం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మారుతున్న సాంకేతికత, కృత్రిమ మేధ (ఎఐ)కు అనుగుణంగా తెలంగాణ యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించి రాష్ట్రాన్ని దేశంలోనే 'స్కిల్ క్యాపిటల్'గా తీర్చిదిద్దుతామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ కార్యక్రమాల్లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణాలో బోయింగ్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ (ఎల్‌ఎల్‌ఎఫ్), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సిఐటి డి) సంయుక్తంగా నిర్వహించిన 'బోయింగ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్' ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన యువత, దివ్యాంగులు, వెటరన్స్‌కు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా 'రెడీ టూ వర్క్ ఫోర్స్'ను తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలు, నిపుణులు సమన్వయంతో పనిచేసినప్పుడే నైపుణ్య అంతరం తగ్గుతుందని పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్నామని, ప్రభుత్వ ఐటిఐలను ఆధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అకడమిక్ కరిక్యులమ్‌లో మార్పులు చేస్తూ కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యువత కూడా ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుని భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో బోయింగ్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, సిఐటిడి ప్రతినిధులు ప్రవీణ, యశోద, రష్మీ ప్రభ మిశ్రా, బితుపాన్ బోరా, రత్న శేఖర్ రెడ్డి, ఓం దేవ్, డా. విజయ్ కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ పరిశ్రమలకు రాష్ట్ర నైపుణ్య నిపుణులు

### తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు జపాన్ ప్రతినిధులకు మంత్రి వివేక్ ఆహ్వానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, జపాన్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను రాష్ట్రం నుంచి అందించేలా తెలంగాణ, హిరోషిమా మధ్య దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని నిర్మించనున్నట్లు శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. జపాన్ పర్యటనలో ఉన్న మంత్రి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం బుధవారం హిరోషిమా ప్రిఫెక్చర్ వైస్ గవర్నర్ టోరు యోషిమత్సుతో సమావేశమైంది. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక శిక్షణ, ఉద్యోగాల కల్పన, అంతర్జాతీయ వర్క్‌ఫోర్స్ మొబిలిటీపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చేందుకు 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఎటిసిలు) ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి యువతను అంతర్జాతీయ ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. జపాన్‌లో ఉద్యోగాల కోసం యువతకు జపనీస్ భాషతో పాటు సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణ, ఎంపిక, నియామకం వంటి అంశాల్లో ఇరు ప్రాంతాలు కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సాంకేతికత, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, పెట్టుబడుల రంగాల్లోనూ హిరోషిమాతో భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందన్నారు. హిరోషిమా ప్రిఫెక్చ ర్ ప్రతినిధులు అక్టోబర్‌లో హైదరాబాద్‌లో పర్యటించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఇరు ప్రాంతాల మధ్య సహకారానికి సంబంధించిన నిర్దిష్ట రంగాలను గుర్తించి తదుపరి కా ర్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. డిసెంబర్ 9 నుంచి 11 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026కు హిరోషిమా ప్రభుత్వ, జపాన్ పరిశ్రమల ప్రతినిధులు హాజరుకావాలని మంత్రి వివేక్ వెంకటస్వామి ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, శక్తి శాఖ కార్యదర్శి హరిచందనతో పాటు హిరోషిమా ప్రిఫెక్చర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 28న విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ

### జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ బ్యాంకు విధానాలకు, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో నాటి టిడిపి ప్రభుత్వం చేపట్టిన నిర్ణయాలపై కాంగ్రెస్, వామపక్షాలు, రైతులు, కార్మికులు సాగించిన చారిత్రక విద్యుత్ ఉద్యమానికి ఈనెల 28వ తేదీతో 26 ఏళ్లు పూర్తవుతున్నాయని రాష్ట్ర వామపక్ష పార్టీల నాయకులు గుర్తు చేశారు. ఆనాడు ఉద్యమకారులపై పోలీసు బలగాలు జరిపిన కాల్పుల్లో సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌లు అమరులయ్యారని, వారి దివ్యస్మృతికి నివాళులర్పించేందుకు ఈ నెల 28న విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పోటు రంగారావు (సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్), పి.సూర్యం (సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ), సిహెచ్. మురహరి (ఎస్‌యుసిఐ(సి), గాదగోని రవి (ఎంసిపిఐ (యు), ఎ.జానకి రాములు (ఆర్‌ఎస్‌పి), మామిండ్ల రమేష్ రాజా (సిపిఐ (ఎంఎల్– లిబరేషన్), ప్రసాదన్న (సిపిఐ (ఎంఎల్), ఫార్వర్డ్ బ్లాక్ ప్రతినిధులు తెలిపారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 28న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం నుండి బషీర్‌బాగ్‌లోని విద్యుత్ అమరవీరుల స్థూపం వరకు భారీ ప్రదర్శన, అనంతరం ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, సంస్మరణ సభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు, కార్మికులు, రైతాంగం పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల నేతలు విజ్ఞప్తి చేశారు.

## భూభారతి పేరుతో రియల్ ఎస్టేట్ దందా

### 22ఎ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : రాంచందర్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూభారతి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల భూములను ఇబ్బందులకు గురిచేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. 22ఎ నిషేధిత భూముల వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి, రంగారెడ్డి జిల్లాలకు చెందిన భూ బాధితులు, కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావును కలిసి తమ సమస్యలను వివరించారు. కూకట్‌పల్లి వసంత్‌నగర్, ఆరుట్ల తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తయిన భూములను 22ఎ జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ధరణికి ముందు ఉన్న భూ రికార్డులను పునరుద్ధరించి, ప్రైవేట్ భూములను 22ఎ జాబితా నుంచి తొలగించి ఫ్రీహోల్ చేయాలని కోరారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా రెవెన్యూ అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ సమస్యలపై బిజెపి రాజీలేని పోరాటం చేస్తుందని రాంచందర్‌రావు స్పష్టం చేశారు.

# కౌలు రైతుల కష్టాలు.. తీరేదెప్పుడు?

**● పథకాలన్నీ పట్టాదారులకే ● పంటలపై ఎల్ నినో ఎఫెక్ట్ ● ప్రభుత్వం ఆదుకోవాలని పేద కౌలు రైతుల ఆవేదన**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఏదైనా రైతుకు వ్యవసాయమే జీవనాధారం. అందులో లాభం వచ్చినా నష్టం వచ్చినా వాటిని పట్టించుకోకుండా సుదీర్ఘంగా తన వ్యవసాయ ప్రయాణంలో అలా సాగిపోతూ ఉంటాడు. అతనికి పంట చేలే ప్రపంచం, పశువులు, పక్షులే స్నేహితులు, నేలకొండపల్లి మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ అధికారుల నివేదికల ప్రకారం మండలంలో 4200 ఎకరాలలో పత్తి, 18300 ఎకరాల్లో వరి, 900 ఎకరాల్లో పెసర, కంది,1000 ఎకరాల్లో చెరుకు సాగు చేశారు. అయితే ఇందులో దాదాపు 60 శాతం రైతులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు చెందిన కౌలు రైతులే ఉన్నా రు.

### శాపంగా మారిన అగ్రికల్చర్ యాప్‌లు

గతంలో పంట సాగుకు యూరియా అవసరం కోసం రైతులైన ఆధార్ ప్రాతిపదికన యూరియాను తెచ్చుకునే వారు. కానీ ప్రస్తుతం అగ్రికల్చర్ యాప్‌ల ద్వారా కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. యూరియా, ఇతర మందులను అగ్రికల్చర్ యాప్ ఒటిపిల ద్వారా బుక్ చేసుకోవడం, దానికి కూడా భూమి పాస్‌బుక్ తప్పనిసరి కావడంతో కౌలు రైతులు చేసేదేమీ లేక ఎక్కువ ధరలకు షాపుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ఇక పండిన పంటలు అమ్ముకోవాలన్నా భూముల వివరాలు తప్పనిసరి కావడంతో కౌలు రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరలకు పంటలను అమ్ముకొని అప్పుల పాలవుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయం కూడా కత్తి మీద సాములా మారింది. లేబర్ ఖర్చులు, పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగాయి. పంట పండాలంటే పెట్టుబడి పెట్టాలి. బ్యాంకులు కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదు. చేసేదేమీ లేక పంట పెట్టుబడులకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద డిమాండ్ కొద్ది అధిక వడ్డీతో రుణాలు తెచ్చుకుంటుండగా, మరి కొంతమంది బ్యాంకుల్లో తమ బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టి డబ్బులు తెచ్చుకుంటున్నారు. అటు చేనుకి కౌలు కట్టలేక, తెచ్చిన రుణాలు తీర్చలేక కౌలు రైతు రోజురోజుకు అప్పుల కొలిమిలో మునిగిపోతున్నాడు. యాప్‌లతో తలలు పట్టుకున్న రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ మరింత శాపంగా మారింది. వాతావరణంలో ఎల్‌నినో ప్రభావంతో పంట వేసిన నాటి నుంచి సరైన స్థాయిలో వర్షాలు కురవక మండలంలోని అన్ని గ్రామాలలో పంటలు 90 శాతం ఎండిపోతున్నాయి. పంటలు వేసి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మండలంలో ఒక్క వాన గట్టిగా పడలేదు. మబ్బు పట్టడం ఆ క్షణమే మాయమైపోవడం, విపరీతమైన ఎండలకు కళ్లముందే పంటలు మాడిపోతుంటే రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు.

### అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే

మండలంలో అధిక శాతం రైతులు నిరక్షరాస్యులే ఉన్నారు. వారికి క్షుణ్ణంగా వివరిస్తే తప్ప ఒక అంశం పూర్తిస్థాయిలో అర్థం కాదు. అలాంటిది ఎల్‌నినో ప్రభావం వ్యవసాయంపై ఏ విధంగా ఉంటుంది, దానికి ప్రత్యామ్నాయంగా ఎలాంటి పంటలను సాగు చేసుకోవాలని పేపర్లలో, టీవీలలో చెప్పడమే తప్ప మండల వ్యవసాయ అధికారి క్షేత్రస్థాయిలో అన్ని గ్రామాలలో తిరిగి రైతులకు అవగాహన కల్పించడం లేదని కొన్ని గ్రామాల ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక రైతులకు ప్రభుత్వం ఎలాంటి పథకాలను తీసుకువస్తుంది. పంటలు అధిక దిగుబడులు సాధించాలంటే ఎలాంటి పద్ధతులను పాటించాలని అంశాలను అధికారులు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయపరంగా ఎలాంటి ప్రభుత్వ ప్రయోజనాలు పొందని కౌలు రైతులను ప్రభుత్వాలు వారి ఆవేదనను తెలుసుకుని, వారి సమస్యలను పరిష్కరించి వారి కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వాలే ఆదుకోవాలని నేలకొండపల్లి మండలంలోని కౌలు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం కౌలు రైతుల ఆర్థిక బలోపేతానికి కొన్ని ప్రత్యేక స్కీములు కేటాయించి వ్యవసాయం చేసుకోవడానికి ధీమా కల్పించాలని వేడుకుంటున్నారు.

### సమస్యపై అధికారులకు తెలియజేస్తా




మండలంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పై అధికారులకు తెలియజేస్తా. ప్రస్తుతం కౌలు రైతులకు ప్రభుత్వపరంగా ఎలాంటి స్కీములు లేవు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు ఇంకా మెరుగ్గా క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతాం.

**– మండల వ్యవసాయ అధికారి ఎం.రాధ**

## సర్ ఫేస్–2లో బిఎల్‌ఓలు భాగస్వామ్యం కావాలి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : సర్ ఫేస్2లో ప్రతి బిఎల్‌ఓలు భాగస్వామ్యమై.. అర్హులైన ఓటర్లందరూ జాబితాలో వచ్చేలా పనిచేయాలని ఎస్‌ఐఆర్ ఎల్‌బి నగర్ కోఆర్డినేటర్, గీత కార్మిక పారిశ్రామిక సహకార సంస్థ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్ పేర్కొన్నారు. సర్ ఫేస్2 ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఎల్‌బి నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బిఎల్‌ఓలకు అవగహన కార్యక్రమాన్ని బుధవారం వనస్థలిపురం సుష్మ రోడ్డులోని వెంకటేశ్వర కన్వెన్షన్‌లో నిర్వహించారు. నాగరాజు గౌడ్‌తో పాటు మాజీ కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, ముద్దగోని లక్ష్మి ప్రసన్న, డివిజన్ అధ్యక్షులు హాజరయ్యారు. ఈసందర్భంగా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం రూపొందించిన డ్రాఫ్టరోల్స్‌లో కూడా సగంమంది ఓటర్ల మ్యాపింగ్‌లో తప్పిదాలు ఉన్నాయన్నారు. వారందరికీ నోటీసులు వస్తున్నాయని తెలిపారు. ఆ నోటీసులు వచ్చిన వారు సరైన ఆధారాలు సమర్పించేలా బిఎల్‌ఓలు బాధ్యత తీసుకొని పనిచేయాలన్నారు. ఎస్‌ఐఆర్‌లో భాగంగా ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్, డూప్లికేట్ పేరుతో తొలగించేందుకు సిద్ధం చేసిన ఓటర్ల వివరాలను గుర్తించి,, అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా బిఎల్‌ఓలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు, టెంపుల్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందించేందుకే వారాంతపు సంత



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: ప్రజలకు నాణ్యమైన కూరగాయలను అంధించేందుకే వారాంతపు సంతను ఏర్పాటు చేశామని సర్పంచ్ ఆర్.బాబునాయక్ వివరించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల గ్రామంలో సర్పంచ్ ఆర్.బాబునాయక్ ఆధ్వర్యంలో వారాంతపు సంతను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని గ్రామంలోనే వారాంతపు సంతను ఏర్పాటు చేశామని వివరించారు. కూరగాయల కోసం షాద్‌నగర్‌కు వెళ్ళకుండా గ్రామంలోనే తాజా కూరగాయాలు, నిత్యావసర సరుకులు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రైతులు తమ పొలాల్లో పండించిన పంటలు, కూరగాయాలను ఎలాంటి మధ్యవర్తులు, దళారులు లేకుండా నేరుగానే విక్రయించేందుకు సంతలో అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గతంలో కూరగాయల కోసం గ్రామం నుండి షాద్‌నగర్ ప్రాంతానికి వెళ్ళేవారని, ప్రస్తుతం అలా లేకుండా నేరుగానే గ్రామంలో ఏర్పాటు చేసిన సంతలో విక్రయించుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జయరాంరెడ్డి, కావాలి నర్సింహులు, అనిమి శివారాజ్ గౌడ్, ఉప సర్పంచ దొడల వెంకటేష్ యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ దాస్యనాయక్, బాలరాజ్ గౌడ్, కావలి జగన్, జాంగారి రవి, కటికెల తిరుపతి, దొడ్డి రవీందర్, కావలి జంగయ్య, తుప్పరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుంది



ప్రజాపక్షం/కేశంపేట: యువత కాంగ్రెస్ మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పిప్పల్ల శ్రీనాథ్‌ను సింగిల్ విండో చైర్మెన్ శ్రీధర్‌రెడ్డి ప్రత్యేకంగా సన్మానించారు. బుధవారం కేశంపేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన శ్రీనాథ్‌ను అభినంధించడంతోపాటు సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు ఎల్లప్పుడు తగిన గుర్తింప్తు లభిస్తుందని వివరించారు. పార్టీ కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదిరేకుల సర్పంచ్ కవిత కరుణాకర్‌రెడ్డి, అల్వాల సర్పంచ్ సురేష్‌రెడ్డి, బోదునంపల్లి సర్పంచ్ నాగేష్, మంగళిగూడ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయమ్మ, రాజేందర్ రెడ్డి, కోడూరి రాములు, హరీష్‌రెడ్డి, కోడిపర్తి శ్రీకాంత్, హబీబ్, అఖిల్, శ్రీకాంత్, సచిన్, మహేష్‌తోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి సహకారం



ప్రజాపక్షం/హయత్‌నగర్: ఆలయాల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని, ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎల్ బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బుధవారం నాగోల్ డివిజన్ పరిధిలోని మహంకాళి, పోచమ్మ దేవతల విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు చెరుకు చిరంజీవిగౌడ్, బద్దం మహేందర్ , చింతల సురేందర్ యాదవ్, అనతుల సురేందర్ యాదవ్, తూర్పాటి చిరంజీవి, పి.రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## శాంతి మార్గాన్ని చాటిన మహ్మద్ ప్రవక్త

ప్రజాపక్షం/కొందుర్గు: శాంతి మార్గాన్ని చాటిన ఏకైక వ్యక్తి మహ్మద్ ప్రవక్త అని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాధిక్ అన్నారు. బుధవారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మండల ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సయ్యద్ సాధిక్ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ ఆత్మీయంగా జీవించాలని సూచించారు. అప్పుడే సమాజం అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

# భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

### బందోబస్తు పర్యవేక్షించిన కొత్వాల్ సజ్జనార్

ప్రజాపక్షం/చార్మినార్: మహ్మద్ ప్రవక్త పుట్టినరోజును పురస్కరించుకుని జరుపుకునే మిలాద్ ఉన్ నబీ పండగను బుధవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాలలో మత పెద్దలు ప్రవచనాలు ప్రవచించగా.. వివిధ ప్రాంతాలలో యువకులు భారీగా ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలోనే చారిత్రాత్మక చార్మినార్ నుంచి మార్కజ్ ఏ మీలాద్ జూలూస్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభమయ్యింది. నారే తక్బీర్.. అల్లా హో అక్బర్...అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ మత పరమైన జెండాలను చేత బూని యువకులు భారీ ర్యాలీగా ముందుకు సాగారు. ర్యాలీని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫేకర్ అలీ, ముస్లిం మత పెద్దలు కామిల్ పాషా ఖాద్రీ, జూనైద్ పాషా,ఖాద్రియా ఇంటర్‌నేషనల్ సంస్థ అధ్యక్షుడు సయిూద్ ఖాద్రీ, హాఫేజ్ ముజఫర్ ఆలీఖాన్, జూనైద్ పాషా, శుజ ఇఫ్తేకరి, సైఫ్ పాషా, అలీ ఖాద్రి. తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జుల్ఫాకర్ ఆలీ మాట్లాడుతూ, మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో పయనిస్తే శాంతి నెలకొంటుందన్నారు. చార్మినార్ నుంచి ప్రారంభమైన ర్యాలీ గుల్జార్ హౌజ్, పత్తర్‌గట్టి, మదీన, సాలార్‌జంగ్ మ్యూజియం, దారుల్‌షిఫా, మీరాలం మండి, ఇత్తెబార్ చౌక్, బీబీ బజార్ చౌక్ నుంచి మొగల్‌పురా వాల్టా హోటల్ వరకు కొనసాగింది. కాగా మధ్యాహ్నం నుంచి పాతబస్తీలోని



వివిధ దర్గాలు, మసీదులు, క్రీడామైదానాలు, ఫంక్షన్ హాల్‌లలో జరిగిన సభలలో ధార్మిక పండితులు, ముస్లిం మత పెద్దలు పాల్గొని ప్రసంగించారు. మహ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను క్లుప్తంగా వివరించారు. పలు సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మొగల్‌పురా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ, యువకులు మహ్మద్ ప్రవక్త చెప్పిన మార్గంలో ప్రయాణిస్తే తిరుగులేని విజయాన్నిసాధిస్తారన్నారు. ఊరేగింపునకు చార్మినార్ సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద మాజీ కార్పొరేటర్ మహ్మద్ గౌస్ ప్రజలకు మిఠాయిలు తదితర ఆహార పదార్థాలను పంచిపెట్టారు. దక్షిణమండలం డిసిపి కిరణ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

**కొత్వాల్ శుభాకాంక్షలు...** ర్యాలీ పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నగర పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కొత్వాల్ సజ్జనార్ ఉన్నతాధికారులతో కలిసి చార్మినార్ వద్ద భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పర్యవేక్షించారు. ఊరేగింపు చార్మినార్ వద్దకు చేరుకోగానే ఆయన ముస్లిం మత పెద్దలకు ఆత్మీయంగా పూలమాలలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఊరేగింపును ప్రశాంతంగా నిర్వహిస్తున్నందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపి సజ్జనార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం ఎల్లప్పుడూ శాంతిభద్రతలకు, పరమత సహనానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఇక్కడి విశిష్ట గంగా జమునా తెహజీబ్ సంస్కృతికి ఈ వేడుకలే నిదర్శనమని ఆయన కొనియాడారు.



## 'నీట్' ప్రవేశ పరీక్షా కేంద్రం తనిఖీ



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : ఫ్యూచర్ సిటీ కమీషనర్ రేట్ పరిధి ఇబ్రహీంపట్నం సమీపంలో ఈనెల 30న శేరిగూడ గ్రామ సమీపంలో శ్రీ చక్రా కళాశాలలో ఐఓఎన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో జరిగే నీట్ పీజి ప్రవేశ పరిక్షా కేంద్రాన్ని ఇబ్రహీంపట్నం ఎసిపి కెపివి రాజు, సిఐ మహేందర్‌రెడ్డి బుధవారం సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ పరీక్ష కేంద్రం ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

### షాద్‌నగర్ జోన్ డిసిపి శిరీష

ప్రజాపక్షం/రంగారెడ్డి: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని షాద్‌నగర్ జోన్ డిసిపి శిరీష పోలీస్ అధికారులకు దిశ నిర్దేశం చేశారు. బుధవారం మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బందోబస్తు విధులకు నియమించబడిన పోలీసు అధికారులు, సిబ్బందికి షాద్‌నగర్ జోన్ డిసిపి శిరీష ప్రత్యేక బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి చేయాల్సినవి, చేయకూడనివి, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధుల నిర్వహణలో అప్రమత్తత తదితర



అంశాలపై సమగ్రంగా సూచనలు చేశారు. మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు అన్ని ముందస్తు బందోబస్తు చర్యలు చేపట్టారు. బ్రీఫింగ్ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎసిపిఎస్.లక్ష్మీనారాయణ, షాద్‌నగర్ ఎస్‌హెచ్ఓ, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

### ఎఐసిసి కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ పి.వి.మోహన్

ప్రజాపక్షం/రంగారెడ్డి: పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యం అని ఎఐసిసి కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ పి.వి.మోహన్ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ పాల్గొని, మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బాగిచా ఫామ్‌హౌస్‌లో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐసిసి కార్యదర్శి పి.వి.మోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ నాయకత్వం, ఆలోచనలు, మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. "పార్టీ కామ్‌దార్ నైతికత లక్ష్యం వ్యూహం" అనే స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత





పటిష్టం చేస్తూ, ప్రజలకు చేరువైన సమర్థవంతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. సమావేశంలో టిపిసిసి అబ్జర్వర్లు, సత్తుపలిమ్మెల్యే డాక్టర్.మట్టా రాగమయి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఇ.వి.శ్రీనివాస్‌రావుతో పాటు టిపిసిసి కార్యదర్శి రాంరెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు సత్యానారాయణరెడ్డి, గౌరిసతీష్, జనార్ధన్‌రెడ్డి, అశ్వక్, జిల్లా లైబ్రరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ షాబాద్ సోనియా దర్శన్, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్, చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి, మానయ్య, సత్యనారాయణ, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైలులో దొరికిన డ్రగ్‌తో అక్రమ దందా

### ఇద్దరు పోలీసుల అరెస్ట్

### 1.6 కిలోల మెథాక్వాలోన్ స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్: రైలులో దొరికిన నిషేధిత మాదకద్రవ్యాన్ని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టి..వాటిని విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదించేందుకు ప్రయత్నించిన ఇద్దరు తెలంగాణ స్పెషల్ పోలీస్ కానిస్టేబుళ్లు అరెస్టయ్యారు. నాంపల్లి తెలుగు యూనివర్సిటీ సమీపంలోని యూని గ్యాస్ పంపు పక్కనున్న లేన్‌లో డ్రగ్‌ను డెడ్‌డ్రాప్ చేసేందుకు వచ్చిన సమయంలో సిసిఎస్ డిటెక్టివ్ విభాగం ఇఒడబ్ల్యూ1 బృందం వారిని అదుపులోకి తీసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. టిజిఎస్‌పి కానిస్టేబుళ్లు పులకారం స్వామి (36), సుగూరి నరహరి గౌడ్ (38) ఇద్దరూ ప్రస్తుతం తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. వీరిని రైల్వేల్లో డ్రగ్స్, గంజాయి తరలించే వారిపై నిఘా పెట్టే విధులకు కేటాయించారు. ఈ క్రమంలో ఈనెల 4న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేస్తుండగా జనరల్ బోగీలో సీటు కింద గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లిన పాలిథిన్ కవర్‌ను గుర్తించారు. ఆ కవర్‌లో తెల్లటి క్రిస్టల్ పౌడర్ ఉండటంతో అది నిషేధిత డ్రగ్ అయి ఉండొచ్చని అనుమానించినప్పటికీ.. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయకుండా ఇద్దరూ దానిని స్వాధీనం చేసుకున్నారు. వినియోగదారులకు విక్రయించి డబ్బు సంపాదించేందుకు పథకం వేశారు. ఇటీవల కొందరు డ్రగ్ వినియోగదారుల వివరాలు లభించడంతో వారిని సంప్రదించి మెథాక్వాలోన్ విక్రయించేందుకు ప్రయత్నించారు. వారం రోజుల క్రితం నాంపల్లి యూని గ్యాస్ పంపు సమీపంలో మెథాక్వాలోన్‌ను డెడ్‌డ్రాప్ చేసినట్లు నిందితులు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈక్రమంలో సోమవారం మరోసారి 100 గ్రాముల డ్రగ్‌ను డెడ్‌డ్రాప్ చేసేందుకు నాంపల్లి ప్రాంతానికి యూనికార్న్ బైక్‌పై వచ్చిన సమయంలో ఇఒడబ్ల్యూ1 పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 1.6 కిలోల మెథాక్వాలోన్, మూడు మొబైల్ ఫోన్లు, యూనికార్న్ బైక్, బ్యాక్‌ప్యాక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎసిపి ఎం.కిరణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సమాజాన్ని శాంతివైపు నడిపించిన మహ్మద్ ప్రవక్త

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్: సమాజాన్ని శాంతివైపు నడిపించిన మహోన్నత వ్యక్తి మహ్మద్ ప్రవక్త అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్‌లో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సర్వమత సమానత్వమే ప్రపంచాన్ని నడిపిస్తుందని, స్వేచ్ఛ, సమానత్వం, మానవత్వం మహ్మద్ ప్రవక్త మార్గమని గుర్తు చేశారు. ప్రస్తుత సమాజంలో కొంతమంది స్వార్థ పరులు మతాల మధ్య చిచ్చుపెట్టెందుకు తీవ్రంగా యత్నిస్తున్నారని వివరించారు. సర్వమత సమానత్వమే నాటి నుండి నేటి వరకు భారతదేశాన్ని నడిపిస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరం గ్రహించాలని పేర్కొన్నారు. అన్ని మతాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, విధ్వంసాలు సృష్టిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వివరించారు. మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, మార్కెట్ కమిటి వైస్ చైర్మెర్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇబ్రహీం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఖదీర్‌తోపాటు కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రవక్త బోధనలు సమాజానికి ఆదర్శం

**కొత్తూరు:** మహ్మద్ ప్రవక్త బోధించిన కరుణ, దయా, శాంతి, సోదర భావం సమాజానికి ఎల్లప్పుడు ఆదర్శనీయమని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కొత్తూరు మండలం జెపి దర్గాలో మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు బాబాకు ఛాదర్ సమర్పించి బాబాకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు విల్లివిరియాలని బాబాను ప్రార్థించినట్లు తెలిపారు. మహ్మద్ ప్రవక్త బోధించిన కరుణ, ప్రేమ, శాంతి మార్గాలు సర్వమానవాళికి ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్ అనూష రవీందర్‌రెడ్డి, బాల్‌రాజ్, రషీద్, నవాజ్, డీలర్ కుమార్, శివచారి, అయూబ్‌తోపాటు



మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

### శాంతి, సోదరభావానికి ప్రతీక

శాంతి, సోదరభావానికి ప్రతీక మిలాద్ ఉన్ నబీ వేడుకలని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం జెపి దర్గాలో బాబాకు ఛాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రజలందరు ఐక్యమత్యంతో, పరస్పర గౌరవంతో జీవిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, మానవత్వం మహ్మద్ ప్రవక్త మార్గమని అంజయ్య యాదవ్ గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత గోపాల్‌నాయక్, ఈట గణేష్, లావణ్య దేవేందర్ యాదవ్, మిట్టునాయక్, పెంటనోళ్ల యాదగిరి, కోస్గి శ్రీనివాస్, రవీందర్ నాయక్ పాల్గొన్నారు..



## 70వ జోనల్ స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడాపోటీలు

శామీర్‌పేట జోనల్ క్రీడల కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఉమ్మడి శామీర్‌పేట 70వ జోనల్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు శామీర్‌పేట జోనల్ క్రీడల కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లి విజిత టెక్నో స్కూల్ వేదికగా ఈ క్రీడలు జరుగుతాయని చెప్పారు. ఈ క్రీడోత్సవంలో భాగంగా సెప్టెంబర్ 1న వాలీబాల్, 2న ఖోఖో, 3న కబడ్డీ పోటీలు జరుగనున్నాయి. అండర్ 14విభాగంలో పోటీపడేవారు 01.01.2013 తర్వాత అండర్ 17 విభాగంలో పాల్గొనేవారు 01.01.2010 తర్వాత జన్మించిన వారై ఉండాలని నిర్వాహకులు స్పష్టం చేశారు. కబడ్డీ క్రీడాకారులకు బరువు నిబంధనలు వర్తిస్తాయని అండర్ 14 విభాగంలో బాలురు 51 కేజీలు, బాలికలు 48కిలోలు, అండర్ 17 విభాగంలో బాలురు 57 కిలోలు, బాలికలు 55 కిలోలు బరువు పరిమితి దాటకూడదని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఎలిజిబిలిటీ ఫారాలు ఫోటోతో కూడిన సర్టిఫికెట్లను ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు తూంకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమర్పించాలని చెప్పారు. ఎలిజిబిలిటీ ఫారాలు సమర్పించని టీమ్‌లను టోర్నమెంట్‌లో అనుమతించబడదన్నారు. అదే రోజు మధ్యాహ్నం 1 గంటకు టీమ్‌ల డ్రాలు తీయబడునని పూర్తి వివరాలకు 9849416773 నెంబర్‌లను సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.



## సిఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2 లక్షల మంజూరు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నాగారం డివిజన్ పరిధిలోని నాగారానికి చెందిన చిర్ర నాగేశ్వరరావుకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 2 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. చిర్ర నాగేశ్వరరావుకు కిడ్నీ సంబంధిత సికెడి వెనోప్లాస్టీ చికిత్సకోసం హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ సిఫారసుతో 2 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు సిఎం కార్యాలయం తెలిపింది. నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి వారికి అందజేశారు. చికిత్సకు ఆర్థికసాయం మంజూరు చేసిన ఎంపి ఈటలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## గిరిజన డిక్లరేషన్ అమలు చేయాలి

సేవాలాల్ సేన డిమాండ్




**ప్రజాపక్షం/ఉప్పల్ :** గిరిజన డిక్లరేషన్ అమలు చేయటంతో పాటు గిరిజన సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంజీవ నాయక్ డిమాండ్ చేసారు. దీనికోసం రాష్ట్రవ్యాప్త ఆందోళనలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని పిలుపిచ్చారు. ఉప్పల్‌లో బుధవారం జరిగిన సేవాలాల్ సేన రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదాన ప్రాంత ఐటిడిఏలను ఏర్పాటు చేయాలని, బంజారాలకు చట్ట సభల్లో ప్రాతినిథ్యం ఇవ్వాలని, ఏజన్సీ హక్కుల సాధనకు ఉద్యమించి జిఓ 3ను సాధించాలని, ప్రయివేట్ విశ్వవిద్యాలయా ల్లో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్ లేకుండా ప్రభుత్వ అజమాయిషీ లేకుండా ఫీజుల నియంత్రణ లేని వాటిని రద్దు చేయాలని, బంజారాలకు మంత్రి మండలిలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ నాయక్, మాలోత్ సైదా నాయక్, వెంకన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య పనుల పరిశీలన

**ప్రజాపక్షం/పరిగి:** పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఉదయం వీధులు, మురుగు కాలువలను శుభ్రంచేసి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలనీ, డ్రైనేజీలలో నీరు నిల్వ ఉండకుంగా చూడాలని పరిగి మున్సిపల్ కార్యాలయంలో మార్నింగ్ అంటెండెన్స్ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు ముఖ్యమైన శానిటేషన్ సూచనలు చేసిన చైర్‌పర్సన్, నిత్య పారిశుద్ధ్యం ప్రతిరోజు వీధులను ఉడ్చడం డ్రైనేజిలను శుభ్రం చేయడం చెత్తను తొలగించడం, సేకరించడం జరగాలన్నారు. డంపింగ్ యార్డుకు తరలించాలన్నా రు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా, తడి పోడి చెత్త బుట్టలను వాడేలా ప్రోత్సహించాలని సిబ్బందికి తెలిపారు. బస్టాండ్లు, మార్కెట్లు, రద్దీ ప్రదేశాలలో పారిశుద్ధ్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని ఆదేశించారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** స్థానిక చెన్నాపూర్‌లోని భాగ్యనగర్ కమాన్ సమీపంలో బుధవారం ఒక గుర్తుతెలియని మహిళ కుళ్లిపోయిన స్థితిలో శవమై కనిపించినట్లు జవహర్‌నగర్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ కానిస్టేబుల్ ఎం.కె. అవినాష్, హెచ్.జి శ్రీనివాస్ పెట్రోల్ మొబైల్ I విధులు నిర్వహిస్తుండగా, మధ్యాహ్నం 13:50 గంటల సమయంలో సురేష్ అనే స్థానికుడు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. భాగ్యనగర్ కమాన్ వద్ద రోడ్డు పక్కన ఉన్న ఒక చిన్న టెంట్ కింద మహిళ మృతదేహం పడి ఉందని తెలిపారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సదరు మహిళ సుమారు 4 నుండి 5 రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చని, మృతదేహం తీవ్రంగా కుళ్లిపోయి ఉబ్బిన స్థితిలో ఉందని గుర్తించారు.

**మృతురాలి వివరాలు :** సుమారు 40 నుండి 45 సంవత్సరాలు తెల్లని ఆకుల డిజైన్ కలిగిన ఆకుపచ్చ రంగు నైలాన్ చీర, జుట్టుకు నల్ల రంగు వేసుకుని ఉంది. స్థానికులను విచారించగా సదరు మహిళ గత కొంతకాలంగా ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ, ఫుట్‌పాత్‌పై నివసిస్తుండేదని చెప్పారు. అయితే ఆమె పేరు, ఊరు, ఇతర వివరాలు తెలియరాలేదు. ఆమె మరణానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని గుర్తించేందుకు మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు వేగవంతం చేశారు.

# డిజిటల్ అరెస్ట్ మోసం నుంచి రూ.85.20 లక్షలు సేఫ్

- 85 ఏళ్ల రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని టార్గెట్ చేసిన సైబర్ మోసగాళ్లు
- టిజిసిఎస్‌బి చాకచక్యంతో మొత్తం నగదు ఫ్రీజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'డిజిటల్ అరెస్ట్' పేరుతో 85 ఏళ్ల రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని భయపెట్టి రూ.85.20 లక్షలు బదిలీ చేయించిన సైబర్ నేరగాళ్లకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టిజిసిఎస్‌బి) అధికారులు షాక్ ఇచ్చారు. బాధితుడు ఫిర్యాదు చేసిన వెంటనే అప్రమత్తమైన అధికారులు వేగంగా మనీ ట్రయిల్‌ను గుర్తించి, నిందితుల బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేయడంతో బాధితుడు బదిలీ చేసిన మొత్తం రూ.85.20 లక్షలు సురక్షితంగా తిరిగి పొందే అవకాశం కల్పించారు. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన వృద్ధుడికి ఈ నెల 21న ఓ వ్యక్తి ఎన్ఐఏ అధికారినంటూ వీడియో కాల్ చేశాడు. పోలీసు, ఎన్ఐఏ తరహా యూనిఫాం ధరించి తెలుగులో మాట్లాడిన నిందితుడు.. బాధితుడి ఆధార్ వివరాలను దుర్వినియోగం చేసి అబ్దుల్ సలామ్ అనే వ్యక్తి కర్ణాటక, కేరళల్లో రూ.2.50 కోట్ల



అక్రమ లావాదేవీలు జరిపాడని బెదిరించా డు. కేసు నుంచి బయటపడాలంటే ఆర్‌బిఐ వెరిఫికేషన్ పేరుతో నిర్దేశించిన బ్యాంకు ఖాతాకు డబ్బు పంపాలని సూచించాడు. దీంతో బాధితు డు రూ.85.20 లక్షలు బదిలీ చేశాడు. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత నగదు తిరిగి ఇస్తామని నమ్మించాడు. అనంతరం మరో రూ.42 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు బ్యాంకును సంప్రదించగా సైబర్ మోసానికి గురైనట్లు తెలిసింది. వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా టిజిసిఎస్‌బి అధికారులు రంగంలోకి దిగారు. మనీ ట్రయిల్‌ను వేగంగా అనుసరించి కోయంబత్తూరులోని బ్యాంకు శాఖలో ఉన్న అనుమానిత ఖాతాను ఫ్రీజ్ చేశారు. దీంతో మొత్తం రూ.85.20 లక్షలు సురక్షితమయ్యాయి. తదుపరి చట్టపరమైన చర్యల కోసం కేసును మల్కాజిగిరి సిసిపిఎస్‌కు బదిలీ చేశారు.

**అప్రమత్తంగా ఉండాలి: టిజిసిఎస్‌బి**

పోలీసులు, ఎన్ఐఎ,సిబిఐ, ఆర్‌బిఐ లేదా ఇతర ప్రభుత్వ అధికారులు 'వెరిఫికేషన్', 'దర్యాప్తు', 'సెక్యూరిటీ' పేరుతో ఎవరినీ బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ చేయమని కోరరని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ స్పష్టం చేశారు. యూనిఫాంలు, నకిలీ పత్రాలు, వీడియో కాల్స్, అరెస్టు చేస్తామనే బెదిరింపులతో మోసగాళ్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే భయపడకుండా, డబ్బు బదిలీ చేయకుండా, విషయాన్ని ఎవరికీ చెప్పొద్దన్న నిందితుల మాటలు నమ్మకుండా వెంటనే అధికారిక మార్గాల్లో సమాచారం నిర్ధారించుకోవాలని సూచించారు. ఆర్థిక సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కు కాల్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన మొత్తాన్ని సురక్షితంగా నిలిపివేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి

ఆర్‌టిఏ మెంబర్, టిఎంయు గౌరవ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని జిల్లా ఆర్‌టిఏ మెంబర్, హకింపేట డిపో టిఎంయు గౌరవ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం హకింపేట ఆర్‌టిసి డిపో టిఎంయు గౌరవ అధ్యక్షుడుగా బీమిడి జైపాల్‌రెడ్డి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయు)రాష్ట్ర అధ్యక్షులు శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వాత్థామరెడ్డి చేతుల మీదు గా హకింపేట డిపో ఆర్‌టిసి టిఎంయు గౌరవ అధ్యక్షుడుగా నియమితులైన బీమిడి జైపాల్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో అలాగే గత ప్రభుత్వ హయాంలో ఆర్‌టి సి కార్మిక సోదర సోదరీమణులు చేపట్టిన అనేక ఉద్యమాలకు తాను మద్దతు తెలిపిన విషయాల ను గుర్తుచేశారు. సిఎం రేవంత్‌రెడ్డి న్యాయకత్వంలో రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సారథ్యంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రీజినల్ అధ్యక్షుడు పవన్‌కుమార్, కార్యదర్శి శివకుమార్, నాయకులు తులసిరామ్, శ్రీశైలం, శ్రీనివాస్, వెంకటేష్, కృష్ణ, మాలిక్,తదితరులు పాల్గొన్నారు.

## పోచారం గ్రామశాఖలకు నూతన అధ్యక్షులు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** డివిజన్‌లో కాంగ్రెస్ గ్రామ శాఖల బలోపేతానికి నూతన అధ్యక్షుల కు నియామక పత్రాలు అందజేశారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల కృష్ణారెడ్డి, పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాబోయే ఎన్నిక ల్లో పార్టీ విజయానికి సమష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నీరుడు కుమార్, ఎర్ర మాధవి, బద్దం కుమార్, ఈశ్వర్ యాదవ్, మెట్టు గణేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రతి కాలనీలో భద్రత కోసం సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ నిమోజకవర్గంలోని సోనియాగాంధీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోయేషన్ ఫేజ్2 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాలనీ ప్రజల రక్షణకు సిసి కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన అన్నారు. కాలనీలో నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మరింత భద్రత కల్పించేందుకు సిసి కెమెరాల ఏర్పాటు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల గుర్తింపు కమిటీ హామీపై హర్షం

తెలంగాణ ఉద్యమ సంఘీభావ వేదిక

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** ముంబై తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ హామీనివ్వడం హర్షణీయమని తెలంగాణ ఉద్యమ సంఘీభావ వేదిక కన్వీనర్‌లు అక్కెనపల్లి దుర్గేశ్ , ఏలిజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ తెలంగాణ అమరవీరుల స్మృతి వనం కార్యాలయంలో వేదిక సభ్యులు బత్తుల లింగం, పొట్ట వెంకటేశ్‌తోపాటు 25 మంది ప్రతినిధుల బృందంతోపాటు వారు ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు ఎంఎల్ సి ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎంఎల్‌సి సభావత్ రాములు నాయక్, సభ్యులు మోతె శోభన్ రెడ్డిలను కలిసి మోమోరాండం అందజేసిన అనంతరం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ముంబయిలో నిర్వహించిన ఉద్యమాలు, ఆందోళనలు, ర్యాలీలు తదితర కార్యక్రమాల ఫొటోలు, వీడియోలు, పత్రికా కథనాలు కమిటీకి సమర్పించామన్నారు. ముంబైలో ఉద్యమించిన అర్హులైన వారందరికీ గుర్తింపు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. గుర్తింపు కమిటీ సభ్యులు సైతం తమ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారని, 15 రోజుల్లో ముంబైలో సమావేశం నిర్వహిస్తామని హామీనిచ్చారని తెలిపారు.

## మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో ఆధ్యాత్మిక సందడి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మహ్మద్ ప్రవ క్త జన్మదినాన్ని పురస్కరించుకుని మిలా ద్ ఉన్ నబీ సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ జమా మసీదు సమీపంలో జల్సా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీద్ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కార్యక్రమంలో జమా మసీద్ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ అజీజ్, మహమ్మదీ మసీద్ అధ్యక్షుడు షాషాభాయ్, హనీఫ్, తాహెర్, అక్బర్, నబి, షకీల్, బిఆర్‌ఎస్‌కు చెందిన ఫరూక్ బాయ్, రెహమాన్, అష్రఫ్, సల్మాన్, సామాజిక మాధ్యమాల ప్రతినిధి సిరాజ్ పాల్గొన్నారు. మిలాద్ ఉన్ నబీ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రవక్త మహ్మ ద్ బోధనలు, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి సందేశాలను గుర్తచేశారు. కార్యక్రమం సందర్భంగా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

## క్రైస్తవ నాయకత్వానికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** క్రైస్తవ సమాజ అభివృద్ధి సంక్షేమం సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఘట్‌కేసర్ మండల్ పాస్టర్స్ లీడర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాడింది. నూతన కార్యవర్గ సభ్యులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బిషప్ విల్సన్ సింగం వైస్ చైర్మన్ శంకర్‌లూ కు రాష్ట్ర క్రైస్తవ నాయకులు గడ్డం సాల్మ న్ మోజేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, వేముల మహేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటుకల కృష్ణారెడ్డి, కర్రె రాజేష్, ఎర్ర మాధవిరాజు, భోజిరెడ్డి, నర్సింగ్ ముదిరాజ్, పాల్గొన్నారు. క్రైస్తవ సమాధుల అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా 75 లక్షల నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేసినట్లు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. క్రైస్తవవుల అభివృద్ధి సంక్షేమానికి అండగా ఉంటానని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం లో అధ్యక్షుడు రెవ జాన్‌మార్క్ భూపతి, ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాస్, కార్యనిర్వహణ అధ్యక్షుడు దేశభక్తిని రాజేష్, ప్రధాన కార్యదర్శి రెవ ఈ మార్టిన్, కోశాధికారి పాస్టర్ సునీల్ కుమార్, ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు పాస్టర్లు బిషప్‌లు క్రైస్తవ కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఖరీఫ్ సాగుకు సవాలక్ష ఆంక్షలు

**ప్రజాపక్షం/వికారాబాద్:** ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో కర్షకులను కష్టాలు వెంటాడుతున్నాయి. ఒకవైపు ఎరువుల కోసం యాప్ సోపాలుపడుతుండగా మరోవైపు 7 రకాల సన్నాలకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్ద ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిబంధన పెట్టింది. ఇప్పటికే ఎల్‌నినో విపత్తు ఎలాంటి నష్టం కలిగిస్తుందోనని అందోళనలో ఉన్న రైతులకు ఈ కొర్రీలు కొరకరాని కొయ్యగా మారాయి. ఎప్పటి లాగే ఏటా రైతులు జూన్ మాసంలో నారుపోశారు. ఎల్‌నినో ముప్పుపొంచి ఉందని వరి సాగుకు బదులు ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేయాలని, శాస్త్రవేతలతో పాటు వ్యవసాయశాఖ అధికారులు, అన్నదాతలకు రైతు వేదికల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించారు. యూరియా పంటలకు కాకుండా ఇతర అవసరాలకు వాడుతూ సబ్సిడీని పక్కదారి పట్టిస్తున్నారని వ్యవసాయశాఖ ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చింది. దీంతో స్మార్ట్ ఫోన్లు లేని రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి, ఫోన్లు కొనుగోలు చేసి యూరియా బుక్ చేయించుకున్నారు. అన్నిరకాల ఎరువులను యాప్ ద్వారానే విక్రయిస్తామంటూ పాత యాప్‌ను రద్దు చేసి కొత్తయాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. అందులో మూతబడిన షాపులో ఎరువులు ఉన్నట్లు చూపుతోంది. దీంతో రోడ్లమీద ధర్నాలు చేయాల్సిన పరిస్థితి జిల్లాలో నెలకొంది. నిబంధనల పేరుతో సర్కార్ ఒకవైపు రకరకాల సమస్యలు సృష్టిస్తుంటే ప్రకృతి సైతం ఎల్‌నినోతో రైతులను పగబట్టింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో సరైన వర్షాలు కురవక ఏకంగా పెద్ద మొత్తంలో సాగు తగ్గింది.

ఇన్నిరకాల సమస్యల మధ్య పంటలు సాగు చేసిన రైతులకుఈసారి పంటలు చేతికందుతాయోలేవోనని తలలు పట్టుకుంటున్నారు. వరికి బోనస్ వస్తుందో లేదోనని ఆవేదన చెందుతున్నారు. సన్న ధాన్యానికి బోనస్ రావాలంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వం ఈసారి నిబంధన పెట్టింది. 7రకాల విత్తనాలను సాగుచేస్తేనే బోనస్ వస్తుందని వ్యవసాయ అధికారులు స్పష్టం చేశారు. విత్తనాలు కొనుగోలు చేసి 2నెలలు గడచిపోయిందని ఇప్పుడు రశీదు కోసం డీలర్ వద్దకు వెళ్లాలంటే ఎలాగని రైతులు మండిపడుతున్నారు. రశీదు పోయిన వరి పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు.



## అంధ క్రికెటర్లను ప్రభుత్వం ప్రోత్సహించాలి

**ప్రజాపక్షం/రవీంద్రభారతి:** జాతీయ అంధుల క్రికెట్ దినోత్సవాన్ని తెలంగాణ అంధుల క్రికెట్ సంఘం (సిఎబిటి) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా అర్జున అవార్డు గ్రహీత, అంధ క్రికెటర్ అజయ్ కుమార్ రెడ్డి హాజరై, మాట్లాడారు. అంధులు అయినప్పటికీ ఆత్మస్థైర్యంతో క్రికెట్‌లో ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో అంధ క్రికెట్ క్రీడాకారులు మరిన్ని అవార్డులు సాధించాలని సూచించారు. సిఎబిటి అధ్యక్షులు జి.శ్రీధర్, కార్యదర్శి అనిల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంధ క్రికెటర్లకు ప్రోత్సాహం కల్పించి, మెరుగైన వసతులు అందించాలని కోరారు. అనంతరం ప్రతిభ కనబరిచిన అంధ క్రికెటర్లకు బహుమతులు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో సిఎబిటి కోశాధికారి డాక్టర్ సి.హెచ్.హరీశ్ కుమార్, జనహిత వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఉమా మహేశ్వర్ రెడ్డి, ఉదయ్ ప్రవీణ్, కృష్ణవేణి, అఖిలేష్, కులకర్ణి, అంతర్జాతీయ న్యాయవాది శ్రీనివాస్ కావేటి తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్‌సి అగ్రికల్చర్ 5శాతం కోటా రద్దుపై ప్రభుత్వం పునరాలోచించాలి

తెలంగాణ డిప్లొమా ఎఇఒల సంఘం విజ్ఞప్తి

**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** తమకు ఏకైక పదోన్నతి అవకాశం ఉన్న ఇన్ సర్వీస్ బిఎస్‌సి అగ్రికల్చర్ 5శాతం కోటా రద్దు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి, న్యాయం చేయాలని తెలంగాణ డిప్లొమా ఏఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ప్రధానకార్యదర్శి శ్రవణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఎఇఒలు సయ్యద్ అక్రమ్, చెలికాని రాజు, రావుల అరుణ్, నాగరాజు, సందీప్‌లతో కలిసి వారు మాట్లాడారు. డిప్లొమా ఎఇఒల ఇన్ సర్వీస్ బిఎస్‌సి అగ్రికల్చర్ 5శాతం కోటాను రద్దు చేస్తూ ఇటీవల జారీ చేసిన మెమో నం.3817ను వెనక్కి తీసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖలో 1976 నుంచి 50 ఏళ్లుగా ఉన్న ఇన్ సర్వీస్ బిఎస్‌సి అగ్రికల్చర్ 5శాతం కోటా ఒక సంఘం లాబీయింగ్‌తో తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. డిప్లొమా ఏఈవోలు వ్యవసాయ శాఖలో 40 ఏళ్లుగా సర్వీస్ చేసినా ఒక పదోన్నతి కూడా పొందలేని పరిస్థితి ఉన్నదన్నారు. ప్రమోషన్ల విషయంలో జిఒ 39 తేవటం, నేడు ఇన్‌సర్వీస్ బిఎస్ అగ్రికల్చర్ 5శాతం కోటా రద్దు చేయడంతో డిప్లొమా ఏఈవోలు తీవ్ర అందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ విజ్ఞప్తిని సానుకూలంగా స్పందించి, బిఎస్‌సి అగ్రికల్చర్‌ను యథాతథంగా కొనసాగించాలని వారు కోరారు.



## ఖాళీ స్థలాలను అధికారులు కాపాడాలి

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో కబ్జాకు గురవుతున్న ఖాళీ స్థలాన్ని వెంటనే ఉన్నతాధికారులు కాపాడి ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేలా చూడాలని బోరంపేట ఇందిరమ్మ కాలనీ వాసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే ఇందిరమ్మ కాలనీ బ్లాక్ నెంబర్ 48, 49, 50, 51, 55, 56, 57 వద్ద ఖాళీగా ఉన్న స్థలంలో కొందరు షెడ్లు, రూములు నిర్మిస్తున్నారని, ఇందిరమ్మ కాలనీకి సంబంధించిన ఖాళీ స్థలాలను కబ్జాలకు గురి చేస్తున్నారని ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టి అన్యాక్రాంతానికి గురికాకుండా చూడాలని కాలనీ వాసులు కోరారు.



## మహమ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి ఆదర్శం

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** ఇస్లాం మత ప్రవక్త హజ్రత్ మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు పవిత్రంగా జరుపుకునే మిలాద్‌ఉన్ నబీ పర్వదినం సందర్భంగా జవహర్‌నగర్ అధ్యక్షులు, మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జవహర్‌నగర్‌లోని చెన్న పురం చౌరస్తాలో వైభవంగా నిర్వహించిన మిలాద్‌ఉన్‌నబీ కార్యక్రమంలో శాంతి కోటేష్ గౌడ్ పాల్గొని, ముస్లిం సోదరులతో కలసి పర్వదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ, సమాజంలో సోదరభావం, శాంతి, సహనం, ప్రేమ, కరుణ వంటి ఉన్నత మానవీయ విలువలను హజ్రత్ మహమ్మద్ ప్రవక్త లోకానికి ప్రబోధించారని గుర్తుచేశారు. ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బింగి లావణ్య సతీష్ గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ నూరుద్దీన్ ఫారూఖ్ స్థానిక నాయకులు, ముస్లిం పెద్దలు ప్రజలు మొత్తంలో పాల్గొన్నారు.

## కూతురు ఆత్మహత్య చేసుకుందని ఉరేసుకుని తండ్రి మృతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కన్న కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మనస్థాపంతో తండ్రి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారకమైన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం లాల్‌గడిమలక్‌పేటకు చెందిన కొత్త రాములు (50) మేస్త్రీ పని చేసుకుంటు జీవ నం గడుపుతున్నాడు. బొమ్మరాశిపేట శివారులో చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి మృతి చెందాడని స్థానికులు 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఇన్స్‌పెక్టర్ మృతుడి వివరాలను సేకరించారు. మృతుడి మొదటి భార్య గతంలో మృతి చెందగా చనిపోయిన తన భార్య చెల్లెలిని వివాహం చేసుకున్నాడు. ఆమెతో కూడ సయోధ్య కుదరకపోవడంతో ఆమెను పుట్టింటికి పంపించి ఒక్కడే మలక్‌పేటలో నివాసం ఉంటున్నాడు. మృతుడి మొదటి భార్య కు ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. మృతుడి రెండో భార్య కూతురు ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని సమాచారం తెలియగానే రాములు మనస్థాపానికి గురై తాను కూడా చనిపోతున్నట్లు బంధువులకు ఫోన్‌లో చెప్పి బొమ్మరాశిపేట వాగువద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శవాన్ని పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్‌పెక్టర్ తెలిపారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
గురువారం
27-08-2026
www.prajapaksham.in
మహానగరి
GREATER HYDERABAD

## పేరు ఉండేలా చూడాలి



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సూచించారు. ఈ మేరకు మధురానగర్‌లోని ఫంక్షన్ హాల్లో జరిగిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేత దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, వెంగళరావునగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదోట శౌరిరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాడీ బిల్డింగ్ పోటీలు



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** సెప్టెంబర్ 6న సిటీ టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ మెమోరియల్ బాడీ బిల్డింగ్ మెన్స్ ఫిజిక్ జూనియర్స్ అండ్ ఓపెన్ మిస్టర్ తెలంగాణ 2026 పోటీలు నిర్వహించనున్నట్లు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్ కుమార్‌గౌడ్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన టిడిపి సిటీ కార్యాలయంలో పోస్టర్ విడుదల చేశారు. తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో విజేతలకు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పేరిట, నారా చంద్రబాబు నాయుడు మెన్స్ ఫిజిక్ ఓపెన్ ఛాంపియన్షిప్ పేరిట బహుమతులు, నగదు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.యువతను సరైన మార్గంలో నడిపించేందుకే బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంటు నాయకుడు నల్లెల్ల కిషోర్, మాజీ కార్పోరేటర్ పి.బాలరాజ్‌గౌడ్, శ్యామ్ సుందర్, కరణం కిరణ్, భాను ప్రకాష్, భవాని శ్రీనివాస్, వైఎల్.నర్సింహా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సాగర్‌లోకి దూకిన విదేశీయుడు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ఓ విదేశీయుడు హుస్సేన్‌సాగర్‌లోకి దూకి ఆత్మహత్యకు యత్నించారు. అక్కడే ఉన్న సైఫాబాద్ పోలీసులు గమనించి అతన్ని తాడు సహాయంతో రక్షించారు. సచివాలయం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి టోలీచౌకీ పారామౌంట్‌కాలనీలో నివాసముంటున్న సుడాన్ దేశానికి చెందిన నాజర్ ఆడమ్‌గా గుర్తించారు. విచారణ నిమిత్తం అతన్ని లేక్ పోలీసులకు అప్పగించారు.

## ప్రవక్త బోధనలు ఆదర్శం



**ప్రజాపక్షం/యూసుఫ్‌గూడ:** మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు ప్రపంచానికే పర్వదినమని ఎఐసిసి జాతీయ కో ఆర్డినేటర్ డా. పివి రవిశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఈద్గా కమిటీ జనరల్ సెక్రటరీ, కృష్ణానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి ఫయాజుద్దీన్ నివాసంలో ఇచ్చిన విందుకు రవిశేఖర్‌రెడ్డి హాజరయ్యారు.

## బిసి కులాల లెక్క తేల్చాల్సిందే



**ప్రజాపక్షం/నల్ల-కుంట:** జనాభా లెక్కల సేకరణలో బిసిల జనాభా, కులాల వారీ వివరాలను స్పష్టంగా నమోదు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రశ్నావళి అసంపూర్ణంగా ఉందని అంబర్‌పేట్ కాంగ్రెస్ నేత కెపి.మురళీకృష్ణ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. నల్లకుంటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బిసిలకు సంబంధించిన అంశాన్ని స్పష్టంగా పొందుపరచకుండా కులగణన నిర్వహించడం వల్ల దేశంలోని కోట్లాది మంది వెనుకబడిన తరగతుల ప్రజలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాండూ లాలయ్య గౌడ్, రాజేష్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**ప్రజాపక్షం/కాచిగూడ:** మిలాద్ ఉన్ నబి వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ మేరకు విద్యానగర్‌లోని హజరత్ సయ్యద్ అలీ ఉల్లా షా ఖాద్రి కిష్టి బందా నవాజ్ దర్గాలో జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నల్లకుంట డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖితగౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు మహబూబ్ ఖాన్, అబ్దుల్ జబ్బార్, బిఆర్ఎస్ నాయకులు మేడి ప్రసాద్, భాస్కర్ గౌడ్, నైతిక్ గౌడ్, విజయ్ సాగర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సహనానికి ప్రతీక



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** పవిత్ర మిలాద్‌ఉన్‌నబీ పండుగను పురస్కరించుకుని వారాసిగూడ చౌరస్తాలో ఎంఐఎం హాజీ, హమీద్ షరీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదిక నుంచి ర్యాలీలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారని రవిప్రసాద్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలకు నాయకులు రాచమల్ల కృష్ణమూర్తి, కందాడి నాగేష్‌రెడ్డి, నగరపు శ్యామ్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు సాకీర్, షకీల్, ఇర్ఫాన్, సల్మాన్, కరీం, నజీర్‌తో పాటు మత పెద్దలు పాల్గొన్నారు.

### శ్రీలంక-తెలంగాణ బౌద్ధ, సాంస్కృతిక..

# పర్యాటక బంధానికి మరింత ఊతం

సాంస్కృతిక మార్పిడికి ప్రోత్సాహం
మంత్రి జూపలి కృష్ణారావు
శ్రీలంక కళాకారులకు
మంత్రి జూపల్లి సత్కారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శ్రీలంక–తెలంగాణ మధ్య బౌద్ధ, సాంస్కృతిక, పర్యాటక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నాగపూర్ లోని దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రం, సింగిడి సాంస్కృతిక సంస్థ సౌజన్యంతో ఇటీవల రవీంద్రభారతీలో నిర్వహించిన 4వ నృత్యంగాణ కార్యక్రమంలో శ్రీలంక సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించిన కళాకారుల బృందం బుధవారం రాష్ట్ర సచివాలయంలోమంత్రి జూపల్లి కృష్ణారావును కలిసింది. శ్రీలంక కళాకారుల బృందాన్ని ఈ సందర్భంగా సన్మానించారు. శంగిక ననయక్కర నేతృత్వంలోని శ్రీలంక కళాకారుల బృందం, సింగిడి సాంస్కృతిక సంస్థ డైరెక్టర్ విశ్వకర్మ డి.ఆర్.కే. ఆధ్వర్యంలో మంత్రి జూపల్లిని కలిసింది. శ్రీలంక సంప్రదాయ నృత్యాలను తెలంగాణ వేదికపై ప్రదర్శించడంపై మంత్రి అభినందనలు తెలిపారు.బౌద్ధం, సంస్కృతి, కళలు, వారసత్వం వంటి అంశాలు శ్రీలంక–తెలంగాణ మధ్య సుదీర్ఘ అనుబంధానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. నాగపూర్ దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను డైరెక్టర్ ఆస్తా కార్లేకర్.. మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి కేంద్రానికి సహకారం అందించాలని కోరగా. మంత్రి సానుకూలంగా స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాలతోనూ సాంస్కృతిక సంబంధాలను మ రింత బలోపేతం చేసే కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని తెలిపారు.త్వరలోనే నాగపూర్‌లోని దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రాన్ని సందర్శిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సాం స్కృతిక మార్పిడి, కళాకారుల పరస్పర భాగస్వామ్యం, బౌద్ధ వారసత్వం, పర్యాటక అవకాశాలపై మరింత సహకారం పెంపొందించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

## మహిళల సమస్యలపై గళం



**ప్రజాపక్షం/నల్లకుంట:** సయోధ్య హోం ఫర్ విమెన్ ఇన్ నీడ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ధ్రువ్ ఎలైట్ హోటల్‌లో అంబర్‌పేట్ బస్తీ ఇన్‌ఫ్లూయెన్సర్స్ సదస్సు జరిగింది. సంస్థ వ్యవస్థాపకురాలు మృదుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో మహిళలు, ఆడపిల్లలపై హింసను నివారించేందుకు కలిసి ఆలోచిద్దాం... కలిసి పనిచేద్దాం అనే కాన్సెప్ట్‌పై చర్చించారు. కార్యక్రమంలో సయోధ్య బోర్డు మెంబర్ శాంతిప్రియ, ఫ్యామిలి కౌన్సిలర్స్ స్వప్న, గంగమ్మ, ప్రాజెక్టు మేనేజర్ వరలక్ష్మి, అడ్వకేట్ భాగ్యలక్ష్మి, ప్రతినిధులు సుమబాల, దుర్గా, సైకలాజిస్ట్ జొన్నలగడ్డ కనకదుర్గ, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బండారు జ్యోతి, వివిధ బస్తీలకు చెందిన ఇన్‌ఫ్లూయెన్సర్స్ ఎ.సురేష్ గౌడ్, జి.మల్లేష్, ఆర్.దేవేందర్, సి.నర్సింగ్ ముదిరాజ్, రైస్, ఆర్కేబాబు, లింగంయాదవ్, గోపాల్, భిక్షపతి యాదవ్, లక్ష్మణ్ గౌడ్, ఇర్ఫానా సుల్తానా, స్వరూప, ఉమాదేవి, పల్లవి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో యువతి మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** అమెరికాలోని మేరీల్యాండ్‌లో హైదరాబాద్‌కు చెందిన నిఖిత గోడిశాల అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ మృతి వెనుక కుట్ర దాగి ఉందని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగం కోల్పోయిన అర్జున్ శర్మ తమ కూతురైన నిఖితను ఆర్థిక ఇబ్బందులకు గురి చేసి హత్య చేశాడని, ఈ దారుణంలో ఆయన తల్లి పాత్ర కూడా ఉందని వారు మండిపడ్డారు. నిందితుడిని అరెస్ట్ చేసిన అమెరికా అధికారులు అధికారిక ప్రకటన ఇవ్వకుండా మౌనం వహించడం ఏమిటని తప్పుబట్టిన కుటుంబ సభ్యులు, నిందితులపై నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసి సమగ్ర విచారణ జరపాలన్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.

## విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**ప్రజాపక్షం/బోరబండ:** రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిజెపి విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుంభాల గంగరాజు సూచించారు. ఈ మేరకు రాజీవ్ నగర్ డివిజన్ బిజెపి నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా కుంభాల గంగరాజును మర్యాధ పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బిజెవైఎం ప్రెసిడెంట్ భరత్ గౌడ్, శివకుమార్, రోహిత్, గోగికర్ పాల్గొన్నారు.

## పెరోల్ ఖైదీ.. సర్కార్ పదవి..

అధికారుల కళ్లు కప్పి 30 ఏండ్లు ప్రభుత్వ సర్వీస్
విస్తుపోయిన హైకోర్టు
40 ఏళ్లకు పట్టుబడిన జీవిత ఖైదీ విడుదలకు నిరాకరణ
ఖైదీ భార్య పిటిషన్ కొట్టివేస్తూ తీర్పు

**హైదరాబాద్:** పరోల్‌పై విడుదలై నాలుగు దశాబ్దాలకు పైగా జైలుకు తిరిగి వెళ్లని జీవిత ఖైదీ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ చేసే వరకు అధికారులకు చిక్కకుండా ఉన్న ఘటనపై తెలంగాణ హైకోర్టు తీవ్ర విస్మయం వ్యక్తం చేసింది. పరోల్ గడువు ముగిసిన తర్వాత ఖైదీ తిరిగి జైలుకు చేరాడా లేదా అన్న విషయాన్ని పర్యవేక్షించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని ఆక్షేపించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరోల్‌పై విడుదలయ్యే ఖైదీలపై నిరంతర నిఘా ఉండేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జైళ్ల శాఖకు సూచించింది. పరోల్ నిబంధనలను ఉల్లంఘించి 40 ఏళ్లకు పైగా బయట ఉన్న సండుల వీరన్నను తిరిగి జైలుకు పంపుతూ అధికారులు తీసుకున్న చర్యలను సమర్థించిన న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవీదేవి.. వైద్య కారణాలతో ఆయనను విడుదల చేయాలంటూ భార్య సండెల చారమ్మ దాఖలు చేసిన పిటిషన్ ను కొట్టివేశారు. జీవిత ఖైదీగా ఉన్న వ్యక్తి ఇంతకాలం వ్యవస్థకు దొరకకుండా ప్రభుత్వ ఉద్యోగం చేయడం, ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందడం, పదవీ విరమణ తర్వాత పెన్షన్ పొందడం తీవ్ర వ్యవస్థాగత లోపాలను సూచిస్తోందని కోర్టు వ్యాఖ్యానించింది.వీరన్నపై 1982లో నమోదైన హత్య కేసులో వరంగల్ అదనపు జిల్లా న్యాయస్థానం 1983 జూఒR 9న జీవిత ఖైదు విధించింది. వరంగల్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న అతడు అదే ఏడాది డిసెంబర్ 17న 30 రోజుల పరోల్‌పై బయటకు వచ్చి, అనంతరం 1984 మార్చి 17 వరకు గడువు పొడిగించుకున్నాడు. మార్చి 18న తిరిగి జైలుకు రావాల్సి ఉన్నప్పటికీ రాకుండా అదృశ్యమయ్యాడు. తన అసలు వివరాలను దాచుకుని ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించిన వీరన్న సుమారు 30 ఏళ్లపాటు సర్వీసులో కొనసాగి 2004లో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నాడు. 2013లో పదవీ విరమణ చేసి, ఆ తర్వాత పెన్షఒR కూడా పొందాడు. అతడి ఆచూకీ కోసం అధికారులు 2012 నుంచి 2020 మధ్య ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోగా, చివరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ 2024 మే 16న గుర్తించి అరెస్టు చేసి తిరిగి జైలుకు తరలించింది. పరోల్ ఉల్లంఘనకు సంబంధించి అతడికి లభించిన సుమారు 27 రోజుల రిమిషఒR ను రద్దు చేయడంతోపాటు మూడేళ్లపాటు పరోల్, ఫర్లఫ్ ఇవ్వకుండా జైలు అధికారులు నిర్ణయించారు. ఈ చర్యలను సవాలు చేస్తూ భార్య దాఖలు చేసిన పిటిషఒR పై విచారణ సందర్భంగా, పరోల్ గడువు దాటిన ఖైదీలను గుర్తించేందుకు పటిష్ఠమైన పర్యవేక్షణ, అవసరమైతే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది.

### కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో..

## యంగ్ ఇండియా స్పోర్ట్స్ విశ్వవిద్యాలయం ఒప్పందం

తెలంగాణ క్రీడా ప్రతిభకు ప్రపంచస్థాయి శిక్షణ
స్పోర్ట్స్ సైన్స్‌లో కొత్త అవకాశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో క్రీడా ప్రతిభను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా మరో కీలక ముందడుగు పడింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్టట్స్ యూనివర్సిటీ.. ప్రపంచస్థాయి హైపెర్ఫార్మెన్స్ స్పోర్ట్స్ సంస్థగా గుర్తింపు పొందిన కొరియా నేషనల్ స్పోరట్స్ యూనివర్సిటీ (కెఎన్ఎస్‌యు)తో అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, హైపెర్ఫార్మెన్స్ ఎడ్యుకేషన్‌లో కొత్త అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా కేఎన్ఎస్‌యూ అధ్యక్షుడు మూన్ వోన్‌జేతో పాటు యూనివర్సిటీ ఉన్నతస్థాయి ప్రతినిధులతో సమావేశమైన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అప్పట్లో ప్రతిపాదిత యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో కెఎన్ఎస్‌యు భాగస్వామ్యంపై జరిగిన చర్చలు తాజాగా ఎంఒయు రూపంలో కార్యరూపం దాల్చడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ భాగస్వామ్యం కేవలం ఒక ఒప్పందం కాదని.. తెలంగాణ క్రీడాకారుల ప్రతిభను ప్రపంచస్థాయి శిక్షణ, క్రీడా విజ్ఞానం, హైపెర్ఫార్మెన్స్ విద్యతో అనుసంధానించే వారధిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అత్యుత్తమ అంతర్జాతీయ శిక్షణా ప్రమాణాలను తెలంగాణకు తీసుకురావడమే లక్ష్యమన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా సాధించిన 32 పతకాల్లో 16 పతకాలకు కెఎన్ఎస్‌యులో శిక్షణ పొందిన క్రీడాకారులు దోహదపడ్డారని తెలిపారు. అదే స్థాయి నైపుణ్యం, క్రమశిక్షణ, శిక్షణా సంస్కృతిని తెలంగాణలోనూ అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.2036 ఒలింపిక్స్ లక్ష్యంగా..ఈ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేసిన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, క్రీడల శాఖ అధికారులు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ బృందాన్ని అభినందించారు. అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలను నేర్చుకునేందుకు యువ క్రీడాకారులకు ఈ ఒప్పందం కొత్త అవకాశాలను తెరుస్తుందని పేర్కొన్నారు.తెలంగాణలోని గ్రామాలు, పట్టణాల నుంచి ఒలింపిక్ వేదిక వరకు క్రీడాకారులను తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రం ముందుకు సాగుతోందని తెలిపారు. 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకుని భారత్ సన్నద్ధమవుతున్న తరుణంలో తెలంగాణ కూడా ముందుగానే సిద్ధమవుతోందని.. కేవలం ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడా ఈవెంట్‌కు ఆ తిథ్యం ఇవ్వడం మాత్రమే కాకుండా, దేశం గర్వించే స్థాయిలో ఒలింపిక్ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమని స్ప ష్టం చేశారు.

## సిజెపి నిరసనలో పాల్గొంటే బాగుండేది


ఎంపి డింపుల్ యాదవ్

**లక్నో :** పార్టీ నాయకత్వం అనుమతి లేకపోయినప్పటికీ తాను, ఇతర యువ సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) ఎంపిలం ఢిల్లీలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిరసనలో పాల్గొంటే బాగుండేదని సమాజ్‌వాదీ పార్టీ ఎంపి డింపుల్ యాదవ్ అన్నారు. ఈ ఉద్యమం దేశానికి ఒక 'సంజీవని బూటి'లా నిరూపించబడిందని ఆమె నొక్కిచెప్పారు. బిజెపిని ఓడించవచ్చని, అది అంత కష్టమైన పని కాదనే సందేశం ఈ నిరసన ద్వారా దేశ వ్యాప్తంగా వెళ్లిందని పేర్కొన్నారు. ఆమె బుధవారం ఇక్కడ సమాజ్‌వాదీ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాకు అనుమతి లభించి ఉండకపోతే, మేమేం చేసి ఉండే వాళ్లమో మాకు తెలియదు. బహుశా, యువ ఎంపిలం మేమంతా వెళ్లాలని నిశ్చయించుకుంటే ఎలాగైనా మేం అక్కడికి వెళ్లిపోయే వాళ్లం అని డింపుల్ యాదవ్ చెప్పారు. ఆందోళనలో పాల్గొనేందుకు పార్టీ యువ ఎంపిలకు అవకాశం కల్పించినందుకు విలేకరుల సమావేశంలో తనతో పాటు ఉన్న సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. 'మేమందరం అక్కడికి వెళ్లినప్పుడు, హక్కులు, అర్హతల కోసం పోరాడుతున్నది మా సొంత పిల్లలేనని అనిపించింది. నిరసనకారులు తమ డిమాండ్లను వినిపించడానికి వచ్చిన సాధారణ యువతగా కనిపిస్తున్నారని, వారిని బయటి వ్యక్తులు రెచ్చగొట్టడం గానీ, మ ద్దతు ఇవ్వడం గానీ జరుగలేదని ఆమె స్పష్టం చేశారు. సోనమ్ వాంగ్ చుక్‌కు ఎదురైన దుస్థితిని ఎంపి డింపుల్ యాదవ్ గుర్తు చేసుకుంటూ 'తెల్లటి దుప్పటిలో చుట్టి' అతడిని తీసుకెళ్లిన తీరు చాలామంది మనోభావాలను దెబ్బతీసిందని అన్నారు.నిరసనలో పాల్గొనడానికి ప్రతిపక్ష పార్టీలు మొదట్లో ఏకగ్రీవంగా లేవని, అయితే, చివరికి సమాజ్‌వాదీ పార్టీ నాయకత్వం తమ ఎంపిలను పాల్గొనడానికి అనుమతించిందని చెప్పారు. ''మేం వారి బాధను అనుభవించగలిగాం. వారి బట్టలు చించేశారని, వారికి విద్యుత్ షాక్‌లు ఇచ్చారని వారు మాకు చెప్పారు. ఏదో ఒక విధంగా అది వారికి అండగా నిచ్చే శక్తిని ఇచ్చింది'అని ఆ ఆరోపణల గురించి మరింత వివరంగా వెల్లడించకుం డా డింపుల్ యాదవ్ నర్మగర్భంగా మాట్లాడారు. ఈ ఆందోళన సామూహిక కార్యాచరణ ద్వారా ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని సవాల్ చేయగలరనే సందేశాన్ని దేశవ్యాప్తంగా, యావత్ సమాజానికి పంపించిందని ఎంపి చెప్పారు.

## బుల్లెట్ బైక్‌లు స్వాధీనం

**ప్రజాపక్షం/యూసుఫ్‌గూడ:** మూడు బుల్లెట్ బైక్‌ల చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి నాలుగు బుల్లెట్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. మధురానగర్ పీఎస్ పరిధిలో బుల్లెట్ బైక్‌ల చోరీకి సంబంధించి కేసులు నమోదయ్యాయి. కేసుల దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితుడిని నీలపుహర్ష సాయి వర్ధన్ (27)గా గుర్తించారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం నెగ్గిపూడికి చెందిన అతడిని ఈ నెల 25న అదుపులోకి తీసుకున్నారు.నిందితుడి నుంచి చోరీకి గురైన మూడు బుల్లెట్ బైక్లతో పాటు పంజాగుట్ట పరిధిలో చోరీకి గురైన మరో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## ఇక్రా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు పోటీలు



**ప్రజాపక్షం/మక్తల్ :** మిలాదున్నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని మక్తల్ పట్టణంలోని ఇక్రా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్, వాకిటి మానస హనుమంతు, కౌన్సిలర్ రహీం పటేల్, రాజశేఖర్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితం శాంతి, కరుణ, దయ, సోదరభావం, మానవత్వానికి గొప్ప సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పరం ప్రేమాభిమానాలు, ఐక్యతతో జీవిస్తూ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి బోధనలు, సూత్రాలను ఆచరణలో పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మౌలానా అబ్దుల ఖవి, ఖాజీ షాహబుద్దీన్, ఏఎంసీ డైరెక్టర్ మహమ్మద్ ఫయాజ్, కో ఆప్షన్ సభ్యుడు బి.శంషుద్దీన్, హుసాముద్దీన్ లాలా, కాంతు, యూత్ కాంగ్రెస్ నాయకులు నాదేర్ పటేల్, నవీద్, పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ రవూఫ్, ప్రిన్సిపల్ మౌలానా హమీద్, లిటిల్ ఏంజెల్ కరస్పాండెంట్ మహబూబ్ అలి, మాజీ కౌన్సిలర్ అన్వర్ హుస్సేన్, అబ్దుల్ మన్నన్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు, బి.అంబాదాస్ రావు, కాంత్ కుమార్, జహంగీర్, జావీద్, అమర్, అలాగే విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రెండ్రోజుల్లో.. కేబినెట్‌లోకి ఒక మహిళా మంత్రి

కర్ణాటక సిఎం డికె.శివకుమార్
వాల్మీకి 'స్కామ్'తో బి.నాగేంద్రకు
సంబంధంలేదని స్పష్టీకరణ

**బెంగళూరు :** వాల్మీకి కుంభకోణంలో బి.నాగేంద్రకు సంబంధం లేదని అధికారిక నివేదిక తేల్చిన తర్వాతనే అతడిని మంత్రివర్గంలోకి తీసుకున్నామని కర్ణాటక ముఖ్యమంత్రి డికె.శివకుమార్ బుధవారం స్పష్టం చేశారు. రాబోయే రెండు రోజుల్లో తన ప్రభుత్వం ఒక మహిళా మంత్రిని నియమించనుందని ఆయన చెప్పారు. కావేరి జలాల సమస్యపై సుప్రీంకోర్టు ఆదేశాన్ని తాను గౌరవిస్తానని ముఖ్యమంత్రి అన్నారు. రూ.89 కోట్ల కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వ్యవహారంలో నాగేంద్ర ప్రమేయం ఉందన్న ఆరోపణలపై ఆయనను సమర్థిస్తూ సిఎం శివకుమార్ మాట్లాడారు. ప్రభుత్వంలో చర్చల అనంతరం, నాగేంద్ర గతంలో రాజీనామా చేశారని, అయితే, అందులో ఆయన ప్రమేయం లేదని ఒక అధికారిక నివేదిక తేల్చడంతో ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకోవడం జరిగిందన్నారు. 'వాల్మీకీ కుంభకోణానికి పాల్పడింది బి.నాగేంద్ర కాదని, దర్యాప్తులో 95శాతం డబ్బును రికవరీ చేశామని చెప్పారు. కేబినెట్‌లో మహిళల ప్రాతినిథ్యంపై శివకుమార్ మాట్లాడుతూ 'మాకు మహిళా మంత్రి ఉంటారు. మాకు ఖచ్చితంగా ఉంటారు. కాంగ్రెస్ పార్టీ మహిళా సాధికారత సిద్ధాంతానికి కట్టుబడి ఉంది' అని అన్నారు. ముఖ్యమంత్రి అయిన రెండు నెలల తర్వాత డికె.శివకుమార్ ఆగస్టు 3న మంత్రివర్గ విస్తరణ చేపట్టారు. కాంగ్రెస్ మహిళా ఎంపి గాయత్రి శాంతెగౌడ సహా 20మంది మంత్రుల పేర్లను ప్రకటించినప్పటికీ, చివరి నిమిషంలో ఆమె పేరును ఆయన తొలగించడంతో, సిఎం డికె.శివకుమార్ 19 మంది మంత్రులను మంత్రివర్గంలోకి చేర్చుకున్నారు. ఒక పేరును క్లియర్ చేస్తున్నప్పటికీ, చివరికి ఏదో సమస్య మిగిలిపోయింది' అని ఆయన ఇండియా టుడే రౌండ్‌టేబుల్ సంభాషణలో అన్నారు. 'రాబోయే రెండు రోజుల్లో ఒక మహిళా మంత్రిని నియమిస్తారని నేను భావిస్తున్నాను' అని ముఖ్యమంత్రి తెలియజేశారు.

ప్రస్తుతం శివకుమార్ ప్రభుత్వంలో మంజూరైన 34మంది మంత్రి పదవులకుగాను, 33మంది మంత్రులు ఉన్నారు. ఉన్న ఒక ఖాళీ పదవి ఒక మహిళా మంత్రి కోసం అని చెబుతున్నారు. తనను తాను 'తొందరపడిన వ్యక్తి'గా అభివర్ణించుకున్న ముఖ్యమంత్రి డికె.శివకుమార్ రాబోయే అసెంబ్లీ ఎన్నికల ముందు నాటికి సుపరిపాలనను అందించి, దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌ను ఆదర్శంగా నిలపాలన్న కృతనిశ్చయంతో ఉన్నామని తెలియజేశారు. మంత్రి పదవులు, వివిధ బోర్డులలో పదవులు కోరుతున్న ఎమ్మెల్యేల ఒత్తిడిపై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ, పార్టీలో ఆకాంక్షలకు చోటు కల్పించడంలో ఎలాంటి సమస్యా లేదని సిఎం శివకుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో ప్రత్యర్థి వర్గాలు ఉన్నాయన్న భావనను ఆయన తోసిపుచ్చుతూ, 'మాకు కాంగ్రెస్ వర్గం అనే ఒక వర్గం మాత్రమే ఉన్నది. మేమందరం ఐక్యంగానే ఉన్నాం' అని ఆయన సమాధానమిచ్చారు. పరిపాలన గురించి శివకుమార్ మాట్లాడుతూ, తాను రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా అందరికీ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తానని వివరించారు.

## మహిళా భద్రత విషయంలో...బిజెపి నినాదాలకే పరిమితం

ఎస్‌పి చీఫ్ అఖిలేష్ విమర్శల దాడి

**లక్నో :** భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రభుత్వంపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) చీఫ్, ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ విమర్శల దాడిని పెంచారు. బిజెపి ప్రభుత్వ హయాంలో మహిళలు కేవలం నినాదాలకే పరిమితమయ్యారని అఖిలేష్ ఆరోపించారు.మహిళలకు 'సెల్యూట్' చేస్తామని మాట్లాడే కాషాయ పార్టీ నాయకులు, రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న అఘాయిత్యాలను గుర్తుకు తెచ్చుకోవాలని కోరారు. 2027 అసెంబ్లీ ఎన్నికలలో తన పార్టీ బిజెపి కంటే ఎక్కువ టికెట్లను మహిళలకు ఇచ్చిందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలలో అధికారంలోకి వస్తే 'స్త్రీ సమ్మాన్ సమృద్ధి యోజన'ను ప్రారంభిస్తామని ప్రకటించడానికి బుధవారం ఇక్కడి సమాజ్‌వాదీ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు ఉత్తర్‌ప్రదేశ్ అత్యున్నత సాక్షిగా నిలిచిందని యాదవ్ ధ్వజమెత్తారు. బిజెపి ప్రభుత్వ హయాంలో మహిళలు కేవలం నినాదంగానే మారారు'అని అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ఇప్పటికే ఆమోదం పొందిందని, దాని అమలును బిజెపి ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తోందని సమాజ్ వాదీ చీఫ్ అఖిలేష్ ప్రశ్నించారు. రక్షాబంధన్ సందర్భంగా, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రకటించి బస్సులు నడపగలిగినప్పుడు, మహిళా రిజర్వేషన్ల అమలు విషయంలో కూడా నిజాయితీగా ఉండాలని యాదవ్ కోరారు. విద్య, ఆరోగ్యం, మహిళల భద్రత ఉదాహరణలుగా నిలుస్తూనే ఉన్నాయని చెబుతూ, గతంలో ఎస్‌పి ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మహిళా హెల్ప్‌లైన్ 1090, డయల్ 100 అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థను ఆయన ఉదహరించారు. సమాజ్‌వాదీ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే మూతపడిన 26,000 ప్రాథమిక పాఠశాలలను తిరిగి తెరుస్తామని, దీనివల్ల బాలికలు తమ ఇళ్లకు దగ్గరలోనే చదువుకోవడానికి వీలవుతుందని, అలాగే, చదువుకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం వల్ల కలిగే అభద్రత తగ్గిపోతుందని మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రకటించారు.

# పోలీసులను ఆయుధంగా ఉపయోగిస్తున్న బిహార్ సర్కార్

**కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శ**



**న్యూఢిల్లీ:** బిహార్‌లో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బుధవారం మద్దతు ప్రకటించారు. బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థులకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, జవాబుదారీతనం నుంచి తప్పించుకునేందుకు పోలీసులను ఆయుధంగా ఉపయోగిస్తోందని ఆయన ఆరోపించారు. పట్నాలో జరిగిన విద్యార్థుల ఆందోళనలో ఓ ఆరేళ్ల మురికివాడ బాలుడు చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాహుల్ స్పందించారు. పట్నాలోని పునైచక్ ప్రాంతానికి చెందిన ఆదిత్య అనే బాలుడు ఆందోళనలో ధైర్యంగా, ఘాటుగా మాట్లాడుతున్న దృశ్యాలు వీడియోలో కనిపించాయి. అనంతరం పోలీసులు అతడిని అక్కడి నుంచి తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థుల ఆందోళనలో పాల్గొన్నందుకు బాలుడిని పోలీసులు అరెస్టు చేశారంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. అయితే పోలీసులు ఆ ఆరోపణను ఖండించారు. బాలుడి భద్రత కోసమే కొంతసేపు పోలీస్ స్టేషన్‌లో ఉంచామని, అనంతరం ఇంటిపనులు చేసే అతడి తల్లికి అప్పగించామని తెలిపారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ హిందీలో చేసిన 'ఎక్స్' పోస్టులో బిహార్ విద్యార్థులు చాలా సూటిగా కొన్ని ప్రశ్నలు అడుగుతున్నారని పేర్కొన్నారు. నియామక పరీక్షల్లో అక్రమాలు ఎందుకు జరుగుతున్నాయని, ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. యువత భవిష్యత్తుతో చెలగాటం ఇంకా ఎంతకాలం కొనసాగుతుందని నిలదీశారు. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బిపిఎస్‌సి) పరీక్షల వివాదం ఇప్పుడే మొదలైనది కాదని రాహుల్ అన్నారు. నియామక ప్రక్రియ, పరీక్ష విధానం, జాప్యం, పారదర్శకతపై విద్యార్థులు చాలాకాలంగా రోడ్డెక్కుతున్నారని చెప్పారు. వారికి సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం లాఠీలు, వాటర్ కెనాన్లను ప్రయోగిస్తోందని, విద్యార్థులను అదుపులోకి తీసుకుంటోందని విమర్శించారు. సివాన్‌లో ఆందోళనకారులపై ఎకె47తో కాల్పులు కూడా జరిగాయని ఆయన ఆరోపించారు. ఇది కేవలం పోలీసుల చర్యలకు సంబంధించిన విషయం కాదని, బిజెపి ప్రభుత్వ వైఖరికి సంబంధించిన అంశమని అన్నారు. సమాధానాలు చెప్పలేని ప్రభుత్వం జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి పోలీసులను ఆయుధంగా మార్చుకుంటోందని ఆరోపించారు. లాఠీలతో విద్యార్థుల గొంతుకలను అణలేరనే విషయాన్ని బిజెపి ప్రభుత్వం అర్థం చేసుకోవాలని రాహుల్ అన్నారు. భయపెట్టి యువత భవిష్యత్తును హరించలేరని పేర్కొన్నారు. బిహార్ విద్యార్థులు ప్రశ్నలు అడుగుతూనే ఉంటారని, ఇప్పుడు వారు సమాధానాలతో పాటు జవాబుదారీతనాన్ని కూడా కోరుతున్నారని చెప్పారు. కాగా, మంగళవారం పట్నాలో వేలాది మంది విద్యార్థులు బిహార్ పోలీసులతో తీవ్రంగా ఘర్షణ విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి నివాసానికి తమ సమస్యలను వివరించేందుకు ర్యాలీగా వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళనకారులు రాళ్లు రువ్వగా, పోలీసులు వాటర్ కెనాన్లు, లాఠీచార్జ్ ప్రయోగించారు. వచ్చే నెల బిపిఎస్‌సి నిర్వహించనున్న ఉపాధ్యాయ నియామక పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థుల్లో ఎక్కువ మంది ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్ విధానంలో కాకుండా రాత పరీక్షను ఒకే దశలో నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

## సుప్రీంకోర్టు ప్రత్యేక లోక్ అదాలత్

# దశాబ్దాలనాటి పలు కేసులకు పరిష్కారం




**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు వివాదాలకు పరిష్కారం లభించింది. ఇందులో 47 ఏళ్ల కౌలు వివాదం, 1978లో ప్రారంభమైన వాణిజ్య వివాదం, అయోధ్యలోని ఆస్తి వివాదం ఉన్నాయి. దుబాయ్‌లో ఉన్న ప్రతివాది డిజిటల్‌గా సంతకం చేసిన ఒప్పందాన్ని పంపడంతో అయోధ్య కేసు పరిష్కారమైంది. అధికారిక గణాంకాల ప్రకారం సుప్రీంకోర్టులో 96,000కు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 10,000కు పైగా కేసులు పదేళ్లకు పైగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. 'సమాధాన్ సమారోహ్ 2026'లో భాగంగా ఆగస్టు 21 నుంచి 23 వరకు మూడు రోజులపాటు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 3,285 కేసులను విచారణకు జాబితా చేయగా, 1,664 కేసులకు పరిష్కారం లభించింది. మధ్యవర్తిత్వం ద్వారా మరో 48 కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తంగా 1,712 కేసులను పరిష్కరించగా, రూ.240.94 కోట్లను సంబంధిత పక్షాలకు చెల్లించారు. 1978 నాటి వాణిజ్య వివాదం ఈ కార్యక్రమంలో ముఖ్యమైన పరిష్కారాల్లో ఒకటి. సౌదీ అరేబియాకు చెందిన ఎఎల్ ముస్తానీర్ ఎస్టాబ్లిష్మెంట్ ఫర్ ట్రేడ్, సిండికేట్ బ్యాంక్ మధ్య ఈ వివాదం ఏర్పడింది. 2,000 మెట్రిక్ టన్నుల ఎంఎస్ రౌండ్ బార్లను సుమారు 6.8 లక్షల అమెరికన్ డాలర్లకు సరఫరా చేయాలన్న ఆర్డర్‌కు సంబంధించిన వ్యవహారం ఇది. ఢిల్లీ హైకోర్టు మీదుగా కేసు సుప్రీంకోర్టుకు చేరింది. 2017లో సుప్రీంకోర్టులోకి వచ్చిన ఈ వివాదాన్ని 'సమాధాన్ సమారోహ్'లో పరిష్కారానికి ఎంపిక చేశారు. ఈ ఏడాది జూలైలో మధ్యవర్తిత్వం ప్రారంభించి, సుదీర్ఘ చర్చల అనంతరం ఇరు పక్షాలు అంగీకారానికి వచ్చాయి. నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించడంతో దాదాపు ఐదు దశాబ్దాల వివాదానికి ముగింపు పలికారు. అయోధ్య వ్యవసాయ భూమికి సంబంధించిన మరో పాత వివాదాన్ని సాంకేతికత సాయంతో పరిష్కరించారు. ఆస్తి విభజనపై భారతదేశంలో ఉన్న పక్షాలు జిల్లా న్యాయ సేవల సంస్థ ద్వారా చర్చలు జరిపాయి. దుబాయ్‌లో నివసిస్తున్న ప్రతివాది మహ్మద్ తౌసిఫ్ నేరుగా హాజరు కాలేకపోయారు. దీంతో ఆయన దుబాయ్‌లో హిందీలో రూపొందించిన పరిష్కార ఒప్పందాన్ని ప్రింట్ తీసుకుని సంతకం చేసి, స్కాన్ చేసిన ప్రతిని వాట్సాప్ ద్వారా భారత్‌లోని తన న్యాయ ప్రతినిధులకు పంపించారు. ఒప్పందం ప్రకారం ఉత్తర భాగంలోని ఆస్తిలో అప్పీలుదారులకు 53 శాతం, దక్షిణ భాగంలో ప్రతివాదులకు 47 శాతం వాటా లభిస్తుంది. పశ్చిమ భాగంలోని మార్గాన్ని ఇరు పక్షాలు ఉమ్మడిగా ఉపయోగించుకోవాలని కూడా అంగీకరించాయి. జైపూర్‌లోని ఓ దుకాణానికి సంబంధించిన 47 ఏళ్ల కౌలు వివాదానికి కూడా తెరపడింది. ఈ వివాదం 1952 నాటి కౌలు వ్యవహారంతో మొదలైంది. 1979లో యజమాని ఖాళీ చేయించేందుకు న్యాయపరమైన చర్యలు ప్రారంభించగా, 2017లో కేసు సుప్రీంకోర్టుకు చేరింది. 2003లో దుకాణాన్ని అప్పీలుదారుకు విక్రయించేందుకు యజమాని అంగీకరించి, కొంత మొత్తాన్ని తీసుకున్నప్పటికీ మరో రెండు దశాబ్దాలకు పైగా వివాదం కొనసాగింది. చివరకు డీఎల్ఎస్ఏ జైపూర్ మధ్యవర్తిత్వంతో ఇరు పక్షాలు అంగీకారానికి వచ్చాయి. నిర్ణయించిన మొత్తానికి దుకాణాన్ని విక్రయించేందుకు ప్రతివాది అంగీకరించారు. ఇరు వర్గాల సమ్మతిమీద ఆధారపడిన వివాద పరిష్కారం వల్ల న్యాయవ్యాజ్యాల సమయం, ఖర్చు తగ్గడంతో పాటు పక్షాలకు స్పష్టత, తుది పరిష్కారం లభిస్తాయని సుప్రీంకోర్టు పేర్కొంది. తద్వారా పెండింగ్ కేసుల సంఖ్య తగ్గి, న్యాయస్థాన సమయం కూడా ఆదా అవుతుందని తెలిపింది.

## డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నియామక పరీక్ష

# ప్రశ్నాపత్రం రూ.40 లక్షలకు విక్రయం!

**విపక్ష పార్టీ ఆరోపణ.. పరీక్ష రద్దు**



**ముంబై :** మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపిఎస్‌సి) మార్చిలో నిర్వహించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గ్రూప్ 'బి' నియామక పరీక్ష ప్రశ్నపత్రాన్ని అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.40 లక్షలకు విక్రయించారని ఎన్‌సిపి (ఎస్‌పి) ఎమ్మెల్యే రోహిత్ పవార్ బుధవారం ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ప్రాథమిక విచారణ అనంతరం ఆహార, ఔషధ పరిపాలన శాఖలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గ్రూప్‌బీ పోస్టుల నియామక ప్రక్రియను ఎంపిఎస్‌సి రద్దు చేసింది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఒక అభ్యర్థికి పరీక్షకు ముందే ప్రశ్నపత్రం అందినట్లు, దాని ద్వారా అతడు ప్రయోజనం పొందినట్లు తేలిందని కమిషన్ తెలిపింది. ఈ అంశం తీవ్రతను పరిగణనలోకి తీసుకుని మొత్తం నియామక ప్రక్రియను రద్దు చేసినట్లు పేర్కొంది. ఇలావుంటే, తనకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఏజెంట్ల నెట్‌వర్క్ ద్వారా ప్రశ్నపత్రాన్ని ఒక్కొక్కరికి రూ.40 లక్షలకు విక్రయించారని రోహిత్ పవార్ ఆరోపించారు. ఈ విషయంపై కమిషన్‌కు కూడా సమాచారం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నపత్రం లీకైనట్లు దర్యాప్తులో నిర్ధారణ అయినప్పుడు, అది ఒక్క విద్యార్థి వద్ద మాత్రమే ఎలా ఉందన్న కమిషన్ వివరణను ఆయన ప్రశ్నించారు. ఈ లీకేజీ కమిషన్ విశ్వసనీయతకు సంబంధించిన తీవ్రమైన అంశమని పేర్కొన్న పవార్, ఎంపిఎస్‌సి చైర్మన్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విశ్వసనీయత కలిగిన వ్యక్తిని కొత్త చైర్మన్‌గా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాధారణ పరిపాలనా శాఖ మంత్రి ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేసి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇలావుంటే, బిజెపి ఎమ్మెల్యే అభిమన్యు పవార్ మాట్లాడుతూ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ 2025 పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీపై తాను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిశానని తెలిపారు. ముఖ్యమంత్రి ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి, సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై త్వరగా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు

## ఎపి ప్రభుత్వం చతుర్విధ వ్యూహం

**అమరావతి:** ఈ ఏడాది ఖరీఫ్ పంటలపై ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చతుర్విధ వ్యూహాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ బుధవారం తెలిపింది. నీటి నిర్వహణ, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, అనుబంధ రంగాల రక్షణ, పంటల బీమాపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. రాష్ట్ర జనాభాలో 62 శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారని శాఖ తెలిపింది. 2025–26లో రాష్ట్ర ఆహారధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 237 లక్షల టన్నులకు చేరినట్లు అంచనా వేసింది. ఈ రంగాన్ని ఎల్‌నినో ప్రభావం నుంచి రక్షించడం అత్యంత ప్రాధాన్యమని పేర్కొంది. ఎల్‌నినో కారణంగా రుతుపవనాలు బలహీనపడటం, ఆలస్యం కావడం లేదా అస్థిరంగా సాగడం వల్ల వర్షాధార ఖరీఫ్ పంటలపై ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ వివరించింది. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 25 వరకు ఏపీలో సాధారణం కంటే 51 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా లోటు 13 శాతంగా ఉంది. రాష్ట్రంలోని మొత్తం 28 జిల్లాల్లోనూ వర్షపాతం లోటు నమోదైంది. రాష్ట్రంలోని 8,489 రైతు సేవా కేంద్రాలను ప్రమాద స్థాయి ఆధారంగా వర్గీకరించగా, ప్రస్తుతం 1,357 కేంద్రాలు అధిక ప్రమాదం, 2,077 కేంద్రాలు మధ్యస్థ ప్రమాదం కింద ఉన్నాయి. నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో ముందుగానే రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసి సాగును ప్రోత్సహిస్తున్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహిస్తున్నారు. ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్, విత్తన పెల్లెటింగ్ కార్యక్రమాల ద్వారా 23 లక్షల మంది రైతులను, 25 లక్షల ఎకరాలను కవర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 16.3 లక్షల మంది రైతులు, 18.2 లక్షల ఎకరాలు ఈ కార్యక్రమం పరిధిలోకి వచ్చాయి. ఆగస్టు 7న ప్రభుత్వం 'రైతన్న మీకోసం–ఎల్‌నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక–ఖరీఫ్ 2026'ను ప్రారంభించింది. 18,513 గ్రామాల్లోని ప్రతి రైతు, ప్రతి వ్యవసాయ భూమికి చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. లక్ష్యంగా పెట్టుకున్న 2.7 కోట్ల వ్యవసాయ క్షేత్రాల్లో 2.6 కోట్ల క్షేత్రాలను ఇప్పటికే సర్వే చేశారు. పంటల ఆరోగ్య పరిశీలనలో 14.3 లక్షల ఎకరాల్లో వివరాలను నవీకరించగా, 1.1 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం నమోదైంది. ఇందులో 87,686 ఎకరాల్లో తేమ ఒత్తిడి, 15,250 ఎకరాల్లో పంట వాడిపోవడం, 3,731 ఎకరాల్లో పంట ఎండిపోవడాలను గుర్తించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. పంటలకు ప్రాణదాయక నీటిపారుదల, రక్షణాత్మక మందుల పిచికారీ, మల్చింగ్, పోషకాలు, సస్యరక్షణ చర్యలు, స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలు, అవసరమైన చోట తిరిగి విత్తడం వంటి చర్యలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఉపగ్రహ ఆధారిత పంట ఆరోగ్య అంచనాలతో పాటు వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ ద్వారా సాంకేతికతను వినియోగిస్తోంది. ఈ సీజన్‌లో రైతులకు 189 లక్షల ఎస్ఎంఎస్ సలహాలు పంపినట్లు శాఖ తెలిపింది. తోటలు, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమలకు కూడా సూక్ష్మ నీటిపారుదల, వ్యవసాయ చెరువులు, కరువు నిర్వహణ, వాతావరణ అనుకూల సాంకేతికత, వ్యాధుల పర్యవేక్షణ, కరువును తట్టుకునే వంగడాల వంటి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## యుడిఎఫ్ నేతల నిరాహార దీక్ష

**మంగళూరు ప్రాంతాన్ని పాలక్కాడ్ రైల్వే డివిజన్ నుంచి బదిలీ చేయడంపై ఆందోళన**




**పాలక్కాడ్:** మంగళూరు ప్రాంతాన్ని, ఉల్లాల్ సహా, దక్షిణ రైల్వేలోని పలక్కాడ్ డివిజన్ నుంచి నైరుతి రైల్వేలోని మైసూరు డివిజన్‌కు బదిలీ చేయాలన్న రైల్వే బోర్డు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యుడిఎఫ్ నేతలు బుధవారం పాలక్కాడ్‌లో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. అక్టోబర్ 1 నుంచి ఈ బదిలీ అమల్లోకి రానుంది. యుడిఎఫ్ ఎంపీలు కె. సుధాకరన్, వి.కె. శ్రీకందన్, ఎం.కె. రాఘవన్, ఇటి మహ్మద్ బషీర్, బెన్నీ బెహనాన్, డీన్ కురియాకోస్, షాఫీ పరంబిల్, రాజ్‌మోహన్ ఉన్నితాన్ దీక్షలో పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు సన్నీ జోసెఫ్, కేపీ తులసి, పాలక్కాడ్ ఎమ్మెల్యే రమేశ్ పిషారోడి, స్థానిక సంస్థల యుడిఎఫ్ ప్రతినిధులు కూడా పలక్కాడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం ఎదుట జరిగిన ఆందోళనలో పాల్గొన్నారు. మంగళూరు ప్రాంతాన్ని పలక్కాడ్ డివిజన్ నుంచి బదిలీ చేసే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. సత్యాగ్రహాన్ని ప్రారంభించిన కెపిసిసి అధ్యక్షుడు, మంత్రి సన్నీ జోసెఫ్ మాట్లాడుతూ, పార్లమెంట్ సమావేశాలు ముగిసిన వెంటనే కేంద్రం రహస్యంగా ఈ నిర్ణయం తీసుకుందని, ఇది కేరళం ప్రజలకు తీవ్ర ద్రోహమని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. కేంద్రం కేరళ అభివృద్ధిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఐయుఎంఎల్ నేత, పార్లమెంటు సభ్యుడు ఇటి మహ్మద్ బషీర్ మాట్లాడుతూ కేంద్రం కేరళపై కక్ష సాధిస్తోందని విమర్శించారు. ఎంపి శ్రీకందన్ కూడా కేరళంను కేంద్రం నిరంతరం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి విడి సతీశన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసి రైల్వే బోర్డు నిర్ణయాన్ని నిలిపివేసి, రాష్ట్ర ప్రభుత్వం, ఇతర భాగస్వాములతో చర్చించిన తర్వాత పునఃపరిశీలించాలని కోరారు. ఈ నిర్ణయం ఉత్తర కేరళ రైల్వే మౌలిక సదుపాయాలు, అభివృద్ధిపై దీర్ఘకాల ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు. మంగళూరు దశాబ్దాలుగా పలక్కాడ్ డివిజన్‌లో అంతర్భాగంగా ఉందని సతీశన్ తెలిపారు.

# చండీగఢ్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'చక్కెర లంగర్'

**ద్రవ్యోల్బణంపై కేంద్రాన్ని విమర్శిస్తూ నిరసన**

**చండీగఢ్:** నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ చండీగఢ్ కాంగ్రెస్ బుధవారం ఆందోళన నిర్వహించింది. పేదలు, అవసరమైన వారికి చక్కెర ప్యాకెట్లను పంపిణీ చేస్తూ 'చక్కెర లంగర్' ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ భవన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి చండీగఢ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు హెచ్ఎస్ లక్కీ నాయకత్వం వహించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెరుగుతున్న ద్రవ్యోల్బణం భారాన్ని సామాన్య ప్రజలపై మోపుతోందని లక్కీ ఆరోపించారు. ఆందోళనలో భాగంగా 500 చక్కెర ప్యాకెట్లను పేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. గతంలో కిలో చక్కెర సుమారు రూ.45కు లభించేదని, ప్రస్తుతం రూ.70 నుంచి రూ. 75లకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఆవాల నూనె, రిఫైన్డ్ నూనె, పప్పులు, ఇతర నిత్యావసర ఆహార పదార్థాల ధరలు కూడా నిరంతరం పెరుగుతున్నాయని లక్కీ అన్నారు. దీంతో కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై అదనపు భారం పడుతోందని చెప్పారు. ద్రవ్యోల్బణం సామాన్యుల జీవనాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని, పేద, మధ్యతరగతి కుటుంబాలు రోజువారీ వంటింటి ఖర్చులను నిర్వహించడానికి ఇబ్బందులు పడుతున్నాయని ఆయన అన్నారు. నిత్యావసరమైన చక్కెర ధర భారీగా పెరగడం ద్రవ్యోల్బణంపై ప్రభుత్వానికి నియంత్రణ లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నదని విమర్శించారు. రాబోయే రోజుల్లో చండీగఢ్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇలాంటి 'లంగర్' కార్యక్రమాలను నిర్వహిస్తామని లక్కీ తెలిపారు. ఉల్లిపాయలు, టమాటాలు, ఆవాల నూనె, రిఫైన్డ్ నూనె, పప్పులను కూడా పంపిణీ చేస్తూ ధరల పెరుగుదలపై ప్రజల దృష్టిని ఆకర్షిస్తామని చెప్పారు. ప్రజల వంటింటి ఖర్చులపై భారం పెంచడాన్ని సహించబోమని ప్రభుత్వానికి ఈ కార్యక్రమం ద్వారా సందేశం పంపామని లక్కీ అన్నారు. ద్రవ్యోల్బణాన్ని వెంటనే అదుపులోకి తీసుకుని పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ఏకపక్ష విధానాల వల్ల ఏర్పడుతున్న ఆర్థిక భారం క్రమంగా సామాన్య ప్రజలపై పడుతోందని ఆయన ఆరోపించారు. ఆదాయాలు పెద్దగా పెరగకపోయినా ఆహారం, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో ప్రజల ఆర్థిక పరిస్థితి మరింత కష్టతరమవుతోందని పేర్కొన్నారు.

# కోటాలో నీట్ అభ్యర్థిని ఆత్మహత్య!

**ఈ ఏడాది ఎనిమిదో ఘటన**

**కోటా (రాజస్థాన్):** రాజస్థాన్‌లోని కోటాలో 20 ఏళ్ల నీట్ అభ్యర్థిని ఖుష్బూ పటేల్ మంగళవారం రాత్రి తన అద్దె గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందినఆమె వైద్య ప్రవేశ పరీక్షకు రెండోసారి సిద్ధమవుతున్నది. కున్హాడీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ల్యాండ్‌మార్క్ సిటీలో ఈ ఘటన జరిగింది. ఖుష్బూ చెల్లెలు ఖుషి పటేల్ కూడా కోటాలో జెఇఇ పరీక్షకు సిద్ధమవుతున్నారు. మంగళవారం రాత్రి తరగతులు ముగించుకుని ఇంటికి వచ్చిన ఆమెకు తలుపు లోపలి నుంచి తాళం వేసి కనిపించింది. పలుమార్లు తలుపు తట్టినా స్పందన రాకపోవడంతో స్నేహితులు, సెక్యూరిటీ సిబ్బంది, పొరుగువారి సహాయం తీసుకున్నారు. తాళాలు తెరిచిన తర్వాత ఖుష్బూ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారు. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనాస్థలంలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు ఖచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదన్నారు. అయితే గతంలో నీట్ యుజి పరీక్షలో సుమారు 450 మార్కులు రావడంతో ఖుష్బూ తీవ్ర ఒత్తిడికి గురైనట్లు పోలీసులు తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేవేశ్ భరద్వాజ్ ఆమె రెండోసారి నీట్‌కు సిద్ధమవుతున్నదని, గత పరీక్ష ఫలితంపై ఒత్తిడిలో ఉన్నట్లు సమాచారం ఉందని చెప్పారు. ఖుష్బూ తాత దేశ్‌రాజ్ పటేల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# మాచేంద్రనాథన్ కమిటీ నివేదికను విడుదల చేయాలి

**సిపిఐ (ఎం) డిమాండ్**

**చెన్నై:** పరందూర్‌లో ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్ విమానాశ్రయ సాధ్యాసాధ్యాలు, ప్రజల అభ్యంతరాలను పరిశీలించేందుకు గత డిఎంకె ప్రభుత్వం ఏర్పాటు చేసిన మాచేంద్రనాథన్ కమిటీ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి కె. షణ్ముగం డిమాండ్ చేశారు. ఈనెల 26 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ప్రజా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన బుధవారం చెన్నైలో విలేకరులతో మాట్లాడారు. కమిటీ నివేదిక సమర్పించి చాలాకాలమైనప్పటికీ దాన్ని ఎందుకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదని ప్రశ్నించారు. నివేదికను దాచిపెట్టడం వెనుక ఉద్దేశం ఏమిటని నిలదీశారు. నివేదికలో కమిటీ చేసిన సిఫారసులు తమిళనాడు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. చెన్నైలో పెరుగుతున్న ప్రయాణికులు, సరకు రవాణా అవసరాలను తీర్చేందుకు రెండో విమానాశ్రయం అవసరమని పార్టీ భావిస్తోందని షణ్ముగం చెప్పారు. అయితే పరందూర్‌లో విమానాశ్రయం నిర్మాణాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. దీనివల్ల కీలకమైన జలవనరులు, బహుళ పంటలు పండించే సారవంతమైన వ్యవసాయ భూములు నష్టపోతాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు సేకరించిన భూములను రైతులకు తిరిగి అప్పగించాలని కోరారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం సేకరించిన భూమిని నిర్ణీత సమయంలో నిర్దేశిత ప్రయోజనానికి వినియోగించకపోయినా, ప్రాజెక్టును విరమించుకున్నా భూమిని రైతులకు తిరిగి ఇవ్వాలని అన్నారు. పరందూర్ గ్రీన్‌ఫీల్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించి, ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని గుర్తిస్తామని ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. బెంగళూరు–చెన్నై జాతీయ రహదారికి సమీపంలో ఉన్న పరందూర్ శ్రీపెరంబుదూర్‌కు సుమారు 28 కిలోమీటర్ల దూరంలో ఉంది.


**మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం**

**I.A. No. 702/2025 in O.S. No.200/2018**

Between:
Mandavilli Satyanarayana Murthy and two others
...*Petitioners/ Plaintiffs*
AND
Mandavilli Krishna and Others
...*Respondents/ Defendants*

20: Drakshavarapu Posi Ratnam @ Beby, W/o. D.Ranganadham, Hindu, aged 50 years, resident of Kamalapuram, Warangal Dist.,
...*20 Respondent/ Defendant*

పై నెంబరు పిటిషన్‌లో20 రెస్పాండెంటు/ డిఫెండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 31-8-2026 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**సలాది శ్రీనివాసరావు**
రాజమండ్రి — అడ్వకేట్, రాజమండ్రి
26-8-2026 — సెల్:9849197731

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 194 OF 2026**

Between:-
**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its Foreman cum Legal Managar,
**.....Disputant**
VERSUS
**P.PRASHANTH KUMAR & OTHERS**
**......Opponents**

2. Vengal Shyamkumar S/O Shankar Lingam Aged About 49 Years Occ: Teacher MPP Venkateshwaraplly. R/O. H.No. 4-19. Rangaiahpally, Regonda.
4. Ellanki Sandeep S/O Ravinder Aged About 39 Years Occ:Business.R/O.H.No.6-479,Near Fire Station,Parkal.
5. Chepyala Rajireddy S/O Ila Reddy Aged About 45 Years Occ: Doctor. R/O. H.No. 3-53/7, Laxmajipally, Jammikunta.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.09.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 187 OF 2026**

Between:-
**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its Foreman cum Legal Managar,
**.....Disputant**
VERSUS
**J.MALLAIAH & OTHERS**
**......Opponents**

1. Janga Mallaiah S/O Shankaraiah Aged About 49 Years Occ: Driver TSRTC. R/O. H.No. 1-200, Duggondi, Nachinapally, Warangal.
3. Boora Nagarjuna S/O Nageshwar Rao Aged About 37 Years Occ: Lineman. R/O. H.No. 1-189, Muthojipet, Narsampet, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.09.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 188 OF 2026**

Between:-
**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its Foreman cum Legal Managar,
**.....Disputant**
VERSUS
**A.NITHIN & OTHERS**
**......Opponents**

3. Darna Arunkumar S/O Rajesham Aged About 38 Years Occ: Docter (Vajra Hospital). R/O. H.No. 7-53, Mulkanoor, Karimnagar.
4. Veeramalla Srikanth Reddy S/O Raji Reddy Aged About 36 Years Occ: Police Constable. R/O. H.No. 2-145, Jadalpet, Mdl: Chityala, Warangal.
1. Adepu Lalitha W/O Manohar Aged About 58 Years Occ: Business. R/O. H.No. 3-5-96/2, Tailor Street, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.09.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 189 OF 2026**

Between:-
**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its Foreman cum Legal Managar,
**.....Disputant**
VERSUS
**P.RAKESH & OTHERS**
**......Opponents**

1. Putta Rakesh S/O Bikshapathi Aged About 33 Years Occ:Pvt Employee. R/O. H.No. 2-37/1, Mukundumpuram, Chennaraopet.
2. Kona Venkataramana D/O Venkanna Aged About 57 Years Occ: Sr.Tech at ICMR NIN. R/O. P.No.25, Swaroopnagar, Uppal, Rangareddy.
3. Pogula Deveraj S/O Jacob Aged About 48 Years Occ:PT.(BPO) at Ex.Eng Mission Bhagiratha. R/O. H.No. 22-1-322, Deshaipet, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.09.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 193 OF 2026**

Between:-
**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its Foreman cum Legal Managar,
**.....Disputant**
VERSUS
**G.SHIVA & OTHERS**
**......Opponents**

3. Elugu Srinivas S/O Sriramulu Aged About 49 Years Occ: Chainman MPSU KUDA Hanmkonda. R/O. H.No. 16-8-652, Labour Colony, Warangal.
1. Kandibanda Ratnakumari D/O Parsi Venkateshwarlu Aged About 42 Years Occ: DTCPO-Director & Towen country Planinng. R/O. H.No. 5-11/25/S/304, Royal Enclave, Naimnagar, Near Tejaswini School, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.09.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

# పాకిస్థాన్ 'పిమ్స్' ప్రసూతి వార్డులో అగ్ని ప్రమాదం

- 14 మంది శిశువులు ఆహుతి
- సహాయం కోసం అనేక గంటలు ఎదురుచూపులు




**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ ఆసుపత్రి ప్రసూతి వార్డులో బుధవారం భారీ అగ్నిప్రమాదం చెలరేగింది. ఈ ప్రమాదంలో 14 మంది శిశువులు అగ్నికి ఆహుతయ్యారు.ఇస్లామాబాద్‌లోని ప్రభుత్వ అధీనంలో ఉన్న అతి పెద్ద పాకిస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(పిమ్స్) ఆసుపత్రిలోని ఒక గైనకాలజీ విభాగం ప్రసూతి వార్డులో బుధవారం ఉదయం ఏడు గంటలకు ఈ విషాద ఘటన సంభవించింది. అప్పుడే ప్రసవం జరిగిన తల్లులు కూడా ఈ వార్డులో ఉన్నారు. ఈ ప్రమాదం జరిగిన తర్వాత సహాయంకోసం ఆర్తనాదాలు చేస్తూ తల్లిదండ్రులు అనేక గంటలసేపు ఎదురుచూశారు. వారు నిరాశానిసస్పృహలకు గురయ్యారు. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ఆ తర్వాత ప్రభుత్వం కదిలింది. ఒక ఎయిర్ కండిషనర్ యూనిట్ నుండి మంటలు చెలరేగినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పారు. నాలుగు గంటల తర్వాత గానీ పోలీసులు ఘటనా స్థలం వద్దకు చేరుకోలేదని బాధిత బంధువులు రోదిస్తూ చెప్పారు.

ఈ విభాగంలో 15 మంది శిశువులు ఉండగా వైద్యులు కేవలం ఒక్క శిశువును మాత్రమే కాపాడగలిగారని పిమ్స్ ప్రతినిధి డాక్టర్ అనీజా జలీల్ డాన్ చెప్పారు.ఈ ఘటనపై విచారణ చేసేందుకు డిప్యూటీ కమీషనర్ జనరల్ నేతృత్వంలో ఒక అధికారిని నియమించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. విద్యుదాఘాతం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, వార్డులో ఆక్సిజన్ లైన్లు ఉండటం వల్ల మంటలు శరవేగంగా వ్యాపించాయని పాకిస్థాన్ పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి తారిఖ్ ఫజల్ చౌధురి మీడియాకు చెప్పారు. విచారణ కొనసాగుతోందని, ఈ ఘటనకు బాధ్యులైనవారిని వదిలిపెట్టబోమని, కఠినంగా శిక్షిస్తామని ఆయన చెప్పారు. 14 గంటల్లో విచారణ జరిపి నివేదికను ప్రధానమంత్రి సమర్పిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా, ఈ ఘటనపై చర్చించేందుకు పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేస్తూ, తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై క్షుణ్ణంగా విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని ప్రకటించింది. అదేవిధంగా దేశాధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ఒక ప్రకటన విడుదల చేస్తూ నవజాత శిశువుల మరణాలు భర్తీచేయలేమని, తల్లితండ్రులకు తీవ్రమైన కడుపుకోత కలుగుతుందని విచారం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# అమెరికా ఏకపక్ష చర్యలు తిరస్కరించండి


## ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ పిలుపు



**న్యూయార్క్:** అమెరికా అనుసరిస్తున్న ఏకపక్ష బలవంతపు చర్యలను అన్ని దేశాలు తిరస్కరించాలని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ ప్రతినిధి పిలుపు ఇచ్చారు. ప్రపంచ స్థానిక ఆహార సంక్షోభాలను తగ్గించడంలో భద్రతామండలి పాత్ర అనే అంశంపై ఇరాన్ రాయబారి ఘోలమ్ హొస్సేన్ దర్జీ మాట్లాడుతూ, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి సార్వభౌమాధికారాలను ధిక్కరించేవిధంగా అమెరికా విధిస్తున్న బలవంతపు,ఏకపక్ష విధానాలను ప్రపంచ దేశాలు తిరస్కరించాలని కోరారు. 2018 లో భద్రతామండలి చేసిన 2417 తీర్మానం ప్రకారం ఆకలితో ఏ దేశం ఉండకూడదని, కానీ ఆకలితో అలమటించేట్టు చేయడం ఒక యుద్ధవ్యూహంగా మారిందని,కానీ గాజాలో అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి దురాక్రమణ దేశాలు ప్రజల హక్కులను తిరస్కరించి వారిని ఆకలితో మాడిపోయేట్టు చేస్తూదానికి ఒక యుద్ధ వ్యూహంగా అమలు చేస్తున్నాయన్నారు. గాజాలో జరుగుతున్న మారణహోమానికి అమెరికా రాజకీయ రక్షణ, కల్పిస్తున్న అడ్డంకుల కారణంగా భద్రతామండలి తన ఛార్టర్‌ను అమలు చేయడంలో,జవాబుదారీ వహించడంలో పదే పదే విఫలమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి వైఫల్యానికి కారణం అమెరికా–ఇజ్రాయెల్ సాగిస్తున్న దురాక్రమణ యుద్ధమేనని, ఈ యుద్ధానికి ముందు హోర్ముజ్ జలసంధిలో నౌకలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేవని గుర్తుచేశారు. ఈ దురాక్రమణ యుద్ధంవల్ల అయొతొల్లా అలీ ఖమేనీ సహా అనేకమంది నాయకులు అమరవీరులయ్యారని, 4,500 మంది ప్రజలు హతులయ్యారని గుర్తుచేశారు. అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ ఆగస్టు 24వ తేదీన ప్రకటించిన "ఆపరేషన్ ఎకనామిక్ ఔట్‌కాస్ట్" ద్వారా ఇరాన్‌పై ఆహార, ఇంధన, వాణిజ్య, నిత్యావసర వస్తువుల లభ్యత లేకుండా ఒత్తిడి చేస్తూ ఇరాన్ ప్రజల ఐక్యతకు పరీక్ష పెడుతున్నారని, దీనిని ఒక యుద్ధ సాధనంగా వాడుకుంటున్నారని, తద్వారా అంతర్జాతీయ చట్టాలు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. సార్వభౌమాధికార దేశాలనుపై బలవంతంగా ఒత్తిడిచేసి వాటి విదేశాంగ విధానాలను మార్చుకోవాలని హెచ్చరికలు చేయడం ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌ను ఉల్లంఘించినట్టే కాగలదన్నారు. యుద్ధ పరిష్కారానికి మూల కారణమైన హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం సమస్యను, ఆ మూల కారణాన్ని ముందుగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఘోల్ హొస్సేన్ దర్జీ భద్రతామండలి ద్వారా ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రాంతీయ భద్రత–స్థిరత్వానికి ముస్లిం దేశాల కూటమి

## ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ పిలుపు



**టెహ్రాన్:** ప్రాంతీయ భద్రత, స్థిరత్వాన్ని సాధించేందుకు ముస్లిం దేశాల కూటమి ఏర్పాటు చేయాలని ఇరాన్ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ పిలుపు ఇచ్చారు. పశ్చిమాసియాలో విస్తారంగా ఉన్న ప్రకృతి వనరులు,సంపదను దోచుకోవడానికి కొన్ని శక్తులు కన్నువేశాయని, వారిని తిప్పికొట్టాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం దేశాలమధ్య ఐక్యత అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ముస్లిం దేశాలమధ్య మరింత ఐక్యత పెంపొందించడం ద్వారా మాత్రమే పశ్చిమాసియా ప్రాంతం నుండి అమెరికా సైనిక బలగాలను సత్వరం తరిమికొట్టడం సాధ్యపడుతుందని ఆయన అన్నారు. ఇరాకీ సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్ అధ్యక్షుడు ఫైక్ జిదాన్, ఆయన వెంట వచ్చిన ప్రతినిధిబృందంతో టెహ్రాన్‌లో బుధవారం సమావేశమైన సందర్భంగా పెజెష్కియన్ మాట్లాడుతూ, ముస్లిం దేశాలమధ్య ప్రపంచవ్యాప్తంగా రాజకీయ,ఆర్థిక,సాంస్కృతిక,సామాజిక సంబంధాలు విస్తృతం కావాల్సిన అవసరం ఉందని,విస్తారమైన ప్రాంతీయ భద్రతను అభివృద్ధి చేసుకునేందుకు పటిష్టమైన పునాదులు సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని,ఈ ప్రాంతంలో ముస్లిం దేశాలు తమ మధ్య ఉన్న అపార్థాలను తొలగించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇరాకీ జ్యుడీషియల్ కౌన్సిల్ అధ్యక్షుడు జిదాన్ స్పందిస్తూ, ఇరాన్‌తో ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ఇరాక్ దేశం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని ఆయన ప్రశంసించారు. ఆర్థిక,సాంస్కృతిక,సామాజిక రంగాలలో ఉమ్మడి చొరవలు,ఆచరణాత్మక చర్యల ద్వారా ప్రాంతీయంగా బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించగలుగుతామన్నారు. తశాంతి,సుస్థిరత,భద్రత సాధనకు మన మధ్య ఐక్యత పెంపొందాల్సిన అవసరం ఉందని, అపార్థాలు పోవాలని, ఈ ప్రాంతంలో ఉన్న సంపదను దోచుకోవడానికి విభజనలు సృష్టించి,విభేదాలు,ఘర్షణలు విస్తరించి లాభం పొందాలని ప్రయత్నించే శక్తులను ఓడించేందుకు ఈ ఐక్యత అవసరమని మసూద్ పెజెష్కియన్ పునరుద్ఘాటించారు. ఇస్లామిక్ దేశాలమధ్య ఐక్యత,సహకారం,సమన్వయ దృక్పథం పెంపొందాల్సిన అవసరం ఉందని అన్నారు.

# నేపాల్‌లో సహాయ చర్యలకు జిన్‌పింగ్ పిలుపు

**బీజింగ్:** నైరుతీ చైనాలో బుధవారం ఉదయం కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో ఈ శిథిలాలకింద పడి అనేక మంది సమాధి అయ్యారు. వారిని వెలికితీసేందుకు, సజీవులను వెతికేందుకు భారీస్థాయిలో సహాయ చర్యలు చేపట్టారు.అదేవిధంగా టిబెట్–నేపాల్ సరిహద్దుల్లో చెలరేగిన జలవిలయంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ వెంటనే స్పందించారు. గాలింపు చర్యలు చేపట్టాలని, తగిన తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పీపుల్స్ ఆర్మీకి చెందిన షిగాజే దలళానికి చెరందిన 145 మంది బలగాలను ఆ ప్రాంతంలో సహాయ కార్యక్రమాలు కొనసాగించడానికి వెళ్ళాలని ఆదేశించారు. జియాంగ్ అటానమస్ రీజియన్ గిరాంగ్ పోర్టు సమీపంలో ఈ ఘటన జరిగింది. జిగాజే నగరంలోని గిరాంగ్ కౌంటీ అత్యవసర విభాగం అధికారులు చెప్పిన సమాచారం ప్రకారం, పోర్టుకు వెళ్ళే దారులన్నీ మూసుకుపోవడంతోపాటు కమ్యూనికేషన్ విభాగంలు,విద్యుత్ సరఫరా మార్గాలు కూడా దెబ్బతిన్నాయి.ఉత్తర నేపాల్‌లోని చైనా–నేపాల్ సరిహద్దుల్లో గిరాంగ్–రసువా పోర్టును ఆకస్మిక వరదలు ముంచెత్తాయని అధికారులు చెప్పారు.నేపాల్‌లో జరిగిన జలవిలయాన్ని ప్రస్తావిస్తూ, చైనా జాతీయులు జలవనరులకు,కొండలు,పర్వత ప్రాంతాలకు దూరంగా ఉండాలని చైనా రాయబారి ఆదేశాలు జారీ చేశారు.

# హోర్ముజ్ సుంకాలపై ఇరాన్–ఒమన్ అంగీకారం



**టెహ్రాన్:** హోర్ముజ్ జలసంధి ద్వారా వసూలు చేసే సుంకాలను సమానంగా పంచుకునే విషయంపై ఇరాన్–ఒమన్ మధ్య ఒక ఒప్పందం కుదిరిందని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ రివల్యూషనరీగార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) చెప్పింది. ఇరాన్ పాక్షిక అధికారిక వార్తా సంస్థ తస్నీమ్ ఈ విషయం వెల్లడించిందని జిన్హువా వార్తాసంస్థ బుధవారం రాత్రి ప్రకటించింది.హోర్ముజ్ జలసంధి నియంత్రణపై ఈ రెండు దేశాలమధ్య కొద్ది వారాలుగా చర్చలు జరుగుతున్నా యి. అదేవిధంగా ఒక కొత్త జలమార్గాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా రెండు దేశాలు ఒక పటాన్ని,ప్రణాళికను ఏర్పాటు చేస్తున్నాయి. జలసంధిలోకి నౌకలు ఏ మార్గంలో ప్రవేశించాలో, ఏ మార్గం నుండి బయటకు వెళ్ళాలో కూడా ఇప్పటికే నిర్దేశించుకున్నాయి. జలసంధిలోంచి బయటకు వచ్చే నౌకలన్నీ ఒమన్ సమీపం నుండి వస్తాయి. ఐతే ఈ విషయంలో ఇరాన్‌తో చేతులు కలిపితే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని అమెరికా ఇప్పటికే ఒమన్‌కు హెచ్చరిక చేసింది. హోర్ముజ్ జలసంధిలో జలాలను, వాటి ద్వారా వచ్చే ఫీజులను పంచుకోవడంపై రెండు దేశాలమధ్యా ఒక అంగీకారం కుదిరిందని ఐఆర్‌జిసి చెప్పింది.ఇరాన్‌పై అమెరికా "ఆపరేషన్ ఎకనామిక్ ఔట్‌కాస్ట్'ను అమలు చేయడం ప్రారంభించిన తర్వాత పశ్చిమ ఆసియాలో తోటి దేశాలను తనవైపు తిప్పుకునేందుకు ఇరాన్ పాలకులు తమ చర్యలను ముమ్మరం చేశారు. ఇరాక్‌తో కూడా ఇరాన్ సన్నిహిత సంబంధాలు పెంచుకోవడానికి ఆదానప్రదానాలను పెంచింది. ముస్లిం దేశాల ఐక్యతకు పిలుపు ఇచ్చింది.

# మహా జలప్రళయం

(మొదటి పేజీ తరువాయి)

133 మంది భారతీయులుసహా అమెరికా, బ్రిటన్,ఫ్రాన్స్,దక్షిణాఫ్రికా, మలేసియా, దక్షిణకొరియా, ఆస్ట్రేలియా, డచ్ దేశాలకు చెందిన 391 మంది పర్యాటకులున్నారు. జాడ తెలియనివారిలో 93 మంది నేపాలీ పర్యాటకులు ఉన్నారు. ఐతే ఇప్పటివరకూ గాలింపు చర్యల్లో 95 మృతదేహాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో 18 మృతదేహాలను చితవాన్‌జిల్లా నుండి, 16 మృతదేహాలను ధాడింగ్‌జిల్లా నుండి, 11 మృతదేహాలను నువాకోట్ నుండి స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో 12 మంది బ్రిటన్ వాసులున్నారని, 93 మంది గాయపడ్డారని ప్రాథమిక నివేదిక వెల్లడించింది. మంచుకొండల్లో భూకంపం కారణంగా హిమపాతం సంభవించి మెరుపు వరదకు కారణమై ఉండవచ్చునని నేపాల్ విదేశాంగమంత్రి షిసిర్ ఖానల్ చెప్పారు. టిబెట్‌లో కూడా మరణాలు సంభవించాయని చైనా మీడియా ప్రకటించింది.

రాజధాని కాఠ్మండుకు ఈశాన్యంగా 125 కి.మీ దూరంలో టిబెట్ సరిహద్దు సమీప జిల్లాలపై జల విస్ఫోటనం తాండవం చేసింది. జల ప్రళయం జనావాసాలపై విరుచుకుపడిన వీడియోలు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అవుతున్నాయి. లెండే నది ఉప్పొంగిందని, శిలలు విరిగిపడి నీటితో కలిసి దూసుకువచ్చాయని ఈ కారణంగా తిమూరే వద్ద భారీ వరద భోష్‌కోటే మీదుగా త్రిశూలీ నదిలోకి ప్రవేశించిందని నేపాల్ ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ, నిర్వహణా సంస్థ (ఎన్‌డిఆర్ఆర్ఎంఎ) రాత్రి పొద్దుపోయాక ఒక ప్రకటనలో తెలియజేసింది.కాఠ్మండు యూనివర్సిటీ ప్రొఫెసర్,వాతావరణ పరిశోధకుడు రిజాన్ భక్త కాయస్థను ఉటంకిస్తూ 'కాఠ్మండు పోస్ట్' ప్రకటించిన కథనం ప్రకారం, నేపాల్‌పై జలవిలయం సంభవించిన సమయంలోనే టిబెట్‌వైపు సుమారు 4.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. అమెరికా భూగర్భసర్వే సమాచారం ప్రకారం బుధవారం ఉదయం 8.30 గంటలకు ఉత్తర గోసైన్‌కుండకు 45 కి.మీ దూరంలో టిబెట్ భూభాగంలో భూకంపం సంభవించింది.

ఈ ఆకస్మిక విషాద ఘటనపట్ల నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణ సహాయ చర్యలు జాగ్రత్తగా కొనసాగించాలని,ప్రాణనష్టం తగ్గించాలని అన్ని రంగాలూ సమన్వయంతో పనిచేయాలని అధికారులకు మార్గదర్శనం చేశారు.దేశాధ్యక్షుడు చంద్రపాడెల్ కూడా ఒక విజ్ఞప్తి చేస్తూ ఈ సమయంలో రాజకీయపార్టీలు,అధికార యంత్రాంగం,సాంఘిక సంస్థలను తగిన బాధ్యతతో తమ వంతు పాత్ర సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. భారీ వర్షాలవల్ల ఈ ఆకస్మిక వరదలు సంభవించలేదనీ, గడచిన 24 గంటల్లో రసువాలో ఏడు మిల్లీ మీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైందని హైడ్రాలజీ,మెటీరియాలజీ విభాగాలు చెప్పాయి.బహుశా హిమనీ నదాలవల్ల నీ వరదలు వచ్చాయనే విషయంపై నిపుణులు దృష్టిపెట్టి అధ్యయనం చేస్తున్నారు. కాగా నేపాల్ ఘోర విలయంలో బాధితులకు సహాయం చేసేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ సన్నద్ధమైంది.ప్రాథమికంగా 1000 మందికి సరిపడ మందులు,సామాగ్రి,టెంట్లు సరఫరా చేస్తోంది. కాఠ్మండు బి.ఆర్.ఆసుపత్రి,ట్రామా సెంటర్‌లో 100 అదనపు పడకలను,అదనపు వైద్యులు,అదనపు నర్సులను సిద్ధం చేశారు. అదేవిధంగా భారత అధికారులు సహాయ చర్యల్లో నిమగ్నమయ్యారు. ప్రత్యేకంగా హాట్‌లైన్లు ఏర్పాటు చేశారు. 1234, 1144, 9851289445, 977 985 131 6807 టెలిఫోన్ నెంబర్లను సంప్రదింపులకోసం ఏర్పాటు చేశారు.

ఈ వరదలవల్ల తిమురేలోని రసువా కస్టమ్స్ కార్యాలయంలోని ముగ్గురు తాత్కాలిక ఉద్యోగులు సహా 14 మంది కస్టమ్స్ సిబ్బంది వరద తీవ్రతలో కొట్టుకుపోయారు. హెలికాప్టర్ ద్వారా సైనికబలగాలు 88 మందిని రక్షించాయన్నది ప్రాథమిక సమాచారం. గాలింపు చర్యల నిమిత్తం నాలుగు సైనిక హెలికాప్టర్లను,ఎనిమిది ప్రైవేటు హెలికాప్టర్లను రంగంలోకి దించారు. సైనిక బలగాలు సహాయ చర్యలను ముమ్మరం చేశాయి. బిదుర్ మున్సిపాలిటీ–4 లో వరదనీటిలో చిక్కుకుని అస్వస్థతకు గురైన ఐదుగురిని రక్షించి చక్రదేవ్ ఆసుపత్రికి తరలించారు. ఈ వరదలవల్ల ప్రధానంగా ఇళ్ళు,మౌలిక సదుపాయాలకు అపారనష్టం వాటిల్లింది. దేవీఘాట్ జలవిద్యుత్ ప్రాజెక్టుకు నష్టం వాటిల్లింది. 25 మెగా వాట్ల సౌర విద్యుత్ ప్లాంటులోని మూడు బ్లాకులు,ఒక సబ్ స్టేషన్ కొట్టుకుపోయింది. ఆర్థికమంత్రిత్వశాఖ సచివాలయం సమాచారం ప్రకారం చీఫ్ కస్టమ్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజేంద్ర ధుంగనాతోసహా 20 మంది సిబ్బంది ఆచూకీ లభించింది. వారు సురక్షితంగా ఉన్నారు.

హిమాలయన్ గ్లేసియర్ నుండి 37 మంది ఎన్‌ఆర్ఐలు సహా 291మంది విదేశీ పర్యాటకులు,మరో 93 మంది నేపాలీయులు కూడా జాడతెలియనివారిలో ఉన్నారని నేపాలీ టూరిస్ట్ బోర్డు (ఎన్‌టిబి) ప్రకటించింది.ఈ గణాంకాలలో సజీవంగా,క్షేమంగా ఉన్నవారు ఎంత మంది అనే వివరాలను ఎన్‌టిబి మదింపు వేస్తోంది. భోష్‌కోటి నదిలో భారీ వరద టిబెట్ వైపు నుండి నేపాల్‌లోకి ప్రవేశించింది. దీనివల్ల నువాకోట్‌లోని త్రిశూలీ బజార్ సమీపంలో ఉన్న 60 ఇళ్ళు వరదల్లో కొట్టుకుపోయాయి.వరదలవల్ల మోటారు వాహనాలు ప్రయాణం చేసే రెండు వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాకపోకలకు పనికిరాకుండాపోయాయి. దేవీఘాట్ ప్రాంతం కూడా తీవ్రంగా ప్రభావితమైంది. ముందస్తు హెచ్చరికలు అందుకున్న తర్వాత అనేకమంది నదీతీర ప్రాంత ప్రజలు ముదుగానే ఇళ్ళు ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళగలిగారు.

గల్లంతైన 291 మంది పర్యాటకుల పేర్ల జాబితాలను ఎన్‌టిబి విడుదల చేసింది.గల్లంతైనవారిలో ఫ్రాన్స్‌దేశీయులు ఉన్నారు.సహాయ చర్యలు కొనసాగుతున్నాయి.వరద ప్రవాహంలో కొట్టుకుపోయినవారిలో స్మార్ట్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా 59 మంది భారతీయులు సహా 71 మంది పర్యాటకులున్నారు.లీఫ్ హాలిడే సంస్థ ద్వారా నేపాల్‌లో పర్యటన చేస్తున్నవారు 55 మంది, హిమాలయన్ గ్లేసియర్ ద్వారా 52 మంది ఉన్నారు. కైలాస పర్వతాలకు ప్రయాణం చేసేవారు 31 మంది ఉన్నారు. ఫిష్ టెయిల్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా ముగ్గురు అమెరికన్లు,17 మంది మలేసియావాసులు,దక్షిణ కొరియాకు చెందిన ఎనిమిది మంది, ఆల్ఫైన్ ఎకోట్రెక్ ద్వారా నేపాల్‌లో పర్యటిస్తున్నవారిలో బ్రిటన్‌కు చెందిన 12 మంది,దక్షిణాఫ్రికాకు చెందిన నలుగురు ఉన్నారు. పర్యాటక,ప్రయాణ ఏజన్సీల నుండి అందినవ సమాచారం ఆధారంగా ఈ గణాంకాలను సంకలనం చేశామని,ప్రయాణ ఏజన్సీలు,గైడ్‌లు,స్థానిక అధికారులు,భద్రతాసంస్థల సమన్వయంతో ఈ వివనాలను ధృవీకరిస్తున్నట్లు పేర్కొంది.

# ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

గమనించని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుండి కంటైనర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద దాటికి కంటైనర్‌లో ఉన్న ఇనుపరాడ్లు బస్సులోకి దూసుకెళ్లడంతో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో కొందరు అందులోనే చిక్కుకుపోయారు. ఆ సమయంలో బస్సులోని ప్రయాణికులు నిద్రలో ఉండటంతో ఒక్కసారిగా జరిగిన ప్రమాదాన్ని ఎదుర్కొనే అవకాశం లేకుండా పోయింది. క్షణాల్లోనే బస్సులో భయానక పరిస్థితి నెలకొంది. అద్దాలు పగిలి, ఇనుపరాడ్లు చొచ్చుకురావడంతో ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు పెట్టారు. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి.

### అసలేంజరిగింది ?

హైద్రాబాద్ నుంచి ఏలూరు వైపు 42 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ టావెల్స్ బస్సు గమ్యస్థానానికి మరికొంత దూరంలో ఉండగానే ప్రమాదానికి గురైంది. అప్పటివరకు ప్రశాంతంగా సాగుతున్న ప్రయాణం ఒక్కసారిగా విషాదంగా మారింది. తోటి ప్రయాణికులు నిద్రలో ఉండగానే ప్రమాదం సంభవించడంతో పలువురు ఏం జరిగిందో తెలుసుకునేలోపే తీవ్రంగా గాయపడ్డారు. మృత్యువు తమ పక్కన ఉందని ఊహించని ప్రయాణికుల జీవితాల్లో ఒక్కక్షణం పెను విషాదాన్ని మిగిల్చింది. చిమ్మ చీకటిలో క్షత్రగాత్రుల హహకారాలు ప్రమాదం జరిగిన సమయంలో ఇంకా పూర్తిగా తెల్లవారులేదు. చుట్టు చిమ్మ చీకటిలో అలుముకుని ఉండగా బస్సులో చిక్కుకున్న క్షతగాత్రుల ఆర్తనాదాలు మారుమ్రోగాయి. సహాయం కోసం వారు చేసిన కేకలు స్థానికులకు కలిచివేశాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా హుటాహుటిన ఘటనస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని అంబులెన్స్‌లో కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఎన్టీఆర్ జిల్లా పడమటి లంకపల్లికి చెందిన చెన్నకేశవులు నాగేంద్రబాబు, ఊట్కూరు మండలం తెల్లప్రోలు గ్రామానికి చెందిన యాసరపు చిన్ని, విజయవాడకు చెందిన బేలిపొగు మేరికృష్ణ, కొండూరు భావన వర్ష, సురవరపు షకినా, పిడికిటి లక్ష్మి తేజ మృతుల్లో ఉన్నారు.

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 14 మందిని వెంటనే కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తీవ్రగాయాలైన కొందరిని మెరుగైన వైద్య కోసం వారి కుటుంబ సభ్యులు ఇతర ఆసుపత్రులకు తరలించారు. మరోవైపు మృతదేహలను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి మార్చురికి తరలించి పోస్టుమార్టం ప్రక్రీయ చేపట్టారు. క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించేందుకు వైద్య సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు.

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె. నర్సింహా సంఘటన స్థలానికి చేరుకుని ప్రమా దం జరిగిన తీరును పరిశీలించారు. పోలీస్ అధికారులను అడిగి ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను అదేశించారు. అనంతరం వారు కోదాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

### ఆర్తనాదాలు..

ప్రమాదంలో తమవారు ఉన్నరన్న సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. తమ ఆత్మీయులను వెతుక్కుంటూ వచ్చిన కుటుంబ సభ్యులు విషాదకర దృశ్యాలు ఎదురయ్యాయి. మృతదేహాలను చూసిన బంధువుల రోధనలు, ఆర్తనాదాలతో ఆసుపత్రి ప్రాంగణం కన్నీటి పర్యంతమైంది. కాసేపటి క్రితం వరకు తమతో మాట్లాడిన వారు విగతజీవులుగా మారడంతో కుటుంబ సభ్యుల బాధ వర్ణనాతీతంగా మారింది.

# సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ తీవ్ర దిగ్భ్రాంతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సూర్యాపేట జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోదాడ మండలం ద్వారకుంట సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కంటైనర్‌ను ఢీకొన్న ఘటనలో పలువురు మృతి చెందడం పట్ల సిఎం విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్యం అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)ను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. క్షతగాత్రులకు వైద్య సేవల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సిఎం సూచించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ప్రాణనష్టం సంభవించడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు.ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికి సకాలంలో అత్యుత్తమ వైద్య సేవలు అందేలా అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, చికిత్స విషయంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు. గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికుల జీవితాలు మార్గమధ్యంలోనే విషాదాంతం కావడం హృదయవిదారకమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ఈ అపార విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చం ద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి, వైఎ స్ఆర్‌సిపి చీఫ్ వైఎస్ జగన్మోహన్ రెడ్డి తదితరులు కూడా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

# హైదరాబాద్ నుంచే...156 మంది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేపాల్ వరద ఘటనలో హైదరాబాద్‌కు చెందిన 133 మంది గల్లంతయ్యారు. వీరంతా ఓ ప్రైవేటు టూర్ ఏజెన్సీ ద్వారా 156 మంది తెలుగు యాత్రికులు నేపాల్ పర్యటనకు వెళ్లారు. యాత్రికుల బృందం అక్కడి హోటల్లో బస చేసింది. అయితే, వీరు స్థల సందర్శన కోసం హోటల్ నుంచి బయటకు వెళ్లగా, అనారోగ్య కారణాల వల్ల 23 మంది గదులకే పరిమితమయ్యారు. సరిగ్గా అదే సమయంలో భోకోశీ నదికి భారీ వరదలు సంభవించాయి. దీంతో బయటకు వెళ్లిన వారితో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. వారి ఫోన్లు స్విచ్‌ఆఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. హోటల్లోనే ఉండిపోయిన 23 మంది మాత్రం సురక్షితంగా ఉన్నారని తెలిసింది. గదిలోనే ఉండిపోయిన వారిలో నలుగురు ఆంధ్రప్రదేశ్లోని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన వారని గుర్తించారు.

నేపాల్ వరద విపత్తు, అందులో తెలుగు యాత్రికులు గల్లంతైన వార్త తెలియడంతో తెలుగు రాష్ట్రాల్లోని వారి కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. తమ వారి ఆచూకీ కోసం వారు టూర్ ఏజెన్సీని, అధికారులను సంప్రదిస్తున్నారు. గల్లంతైన వారిని సురక్షితంగా గుర్తించేందుకు సహాయక చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాలను వేడుకుంటున్నారు.

# రైతుల ట్రాక్టర్ ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

ర్యాలీ జంక్షన్, టౌన్ ప్రాంతాల మీదుగా సాగి భారత్ మాతా చౌక్ వద్ద ముగిసింది. ర్యాలీ పట్టణంలో కొనసాగుతున్న సమయంలో పోలీసులు పెద్ద సంఖ్యలో బలగాలను మోహరించారు. అటల్ భూజల్ యోజన కింద వ్యవసాయ చెరువులు నిర్మించేందుకు తాము రుణాలు తీసుకున్నామని రైతులు తెలిపారు. ఈ పథకం కింద ప్రభుత్వం హామీ ఇచ్చిన సబ్సిడీ చాలా కాలంగా తమకు అందలేదని వారు చెప్పారు. దీంతో రుణాల వాయిదాలతో పాటు వడ్డీ భారం కూడా తమపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు నాయకులు రాయ్‌సాహబ్ పచార్, రేషమ్ సింగ్ మానుకా మాట్లాడుతూ, తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పరిపాలనా అధికారులకు పలు మార్లు వినతిపత్రాలు సమర్పించామని చెప్పారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో ఆందోళనను మరింత ఉధృతం చేయడం తప్ప తమకు మరో మార్గం లేదని పేర్కొన్నారు. పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలకు ముందు ఆందోళన చేపట్టడం తమకు తప్పనిసరి పరిస్థితిగా మారిందని రైతులు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్‌ను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# వర్షం కారణంగా ముగిసిన నాలుగో రోజు ఆట

గెలుపు ముంగిట భారత్




శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజ్‌లో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది. అయితే వర్షం ముప్పు పొంచి ఉండటం టీమిండియాను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షం కరుణిస్తే విజయం భారత్ సొంతమవ్వనుంది.

**శ్రీలంక 290 ఆలౌట్..** అంతకు ముందు 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాట ర్ సోనాల్ దినుషా(162 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ (3/52), మానవ్ సుతార్(3/85) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్‌కు శ్రీలంక 25 పరుగులు మాత్రమే జోడించింది.

**శుభ్మన్ గిల్ వ్యూహం..** ఈ టెస్ట్ విజయంపై ఫోకస్ పెట్టిన భారత్ వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉదానా(3)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబండార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు. కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా.. శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. సెకండ్ సెషన్లో శ్రీలంక ఆధిపత్యం చెలాయించింది. సూర్యబండార, కామిందు మెండీస్ ఆచితూచి ఆడారు. ఈ ఇద్దరూ బ్యాటింగ్ చేస్తూ.. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు.

**మలుపు తిప్పిన మానవ్ సుతార్, ప్రసిధ్ కృష్ణ** పసిందు సూర్యబండార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. కామిందు మెండీస్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్‌తో కామిందు మెండీస్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా క్రీజులోకి రాగా.. శ్రీలంక 199/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్వెల్లాను సరాన్ష్ జైన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. సోనాల్ దినుషా, కేశర నువాంత మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

# ఆ ఐదుగురి పేర్లే ఇవ్వలేదు

'సాయ్' స్పందన



గేమ్స్ టెన్నిస్ కోసం ప్రకటించిన ఏడుగురి బృందంలో తెలంగాణ అమ్మాయి, భారత నంబర్ వన్ ర్యాంకర్ యమలపల్లి సహజ సహా ఐదుగురు ప్లేయర్లను తప్పించడంపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) స్పందించింది. మెగా గేమ్స్ కోసం తమకు భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) నుంచి వచ్చిన ప్రతిపాదనల ప్రకారమే ఎంపిక చేశామని ఒక ప్రకటనలో తెలిపింది. అసలు ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్(ఐటా) ఇచ్చిన జాబితాలోనూ వారి పేర్లు లేవు' అని పేర్కొంది. అయితే దీనిపై ఐటా ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. 'మేం జాబితాలో ఆటగాళ్ల పేర్లివ్వలేదనడం సరికాదు' అని చెప్పడం గమనార్హం. క్రీడా మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం.. గడిచిన 12 నెలల కాల వ్యవధిలో సింగిల్స్ విభాగంలో(ఆసియాలో) టాప్6, డబుల్స్ కేటగిరీలో టాప్8 ర్యాంకులో ఉన్నవారిని మాత్రమే తీసుకుంటారు. సహజతో పాటు మానస్ ధామ్నె (మెన్స్ సింగిల్స్), వైష్ణవి (విమెన్స్ సింగిల్స్), వైదేహి చౌదరి (విమెన్స్ డబుల్స్), ప్రార్థనా (విమెన్స్ డబుల్స్) పేర్లను ఆసియాడ్లో చేర్చకపోవడాన్ని టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న తప్పుబట్టాడు.



# ఫైనల్లో ప్రజ్ఞానంద

సెయింట్ లూయిస్(యూఎస్ఏ)లో జరుగుతున్న ప్రతిష్టాత్మక గ్రాండ్ చెస్ టూర్ (జీసీటీ)లో భారత గ్రాండ్ మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ర్యాపిడ్‌తో పాటు బ్లిట్జ్ గేమ్స్‌లో ప్రజ్ఞా.. విన్సెంట్ కీమర్(జర్మనీ)పై గెలిచి తుదిపోరుకు అర్హత సాధించాడు. మరో సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఫాబియానో కరువానా(యూఎస్ఏ) వెస్లీసోపై గెలిచాడు. ఫైనల్లో ప్రజ్ఞా, కరువానా తలపడనుండగా మూడోస్థానం కోసం కీమర్.. వెస్లీతో ఆడనున్నాడు.

# సంచారం నుంచి.. స్థిర నివాసం వరకు

జీవి ఆవిర్భావం తర్వాత కొన్ని లక్షల సంవత్సరాల పాటు మనిషి జీవన శైలి ఒకే విధంగా కొనసాగింది. అరణ్యాలలో సంచరిస్తూ, మృగాలను వేటాడుతూ, ప్రకృతి ఇచ్చిన పండ్లు, వేర్లు సేకరిస్తూ జీవనం సాగించింది. ఆ జీవన విధానం వనరులపై ఆధారపడి, కదులుతూ ఉండే సంచార సంస్కృతి అయ్యింది. కానీ సుమారు పదివేల సంవత్సరాల క్రితం, అంటే క్రీస్తుపూర్వం 8000ప్రాంతంలో, మనుషులు చరిత్రలోనే అతిపెద్ద మలుపు తిప్పారు. వేటగాళ్ళు, పండ్లు, ఆకులు సేకరించేవాళ్ళుగా ఉన్న మన జాతి, క్రమంగా స్థిర జీవనానికి మారింది. అదే వ్యవసాయ విప్లవం లేదా నియోలిథిక్ విప్లవం. మనిషి ఎందుకు ఈ మార్పును కోరుకున్నాడు? ఎందుకు వన్యజీవనాన్ని విడిచి, నేల పగలగొట్టి పంటలు వేయడం మొదలు పెట్టాడు? ఇలాంటి ప్రశ్నలకు ఖచ్చితనమైన సమాధానం అంటూ లేదు. వాతావరణ మార్పులు, జనాభా పెరుగుదల, ఆహార సరఫరా అస్థిరత వంటి అనేక కారకాలు దీనికి కారణమయ్యాయి. సుమారు ఆ కాలంలో, చివరి హిమయుగం ముగిసింది. వాతావరణం కొద్దిగా తాపాన్ని పెంచుకుంది, కొన్ని ప్రాంతాల్లో పర్యావరణం పంటలకు అనువుగా మారింది. జంతువులతో పాటు మనుషుల సంఖ్య కూడా పెరిగింది. వేట ద్వారా అందుకునే ఆహారం సరిపోక, మనుషులు ఆహారాన్ని ఉత్పత్తి చేయడం ప్రారంభించారు. మొదటగా మేసపొటేమియా, టర్కీ, సిరియా, ఈజిప్ట్ మాదిరి ప్రదేశాల్లో ఉన్న ఫర్టైల్ క్రెసెంట్ ప్రాంతంలో ఈ మార్పు చోటు చేసుకుంది. అక్కడ మనుషులు గోధుమలు, చిరుధాన్యాలు వంటి ధాన్యాలను పండించడం నేర్చుకున్నారు. జంతువులను స్వాధీనం చేసుకొని సాగు, రవాణా, పాల ఉత్పత్తుల కోసం ఉపయోగించడం మొదలుపెట్టారు. ఒకేచోట స్థిరంగా నివసించి పంటలు వేయాలన్న నిర్ణయం మానవ నాగరికతకు పునాది వేసింది. వ్యవసాయ విప్లవం ద్వారా గ్రామాలు, పట్టణాలు, చివరికి నగరాలు పుట్టాయి. అదియే సమాజ నిర్మాణానికి, వృత్తుల విభజనకు, వాణిజ్య అభివృద్ధికి, శిల్పకళలకు, భాషా, లిపి ఆవిష్కరణలకు కారణమైంది. ఆర్థిక వ్యవస్థలు ఏర్పడగా, పాలనా ప్రమాణాలు, రాజ్యాధిక వ్యూహాలు ఆవిర్భవించాయి. ఈ మార్పు లేకపోతే మానవ చరిత్రలో నాగరికత అనే పదమే ఉండేది కాదు. అయితే, ఈ పరిణామానికి మరొక వైపు కూడా ఉంది. వేటగాళ్ల స్వేచ్ఛా జీవితం నుంచి స్థిర జీవనానికి మారడం వల్ల శ్రమ పెరిగింది, వ్యాధులు విస్తరించాయి, సామాజిక అసమానతలు మొదలయ్యాయి. భూమిపై అధికారం కోసం, వనరులపై పోటీ ప్రారంభమవడంతో యుద్ధాల సంస్కృతి ఏర్పడింది. ఇంతకంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ మార్పు ఆ సమయానికే ఒకే సారి జరగలేదు. దాదాపు వెయ్యి సంవత్సరాల పాటు విడతలుగా ప్రపంచంలోని విభిన్న ప్రాంతాల్లో జరిగింది. మొత్తానికి, పదివేల సంవత్సరాల క్రితం జరిగిన ఈ మార్పు మానవ చరిత్రలో అత్యంత కీలక మలుపుగా నిలిచింది. ప్రకృతిపై ఆధారపడిన మనిషి, అప్పటి నుండి ప్రకృతిని నియంత్రించే శక్తిగా మారాడు. అదే మనకు నాగరికతలను, సాంస్కృతిక సంపదను ఇచ్చినప్పటికీ, ఈ మార్పు మనిషి భవిష్యత్తుకూ, భూమి సమతుల్యానికీ శాశ్వతమైన ప్రభావం చూపింది.






## క్రీస్తు పూర్వమే టర్కీలో అద్భుత నగరం



టర్కీ నైరుతి ప్రాంతంలోని ప్రాచీన నగరం సాగలస్సోస్‌కు ఎంతో ఘన చరిత్ర ఉంది. క్రీస్తు పూర్వమే ఇది అత్యంత అభివృద్ధి చెందిన అద్భుత నగరంగా విరాజిల్లిందని అంటారు, పురాతన కాలంలో సెల్గెస్సోస్, సాగల్లెస్సోస్ అనే పేర్లతో కూడా ఈ నగరం ప్రసిద్ధి చెందింది. ఇది నేటి అంటాల్యా (ప్రాచీన అట్టాలేయా) నగరానికి సుమారు 100 కిలోమీటర్ల ఉత్తరాన, బుర్దూర్, ఇస్పార్తా నగరాలకు సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న అత్యంత ప్రాముఖ్యమైన పురావస్తు ప్రదేశం. క్రీ.పూ. 333లో అలెగ్జాండర్ పర్షియా దండయాత్రలో భాగంగా ఈ ప్రాంతాన్ని జయించినప్పుడు, సాగలస్సోస్ పిసిడియా ప్రాంతంలోని అత్యంత ధనిక, అభివృద్ధి చెందిన నగరాల్లో ఒకటిగా నిలిచింది. అప్పటికే ఇక్కడ కొన్ని వేల మంది నివసించేవారు. అలెగ్జాండర్ మరణం తర్వాత ఈ ప్రాంతం అంటిగొనస్ I మోనోథాల్మస్ ఆధీనంలోకి వెళ్లింది. అనంతరం లిసిమాచస్, సిరియాలోని సెల్యూసిడ్ రాజవంశం, తరువాత పెర్గమన్‌కు చెందిన అట్టాలిడ్ రాజుల పాలనలోకి చేరింది. ఈ కాలంలో స్థానిక ప్రజలు గ్రీకు సంస్కృతి, భాష, కళలను వేగంగా స్వీకరించినట్లు పురావస్తు ఆధారాలు తెలియజేస్తున్నాయి. తర్వాత రోమన్ సామ్రాజ్యం అట్టాలిడ్ రాజ్యాన్ని తనలో విలీనం చేసుకోవడంతో పిసిడియా ప్రాంతం ఆసియా ప్రావిన్స్‌లో భాగమైంది. క్రీ.పూ. 39లో ఈ ప్రాంతాన్ని 'అమింటాస్ ఆఫ్ గలాషియా'కు గలాటియన్ రాజు అప్పగించాడు. అయితే క్రీ.పూ. 25లో ఆయన మరణించడంతో రోమ్ ఈ ప్రాంతాన్ని నేరుగా తన ఆధీనంలోకి తీసుకుని గలాటియా ప్రావిన్స్‌లో చేర్చింది. రోమన్ పాలనలో సాగలస్సోస్ మరింత అభివృద్ధి చెందిది. ముఖ్యంగా హార్డియన్ ఈ నగరానికి విశేష ప్రాధాన్యం ఇచ్చాడు. ఆయన దీనిని పిసిడియా ప్రాంతంలోని మొదటి నగరం (ఫస్ట్ సిటీ ఆఫ్‌ది ప్రావిన్స్)గా ప్రకటించాడు. అలాగే రోమన్ చక్రవర్తుల ఆరాధనకు ప్రధాన కేంద్రంగా గుర్తింపు తెచ్చాడు. ఈ కాలంలో అద్భుతమైన దేవాలయాలు, స్నానగృహాలు, భారీ నాటకశాల, అగోరా, విశాలమైన ఫౌంటెన్లు నిర్మించారు. నేటికీ వాటి అవశేషాలు రోమన్ నగర నిర్మాణ కళకు గొప్ప సాక్ష్యాలుగా నిలిచి ఉన్నాయి.

# కార్మిక హక్కులు హరిస్తున్న మోదీ ప్రభుత్వం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
ఎఐటియుసి జిల్లా 3వ మహాసభ సందర్భంగా భువనగిరిలో ప్రదర్శన




**ప్రజాపక్షం/భువనగిరి :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలు, హక్కులు హరిస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. తమ హక్కులు, చట్టాల రక్షణకు పోరాటాలు చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. భువనగిరి సుమంగళి ఫంక్షన్ హాల్‌లో జరిగిన బుధవారం జరిగిన ఎఐటియుసి యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశంలో ఏర్పడిన మొట్టమొదటి సంఘం ఎఐటియుసి అన్నారు. కేంద్రప్రభుత్వం ఆలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టేందుకు కార్మిక లోకం పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర ధరలకు అనుగుణంగా సంఘటిత, అసంఘటిత కార్మికుల వేతనాలు పెంచాలని నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ అనేక ఉద్యమాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులు, కార్మిక చట్టాలను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల్ని బానిసలుగా మారుస్తుందని ఆరోపించారు. పని గంటల పెంచి కార్మికుల శ్రమ దోపిడికి పాల్పడే విధంగా పెట్టుబడిదారులకు అనుకూలం గా కేంద్రం చట్టాలు మారుస్తుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాల అవుతున్న నేటికీ రాష్ట్రంలో అవుట్‌సోర్సింగ్, కాంటాక్ట్ కార్మికుల జీవితాలు మారలేదని, కనీస వేతనం లేక, పిఎఫ్, ఇఎస్ఐ అమలు నోచుకోక శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. ఉపాధి హామీ పథకం నీరుగార్చే విధంగా కేంద్రప్రభుత్వం కుట్రలు చేసిందని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని యూసుఫ్ కోరారు. మహాసభలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎండి.ఇమ్రాన్, బండారపు వెంకటేశ్, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, బోలగాని సత్యనారాయణ, నాయకులు కళ్ళెం కృష్ణ, చెక్క వెంకటేశ్, జి.వెంకటేష్, పిల్లి శంకర్, బి.మల్లేష్, ఇంజా హేమలత, ఎస్.సవిత, సామల శోభన్‌బాబు, సామల భాస్కర్, ముంతాజ్ బేగం, చిలివేరు అంజయ్య, పల్లె శ్రీనివాస్ పుట్ట రమేష్, బి.నరసింహ, సిహెచ్.మల్లేష్, లక్మి, నిర్మల, జగన్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా పట్టణంలో భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించారు.




# కేంద్రం విధానాలపై ఉద్యమం




సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ పిలుపు

**ప్రజాపక్షం/మంచిర్యాల :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉద్యమించాలని, సెప్టెంబర్ 1న నిర్వహించే 'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు దాగం మల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్‌ల రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల, పంటలకు గిట్టుబాటు ధరల కోసం ఐక్యంగా పోరాడాలని కోరారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు జిల్లావ్యాప్తంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముఖ్దూం మొహియుద్దీన్ నడిపిన 'భూమి, భుక్తి, విముక్తి' పోరాట స్ఫూర్తితో నేటి ప్రజాసమస్యలపై ఉద్యమించాలని పార్టీ శ్రేణులకు కలవేణ శంకర్ పిలుపునిచ్చారు. వారోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 11న మంచిర్యాల, 13న మందమర్రి, 16న బెల్లంపల్లిలో బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మిట్టపల్లి వెంకటస్వామి, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, కారుకూరి నగేష్, భీమనాథుని సుదర్శన్, మిట్టపల్లి శ్రీనివాస్, లింగం రవి, కలీందర్ అలీఖాన్, రేగుంట చంద్రకళ, కొండు బానేష్, బొంతల లక్ష్మి నారాయణ, దేవి పోచన్న, అడేపు రాజమొగిలి, కామెర దుర్గరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు

ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్



**ప్రజాపక్షం/వరంగల్:** కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో జరిగే ఎఐటియుసి రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వరంగల్ పట్టణంలోని శివనగర్ తమ్మెర భవన్‌లో ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర మహాసభల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు ఆలంబించడంతో మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమదోపిడీ పెరుగుతుందని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగై మోదీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పనస ప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గుంపల్లి మునీశ్వర్, దామెర కృష్ణ, గుండె బద్రి, తాళ్లపల్లి జాన్ పాల్, ఉప్పుల రవి, ఎండి యాకుబ్, బొట్ల శ్రీనివాస్, సంద్ర కుమార్, జన్ను రాజు, పరికిరాల రమేష్, అక్కపెల్లి రమేష్, దస్రు, రాజేందర్, చందు, మస్కసుదీర్, చందు, సాయిలు తదితరులు పాల్గొన్నారు

# సిఎం వద్ద విద్యాశాఖ ఉన్నా ఉపయోగం ఏదీ?

విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తాం
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సిఎం రేవంత్‌రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న ఉపయోగం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి హెచ్చరించారు. బుధవారం గోదావరిఖని పట్టణంలోని భాస్కర్‌రావు భవన్‌లో ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షుడు సాయి ఆజాద్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా కసిరెడ్డి మణికంఠ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల తల్లితండ్రులు సర్టిఫికెట్ల కోసం కళాశాలకు ఫీజులు కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఓట్లతో ప్రభుత్వానికి బుద్ధి చెప్తారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, బడ్జెట్‌లో 15 శాతం నిధులు ఇవ్వాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా వాటిని అమలు చేసి విద్యార్థుల పట్ల తమ చిత్తశుద్ధిని రేవంత్‌రెడ్డి నిరూపించుకోవాలన్నారు. సిఎం తన వద్ద విద్యాశాఖ పెట్టుకొని విద్యా శాఖకు న్యాయం చేయకుంటే, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి నియమించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యార్థినులకు ఇస్తామన్న స్కూటీలు, విద్యార్థులకు ఇస్తామన్న ల్యాప్‌టాప్‌లను, రూ.5లక్షల విద్య భరోసా కార్డును, పెండింగ్ ఫీజు బకాయిలనుఅధికారంలోకి వచ్చి 34 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఎందుకు ఇవ్వలేదని, సిఎం తన వద్ద విద్యాశాఖను పెట్టుకొని, విద్యార్థుల హామీల అమలు చేయకుండా విద్యార్థులకు ఓట్లు లేవని చిన్నచూపు చూస్తున్నాడన్నారు. సిఎం వద్దే విద్యాశాఖ ఉన్న విద్యార్థులకు ఉపయోగం లేకుండాపోయిందన్నారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి నియామకం ద్వారానే విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు సమస్యల కోసం ప్రతి రోజు రోడ్డు ఎక్కుతున్నారన్నారు. సిఎం వద్ద విద్యాశాఖ ఉంది కమీషన్ల కోసమా అని ప్రశ్నించారు. సెప్టెంబర్ 7నుండి జరుగు అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించాలని, లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ అధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడిస్తామని కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, విద్యార్థి నాయకులు మామిడిపల్లి హేమంత్, ఎల్కపల్లి సురేష్, లక్ష్మీ ప్రసన్న, తడిగొప్పుల అనూప్ సాయి, అభిషేక్, ఆరే జశ్వంత్, గొడిసెల ప్రణీత్, రాహుల్, సూర్య ప్రకాష్, సాయి, మహి, సాయి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలపై పోరాటాలు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సెప్టెంబర్ 6 నుంచి 8తేదీలలో కరీంనగర్ పట్టణంలో ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలు జరుగుతున్నాయన్నారు. మహాసభల్లో ఎఐటియుసిగా మూడు సంవత్సరాల కాలంలో చేసిన కార్యక్రమాలను సమీక్షించుకుని ప్రభుత్వాలు అవలంభిస్తున్నా కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రధానంగా నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ల రద్దు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాల్సిన 2వ పీఆర్‌సీలతో పాటు ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాన్ని రూపొందించుకోవటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 6న కరీంనగర్ పట్టణంలో భారీ ప్రదర్శన బహిరంగసభ నిర్వహించటం జరుగుతుందని, బహిరంగ సభకు సిపిఐ పార్టీ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు, ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజిత్ కౌర్, జాతీయ నాయకులు చాడ వెంకట్‌రెడ్డిలతో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని, ఈ బహిరంగ సభలో కార్మికులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు హన్మాండ్లు, చక్రపాణి, కవిత, స్వరూప, దేవేందర్, గోవర్ధన్, ఫిరోజ్ అలీ, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో వరికి లాభదాయక ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలను అనుసంధానిస్తూ ఆయిల్‌పామ్ సాగు, ప్రాసెసింగ్ క్లస్టర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖేతన్ మోదీ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సమావేశమయ్యారు. కోదాడ–హుజూర్‌నగర్ ప్రాంతాన్ని ఆయిల్‌పామ్ ప్లాంటేషన్, ప్రాసెసింగ్ క్లస్టర్‌కు ప్రారంభ కేంద్రంగా పరిశీలించాలని ఉత్తమ్ సూచించారు.రైతులను వరి నుంచి ఇతర పంటల వైపు మళ్లించాలంటే మెరుగైన ఆదాయం, మార్కెట్ భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పంట చేతికొచ్చిన వెంటనే కొనుగోలు, ప్రాసెసింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా 'ఫార్మ్ టు ఇండస్ట్రీ' వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు.ప్రస్తుతం తెలంగాణలో 3.12 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుండగా, 65,691 మంది రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు ఆయిల్‌పామ్ విస్తరణకు రూ. 515.84 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. సూర్యాపేట జిల్లాలో సుమారు 5,753 ఎకరాల్లో సాగు జరుగుతోందని, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో అనిశ్చితి నేపథ్యంలో నీటి వినియోగ సామర్థ్యం కలిగిన లాభదాయక పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రులు తెలిపారు. ఆయిల్‌పామ్ విస్తరణతో రైతులకు స్థిరమైన ఆదాయం లభించడంతో పాటు సాగునీటి వినియోగం, వరి కొనుగోలు–రవాణా–నిల్వపై ప్రభుత్వ భారాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. త్వరలో రిలయన్స్ ప్రతినిధులు కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## కాసు శేషమ్మకు సిఎం రేవంత్‌రెడ్డి నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి మాతృమూర్తి కాసు శేషమ్మకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నివాళి అర్పించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జెఆర్‌సి కన్వెన్షన్‌లో బుధవారం కాసు శేషమ్మ దశదినకర్మ కార్యక్రమానికి సిఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా శేషమ్మ చిత్రపటానికి సిఎం పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. శేషమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కె.జైవీర్ రెడ్డి, రాజేష్‌రెడ్డి, నాగరాజు, మాజీ ఎంపి ఎం.అంజన్‌కుమార్ యాదవ్, టిపిసిసి ఉపాధ్యక్షులు కోటింరెడ్డి వినయ్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని కాసు శేషమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## భూ భారతి అక్రమాలపై రాహుల్‌కు లేఖ

సెప్టెంబర్ 5, 6న నిరసన దీక్షలు: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూ భారతి 22ఎ నిషేధిత భూముల జాబితా పేరుతో భారీ అక్రమాలు జరుగుతున్నాయని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. భూముల బదిలీలు, 22ఎ జాబితాలో మార్పులపై సిఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాసినట్లు తెలిపారు. 2014కు ముందు, తర్వాత 22ఎ భూముల జాబితాపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆరోపణలపై సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. రెవెన్యూ మంత్రిని కేబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. భూ భారతి 22ఎ సమస్యపై సెప్టెంబర్ 5, 6 తేదీల్లో ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, బాధితులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన దీక్షలు చేపడతామని మహేశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ప్రభు త్వం స్పందించకపోతే తదుపరి అసెంబ్లీ ముట్టడి చేపడతామని హెచ్చరించారు.

## ఇంటింటికీ హైదరాబాద్ విమోచన చరిత్ర

డాక్టర్ బూర నర్సయ్య గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ విమోచన చరిత్రను ప్రతి గడపకూ చేరేలా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తామని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ తెలిపారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో 'స్టాచ్యూ ఆఫ్ లిబరేషన్‌తెలంగాణ', అంతర్జాతీయ స్థాయి విమోచన మ్యూజియం ఏర్పాటు చేయాలని, చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు. ప్రతి జిల్లాలో స్మృతి కేంద్రాలు, చారిత్రక ప్రాంతాలను కలుపుతూ విమోచన పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 27న వీరభైరాన్పల్లి, సెప్టెంబర్ 2న పరకాల అమరధామంలో సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17న పరేడ్ గ్రౌండ్స్లో కేంద్ర మంత్రుల ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ విమోచన చరిత్ర పునరుజ్జీవన కార్యక్రమంలో పార్టీలు, మతాలకు అతీతంగా ప్రజలంతా భాగస్వాములు కావాలని బూర నర్సయ్య గౌడ్ పిలుపునిచ్చారు.

## డిసెంబర్‌లో తెలంగాణలో.. 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'

రూ.22 కోట్లు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
నేడు దేశవ్యాప్తంగా 'ఖేల్ కీ బాత్, పిఎం కె సాథ్' పేరుతో ఖేలో ఇండియా సంవాద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా.. దేశంలోని యువ క్రీడాశక్తిని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా.. 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్', 'ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్', 'ఖేలో ఇండియా పారా గేమ్స్', 'ఖేలో ఇండియా వింటర్ గేమ్స్', 'ఖేలో ఇండియా బీచ్ గేమ్స్', 'ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్', 'ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్' వంటి క్రీడాపోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభ ను, తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను ఏర్పాటు చేసింది. డిసెంబర్‌లో తెలంగాణలో జరపతల పెట్టిన ఖేలో ఇండియా యూ త్ గేమ్స్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్లు విడుదల చేసింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికగా ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ ఎడిషన్‌లో మొత్తం 25 క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రమైన తెలంగాణ.. ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించవచ్చు. దీంతో పాటుగా మరో కొత్త క్రీడ ను కూడా ఈ ఈవెంట్‌లో ఆడించనున్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 6వేల మంది క్రీడాకారు లు పాల్గొంటారని అంచనా. ఈ 'ఖేలో ఇండి యా యూత్ గేమ్స్' నిర్వహణకోసం.. కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్లను విడుదల చేసింది. ఈ క్రీడాపోటీలను రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఎఐ), నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్), స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్ఐ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఖేలో ఇండియా పథకం అడ్ హాక్ కమిటీ, స్టీరింగ్ కమిటీల సంయుక్త నిర్వహణలో.. నిర్వహించనున్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణకు కేటాయించడం పట్ల.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఖేలో ఇండియా' స్కీమ్‌లో భాగంగా.. తెలంగాణలో కూడా దాదాపు రూ.30 కోట్లతో క్రీడా సదుపాయాలను కల్పన జరిగిందని, అందులో రూ.11.5 కోట్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాం పస్లో సింథటిక్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్ట్, మహిళలకోసం ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలను కల్పించారని, మరో రూ.18.5 కోట్లతో రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో క్రీడా సదుపాయాలను కల్పించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో 33 ఖేలో ఇండియా సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేషనల్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఫండ్ కింద మరో రూ.8.5 కోట్లను తెలంగాణలో క్రీడాభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. మరోవైపు ఈ నెల 29న నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని.. గురువారం దేశవ్యాప్తంగా 'ఖేల్ కీ బాత్, పిఎం కె సాథ్' పేరుతో ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి.. 2 కాలేజీల చొప్పున 1,500 లకు పైగా కాలేజీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## సెల్‌ఫోన్ చోరీలతో బ్యాంకు ఖాతాలు ఖాళీ

సరికొత్త 'హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్' పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
: సిపి సజ్జనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సెల్‌ఫోన్ చోరీలకు సైబర్ నేరాలను జోడించి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న ముఠాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సిపి విసి సజ్జనర్ సూచించారు. నగరంలో 'హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్'కు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని ఆయన తెలిపారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో వృద్ధులు, అమాయకులను ఈ ముఠాలు లక్ష్యంగా చేసుకుంటున్నాయని సిపి తెలిపారు. ముందుగా బాధితులు ఫోన్ పిన్, పాస్‌వర్డ్ ఎలా నమోదు చేస్తున్నారో గమనించి, అనంతరం ఫోన్లను చోరీ చేస్తున్నారని చెప్పారు. ఆ తర్వాత కండక్టర్, డ్రైవర్ లేదా ఇతరుల పేర్లు చెప్పి బాధితుల నుంచే స్క్రీన్ లాక్ వివరాలను రాబడుతున్నారని వివరించారు. ఫోన్‌ను అన్‌లాక్ చేసిన తర్వాత గ్యాలరీ, మెసేజ్‌లు, వాట్సాప్, నోట్స్ తదితరాల్లో ఉన్న బ్యాంకింగ్, వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారని సజ్జనర్ తెలిపారు. చోరీ చేసిన ఫోన్‌లోని సిమ్ కార్డు తమ వద్ద ఉండటంతో ఓటిపిలను ఉపయోగించి యుపిఐ, నెట్ బ్యాంకింగ్ సేవల ద్వారా నగదును బదిలీ చేస్తున్నారని చెప్పారు. అనంతరం గేమింగ్ ప్లాట్‌ఫారాలు, డిజిటల్ వాలెట్లు, మ్యూల్ ఖాతాల ద్వారా డబ్బును మళ్లించి చివరకు నగదుగా మార్చుకుంటున్నారని వివరించారు. ఇలాంటి ముఠాల్లో బాధితులను గుర్తించడం, ఫోన్లు చోరీ చేయడం, పాస్‌వర్డ్‌ను రాబట్టడం, నగదు బదిలీ చేయడం వంటి పనులకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని సిపి తెలిపారు. ఫోన్ పోయిన వెంటనే అప్రమత్తం కావాలని, వెంటనే సిమ్ కార్డును బ్లాక్ చేయడంతోపాటు బ్యాంకింగ్, యుపిఐ సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించారు. అలాగే సిఇఐఆర్ ద్వారా ఫోన్ ఐఎంఇఐ నంబర్‌ను బ్లాక్ చేయాలని చెప్పారు. బ్యాంకు ఖాతా నుంచి నగదు పోయినట్లు గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి, సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సిపి సజ్జనర్ ప్రజలకు సూచించారు.

## ఫీజు బకాయిలపై... రాంచందర్‌రావు దీక్ష అర్ధరహితం

కాంగ్రెస్ నేత ఈరవత్రి అనిల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు దీక్ష చేయడం ఎందుకో అర్థం కావడం లేదని కాంగ్రెస్ నేత ఈరవత్రి అనిల్ విమర్శించారు. బిజెపి నేతలకు ఫీజు బకాయిల లెక్కలు, విద్యార్థుల సంఖ్య కూడా సరిగ్గా తెలియదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఇప్పటికే ఫీజు బకాయిలకు సంబంధించిన నిధులను బ్యాంకుల్లో జమ చేసిన తర్వాత దీక్ష చేయడం ఏమిటని ప్రశ్నించారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫీజు బకాయిలు ఉంటే అప్పట్లో బిజెపి నాయకులు ఎందుకు దీక్షలు చేయలేదని అనిల్ నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలను చెల్లించే ప్రక్రియ చేపట్టిన తర్వాత బిజెపి నేతలు దీక్షకు దిగడం తెరిచిన తలుపులకు తాళం పగలగొట్టినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు.ఆంధ్రప్రదేశ్‌లో సుమారు రూ.7,800 కోట్ల ఫీజు బకాయిలు ఉన్నాయని, అక్కడ బిజెపికి రాజకీయంగా సంబంధాలు, కేంద్రంలో అధికార బలం ఉన్నప్పటికీ విద్యార్థుల సమస్యలపై ఎందుకు పోరాటం చేయడం లేదని ప్రశ్నించారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కనీసం ఒక్క రాష్ట్రంలోనైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సక్రమంగా అమలవుతుందా అని నిలదీశారు. మధ్యప్రదేశ్‌లో విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల బకాయిలు ఉన్నాయని, అక్కడికి వెళ్లి దీక్ష చేయాలని సూచించారు.రాంచందర్‌రావు వయసును ప్రస్తావిస్తూ 48 గంటల దీక్ష చేయడం ఎందుకని, బిజెపిలోని యువ నాయకులతో దీక్ష చేయించాలని అనిల్ వ్యాఖ్యానించారు. బిజెపి పాలనలో దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థ పరిస్థితి దారుణంగా ఉందని విమర్శించారు. నీట్ పరీక్షల వ్యవహారాన్ని దేశం మొత్తం చూసిందని, విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో పలు సందర్భాల్లో పేపర్ లీకేజీలు జరిగాయని, ఒక్క ఏడాదిలో వేలాది పాఠశాలలు మూతపడిన పరిస్థితి ఉందని అన్నారు. మధ్యప్రదేశ్‌లోనూ పాఠశాలలు మూతపడుతున్నాయని పేర్కొన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టకుండా తెలంగాణలో రాజకీయ దీక్షలు చేయడం సరికాదని ఈరవత్రి అనిల్ విమర్శించారు.

## దక్షిణ కొరియా వర్సిటీలో తెలంగాణ బిడ్డ నిషితకు సీటు

ప్రతిష్టాత్మక 'కొయికా' ఫుల్ స్కాలర్‌షిప్‌తో ఎంఎస్‌సి(అగ్రికల్చర్)లో అడ్మిషన్
ఆరు భాషల్లో ప్రావీణ్యం సాధించిన పెద్దపల్లి అమ్మాయి..
పోస్కో స్కాలర్‌షిప్‌ల విజేత
నిషిత ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిదాయకం: ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అభినందనలు



**హైదరాబాద్ :** ఎలాంటి బలమైన నేపథ్యం లేకున్నా, పట్టుదల ఉంటే అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చని తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లాకు చెందిన వెనగంటి నిషిత నిరూపించారు. దక్షిణ కొరియాలోని ప్రఖ్యాత క్యుంగ్బుక్ జాతీయ విశ్వవిద్యాలయం (కెఎన్‌యు)లో ప్రతిష్టాత్మక 'కొయికా' (KOICA) పూర్తి స్కాలర్‌షిప్‌తో ఆమె ఎంఎస్‌సి (అగ్రికల్చర్) కోర్సులో అడ్మిషన్ సాధించారు. ఈ ఘనత సాధించిన నిషితను మాజీ ఐపిఎస్ అధికారి, బిఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రశంసించారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం రూప్ నారాయణపేట గ్రామానికి చెందిన నిషిత, ఒంటరి తల్లి పెంపకంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల నడుమ చిన్న అద్దె ఇంట్లో ఉంటూనే ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యాభ్యాసం కొనసాగించారు. 15 ఏళ్లకే ఇంటర్మీడియట్ పూర్తి చేసి, బిసి గురుకులాలలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. అనంతరం 19 ఏళ్ల వయసులోనే ఢిల్లీలోని ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు) నుంచి కొరియన్ లాంగ్వేజ్ విభాగంలో డిగ్రీ పూర్తి చేశారు. చదువులో విశేష ప్రతిభ కనబరుస్తూ రెండుసార్లు ప్రఖ్యాత పోస్కో స్కాలర్‌షిప్‌ను సైతం సొంతం చేసుకున్నారు. నిషితకు ఆరు భాషల్లో ప్రావీణ్యం ఉండడం విశేషం.

### రైతులకు అండగా నిలవడమే లక్ష్యం..

దక్షిణ కొరియాలో ఎంఎస్‌సి (అగ్రికల్చర్) పూర్తి చేసి, ఆధునిక స్మార్ట్ వ్యవసాయ పద్ధతులను దేశంలో ప్రవేశపెట్టి అన్నదాతలకు అండగా నిలవడమే తన లక్ష్యమని నిషిత పేర్కొన్నారు. ఎన్నో సవాళ్లు, ఆటంకాలను ఎదుర్కొని గ్లోబల్ స్థాయి లో రాణిస్తున్న నిషిత అంకితభావం, పట్టుదల నేటి యువతకు నిజమైన స్ఫూర్తిదాయకమని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కొనియాడారు. నిషితను ఆమె తల్లి, జర్నలిస్టు వేముల ప్రవళికను ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. నిషితను శాలువాతో సత్కరించారు. నిషిత భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

## 'సత్యాన్వేషి' నాటకం మరో చారిత్రక ప్రయోగం!

54 మంది కళాకారులతో 2.40 నిమిషాల ప్రదర్శన



**ప్రజాపక్షం / రవీంద్రభారతి :** సిద్ధార్థుడు గౌతమ బుద్ధుడిగా మారడానికి ముందు అతడి జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా 'సత్యాన్వేషి' నాటకాన్ని బుధవారం సాయంత్రం హైదరాబాద్ రవీంద్రభారతిలో అత్యంత వైభవంగా ప్రదర్శించారు. చిలువేరు రఘురామ్ రచించిన ఈ 'సత్యాన్వేషి' తొలి నాటకం కళావిపంచి బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో డా.వెంకట్ గోవాడ దర్శకత్వంలో 2 గంటల 40 నిమిషాలు ప్రదర్శితమైంది. కొత్త కథాంశంతో నాటకాభిమానులకు అందించాలనే సంకల్పంతో 54 మంది కళాకారులతో, 84 పాత్రలతో సత్యాన్వేషి నాటకం కొనసాగింది. కపిలవస్తు రాజ్యంలోని సిద్ధార్థుడి బాల్యం నుంచి మొదలై, సమాజంలోని ఘర్షణలు, బాధలు, మరణాలు చూసి చలించిపోవడం, భార్య యశోధర, కుమారుడు రాహుల్ ను ప్రాపంచిక బంధాలను వీడి మానవ జాతి దుఃఖాలకు కారణాలు వెతుక్కుంటూ సత్యం కోసం అన్వేషిస్తూ సత్యాన్వేషి నాటక ప్రయాణం సాగింది. చేశారు. గత మూడు దశాబ్దాలుగా రంగస్థలంలో అనేక ప్రయోగాలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందిన వెంకట్ గోవాడ దర్శకత్వంలో ప్రదర్శించిన సత్యాన్వేషి నాటకం కొత్తదనంతో వీక్షకులను ఆకట్టుకొన్నది. ఆలోచింపజేసింది. అంతర్జాతీయ నాటకాలను తలదన్నేలా సత్యాన్వేషి నాటకం రూపుదిద్దుకున్నదని, ఇదొక చారిత్రక ప్రయోగమని పలువురు అభినందించారు. నాటక వీక్షణకు ఉచిత ప్రవేశంతో వందలాది మంది నాటకప్రియులు పాల్గొని, దర్శక, నిర్మాతలను ప్రశంసలతో ముంచెత్తారు.

## వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వార్తలు ప్రసారం చేస్తే సహించేది లేదు

ఆంధ్రా మీడియాకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాస్ వార్నింగ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తనపై, కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై కొన్ని ఆంధ్రా మీడియా సంస్థలు దుష్ప్రచారం చేస్తున్నాయని మీడియా ముసుగులో తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వార్తలు ప్రసారం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ''కొంచెం ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉంటే మంచిది. లేకపోతే మర్యాద దక్కదు'' అని ఆయన హెచ్చరించారు. ప్రజాభవన్‌లో బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో రాజగోపాల్‌రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో రాజగోపాల్‌రెడ్డి ఓ ప్రముఖ తెలుగు మీడియా సంస్థపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ సంస్థ ఎవరికి అనుకూలంగా పనిచేస్తుందో అందరికీ తెలుసు అని వ్యాఖ్యానించారు. తనపై, తమ పార్టీ నేతలపై ఉద్దేశపూర్వకంగా వార్తలు వండివార్చడం మానుకోవాలని సూచించారు. ''మీడియా, జర్నలిస్టులంటే నాకు ఎంతో గౌరవం. అన్ని మీడియా సంస్థలను నేను తప్పు పట్టడం లేదు. కొందరు వ్యక్తులకు మాత్రమే పనిచేస్తూ, వారికి కొమ్ముకాస్తున్న మీడియా సంస్థలకు మాత్రమే ఈ హెచ్చరిక'' అని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర సాధన కోసం పోరాడిన తమ కుటుంబానికి, తమలాంటి నేతలకు రాజకీయ చరిత్ర ఉందని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన చరిత్ర తమదేనని అన్నారు. అలాంటి తమను కించపరిచేలా, వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వార్తలు ప్రచురించడం సరికాదన్నారు.తమకు కూడా మీడియా సంస్థలు ఏర్పాటు చేసే సత్తా, సామర్థ్యం ఉందని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ''మాకు 100 ఛానళ్లు పెట్టే దమ్ము, ధైర్యం ఉంది. ఆంధ్రా మీడియా ఛానళ్ల సర్టిఫికెట్ మాకు అవసరం లేదు'' అని వ్యాఖ్యానించారు. తన ప్రతాపాన్ని చూపించే పరిస్థితి తీసుకురావద్దని, అలా చేస్తే సదరు మీడియా సంస్థ తీవ్ర పరిణామాల ను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ''నా ప్రతాపమే చూపిస్తే ఆ ఛానల్, పేపరే ఉండ దు'' అంటూ మీడియా సంస్థ అధిపతిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత వ్యవహారాలను వక్రీకరించి వార్తలు సృష్టించడం, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం మానుకోవాలని ఆయన సూ చించారు. తన వ్యాఖ్యలు అన్ని మీడియా సంస్థలకు వర్తించవని, ఉద్దేశపూర్వకంగా కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తున్న సంస్థలను మాత్రమే ఉద్దేశించి మాట్లాడుతున్నానని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

## బిసిసిఐలో తెలంగాణకు సభ్యత్వం కల్పించండి : టిసిఎ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత క్రికెట్ వ్యవస్థలో తెలంగాణకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్‌తో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) మరోసారి గట్టి ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 18న జరగనున్న బిసిసిఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఎజిఎం)లో తమ అసోసియేట్ సభ్యత్వ అభ్యర్థనను చర్చకు తీసుకుని న్యాయబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని బిసిసిఐని టిసిఎ కోరింది. అండమాన్ అండ్ నికోబార్ దీవులు వంటి కొత్త క్రికెట్ ప్రాంతాలకు దేశీయ క్రికెట్ వ్యవస్థలో అవకాశాలు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు తెలంగాణకు మాత్రం అదే అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని టిసిఎ ప్రధాన కార్యదర్శి ధారం గురువా రెడ్డి ప్రశ్నించారు. కొత్త ప్రాంతాలకు అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా బిసిసిఐ ముందుకు సాగుతున్నట్లయితే తెలంగాణ జిల్లాలకూ సమాన అవకాశాలు కల్పించాల్సిందేనని అన్నారు. హైదరాబాద్ వెలుపల ఉన్న తెలంగాణ జిల్లాలను క్రికెట్ పరిపాలనా వ్యవస్థలో కొనసాగుతున్న ఒంటరితనం నుంచి బయటకు తీసుకురావడానికి టీసీఏ ఎన్నో ఏళ్లుగా పోరాడుతోందని తెలిపారు. ఈ అంశంపై ఐదేళ్లుగా సుప్రీంకోర్టు, బాంబే హైకోర్టు వరకు న్యాయపోరాటం సాగిందని, ఇక సయోధ్య పేరుతో ఈ సమస్యను అనంతకాలం నాన్చడం సరికాదని స్పష్టం చేశారు. ఒకే రాష్ట్రంలో ఒకటి కంటే ఎక్కువ క్రికెట్ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్న ఉదాహరణలు ఉన్నాయని టిసిఎ గుర్తుచేసింది. గుజరాత్‌లో బరోడా, గుజరాత్, సౌరాష్ట్ర.. మహారాష్ట్రలో మహారాష్ట్ర, ముంబయి, విదర్భ క్రికెట్ సంఘాలు కొనసాగుతున్నాయని పేర్కొంది. ఇలాంటి అవకాశం ఉన్నప్పుడు తెలంగాణ జిల్లాలను మాత్రమే ప్రధాన దేశీయ క్రికెట్ వ్యవస్థకు దూరంగా ఉంచడం అన్యాయమని టిసిఎ వాదించింది. బిసిసిఐ ఈశాన్య రాష్ట్రాలను దేశీయ క్రికెట్‌లోకి విజయవంతంగా తీసుకురావడంతో పాటు నేపాల్, ఆఫ్ఘనిస్తాన్ వంటి క్రికెట్‌లో ఎదుగుతున్న దేశాలకు మద్దతు అందిస్తోందని టిసిఎ పేర్కొంది. క్రికెట్ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్న సమయంలో పరిపాలనా సరిహద్దులు స్థానిక ప్రతిభకు అడ్డంకులుగా మారకూడదని తెలిపింది.2020లో సుప్రీంకోర్టు సూచనలు, 2021లో బిసిసిఐ ఆదేశాలు, 2025లో హెచ్‌సిఎ ఏర్పాటు చేసిన కమిటీల అనంతరం కూడా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని టిసిఎ ఆరోపించింది. సయోధ్య పేరుతో వివాదాన్ని నిరవధికంగా కొనసాగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేసింది.

## కిలో ఉల్లిపాయలు రూ.35కే

ఢిల్లీలో నేటి నుంచి అందుబాటులోకి తేనున్న కేంద్రం

**న్యూఢిల్లీ:** దేశంలో మళ్లీ ఉల్లి సంక్షోభం మొదలైనట్టు కనిపిస్తున్నది. దేశవ్యాప్తంగా ఉల్లిపాయల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీలో గురువారం నుంచి కేంద్ర ప్రభుత్వం కిలో రూ.35 చొప్పున సబ్సిడీ ధరకు ఉల్లిపాయలను విక్రయించనుంది. కేంద్ర ఆహార మంత్రి ప్రహ్లాద్ జోషి ఈ విక్రయాలను ప్రారంభించనున్నారు. 2026 కోసం ఉత్పత్తి రాష్ట్రాల్లో నిల్వ చేసిన 1.21 లక్షల టన్నుల బఫర్ స్టాక్ నుంచి ఉల్లిపాయలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. నాఫెడ్, ఎన్‌సిసిఎఫ్, కేంద్రీయ భండార్ సంస్థలు విక్రయాలు చేపడతాయి. తొలుత ఢిల్లీలో ప్రారంభించి వారాంతానికి ఎన్‌సీఆర్ ప్రాంతానికి విస్తరిస్తామని ఎన్‌సిసిఎఫ్ తెలిపింది. తన వద్ద ఉన్న 62,000 టన్నుల నిల్వ నుంచి మహారాష్ట్రలోని నాసిక్ నుంచి 400 టన్నుల ఉల్లిపాయలను 'కందా ఎక్స్‌ప్రెస్' ద్వారా ఢిల్లీకి ఎన్‌సిసిఎఫ్ తరలించనుంది. కేంద్రీయ భండార్ 100 దుకాణాల్లో విక్రయించడంతో పాటు మొబైల్ వ్యాన్ల ద్వారా కూడా సరఫరా చేయనుంది. గత నెలలో ఉల్లిపాయల ధరలు గణనీయంగా పెరిగాయి. ఆగస్టు 25న దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ధర కిలో రూ.44.72కు చేరింది. జులై 25న ఇది రూ.34.80గా ఉంది. ఏడాది క్రితం రూ.28.67గా ఉన్న ధరతో పోలిస్తే 56 శాతం పెరిగింది. బుధవారం ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతాల్లో కిలో ఉల్లిపాయ ధరలు వరుసగా రూ.55, రూ.48, రూ.60, రూ.60గా నమోదయ్యాయి. హోల్‌సేల్ ధర కూడా ఏడాది కాలంలో 63 శాతం పెరిగి కిలో రూ.36.73కు చేరింది. ఆగస్టుసెప్టెంబర్‌లో పండుగల డిమాండ్, వాతావరణ పరిస్థితులు, సరఫరా వ్యవస్థలో మార్పుల వల్ల సాధారణంగా ధరలు పెరుగుతాయని అధికారులు తెలిపారు.



## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నిరుపేద కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రధాన ధ్యేయంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామంలో, దామరచర్ల మండలం రాళ్లవాగు తండా గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్లను ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఆయన ఘనంగా ప్రారంభించారు. గృహప్రవేశ కార్యక్రమం అనంతరం నూతనంగా నిర్మించిన ఇళ్లలోని ప్రతీ గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారికి నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇన్నాళ్లకు సొంత ఇల్లు ఏర్పడిందనే ఆనందంలో ఉన్న లబ్ధిదారుల సంతోషాన్ని పంచుకుంటూ వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వివిధ గ్రామాల నాయకులు, మండల అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బౌద్ధ వారసత్వానికి ప్రతీక బుద్ధవనం



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక బౌద్ధ కేంద్రం బుద్ధవనాన్ని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బుధవారం సందర్శించారు.కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి నేతృత్వంలో సభ్యులు బండి అపర్ణ,గోగుల సరిత,కంచర్ల వందన గౌడ్, మర్రిపల్లి చందన,ప్రేమలత అగర్వాల్,వచన కుమార్ బుద్ధవనంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి అక్కడి విశేషాలను తెలుసుకున్నారు.కమిషన్ సభ్యులు ముందుగా నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించారు. అనంతరం బుద్ధవనంలోని బుద్ధచరితవనం, ధ్యానవనం, స్థూపవనాలను పరిశీలించారు. తరువాత మహాస్థూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులను వెలిగించారు.ఈ సందర్భంగా బుద్ధవనం కార్యనిర్వహణ అధికారి శాసన, ఎస్టేట్ అధికారి రవిచంద్ర కమిషన్ సభ్యులను బుద్ధవనం కండువాలతో సత్కరించి, బుద్ధవనం సమాచార కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ బుద్ధవనం ప్రశాంత వాతావరణం తమకు ఎంతో ఆహ్లాదాన్ని,మానసిక ప్రశాంతతను కలిగించిందని తెలిపారు. బౌద్ధ వారసత్వాన్ని ప్రతిబింబించేలా బుద్ధవనం రూపుదిద్దుకోవడం అభినందనీయమన్నారు.స్థానిక పర్యాటక మార్గదర్శి సత్యనారాయణ నాగార్జున సాగర్ ఆనకట్ట,నాగార్జున కొండ,బుద్ధవనానికి సంబంధించిన చారిత్రక, పర్యాటక విశేషాలను కమిషన్ సభ్యులకు వివరించారు.

## పేదల మొహంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) :** పేదల మోహంలో చిరునవ్వు చూడటమే ప్రజాప్రభుత్వ ధ్యేయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూర్(ఎస్) మండలంలోని కోటి నాయక్ తండలో గ్రామ ఉపసర్పంచ్ బానోత్ సుశీల పూల్‌సింగ్, బోడ గీత జగ్గు ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గౌరవప్రదమైన జీవనం అందుతోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇళ్ళు అందజేస్తూ సొంతింటి కలలను నిజం చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షులు ముస్కు రామచంద్రారెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, కోతి గోపాల్ రెడ్డి, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## అమరుల ఆశయాల బాటలో పయనిద్దాం

**ప్రజాపక్షం/డిండి:** అమరుల ఆశయాల బాటలో నేటి కమ్యూనిస్ట్ నాయకులు పయనించి వారి ఆశయ సాధనకై పునరంకింతమవుదామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం కమ్యూనిస్టు పార్టీ సినియర్ నాయకులు,మాజీ ఎంపిటిసి వడ్డెమాను నారయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన స్మారక స్థూపాన్ని నారయ్య కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరుల ఆశయాలను కొనసాగించడం కొరకు వారి పోరాట స్ఫూర్తిని అలవర్చుకొని ముందుకు సాగాలని అన్నారు. కామ్రేడ్ నారయ్య నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా కడవరకు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగి మరణించడం గర్వించదగ్గ విషయం అని ఆయన మరణం పార్టీకి, కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, మండల సహాయ కార్యదర్శులు శైలేష్, విజేందర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, లచ్చయ్య, సినియర్ నాయకులు రాంరెడ్డి, శాఖ కార్యదర్శి జంగయ్య, నాయకులు చక్రి, జయంత్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## బుల్లెట్ ట్రైన్‌పై పెదవివిప్పని

# 'ఉత్తమ్-సర్వోత్తమ్'లు!

బుల్లెట్ ట్రైన్ ఉద్యమానికి దూరం ఎందుకు?

ప్రజల మదిని తొలుస్తున్న ప్రశ్నలు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** హైదరాబాద్ నుండి వయా 65 జాతీయ రహదారి సూర్యాపేట మీదుగా నందిగామ, అమరావతి, చెన్నై వరకు కేంద్ర ప్రభుత్వం బుల్లెట్ ట్రైన్‌కు ప్రతిపాదించగా దీనిని శంషాబాద్ నుండి చింతపల్లి, హాలియా, వాడపల్లి, దామరచెర్ల, గుంటూరు మీదుగా అమరావతి, చెన్నై వరకు మార్పు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపడంపై జిల్లా ప్రజలు భగ్గుమంటున్నారు. దీని వెనుక కొంతమంది అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కుట్ర ఉందని మేధావులు ఆరోపిస్తూ ఉద్యమానికి తెర లేపారు. ఇది గత నెల రోజుల నుండి వివిధ రూపాలలో సాగుతుండగా దీనికి సిపిఐ, సిపిఎం, న్యూడెమోక్రసీ, బిఆర్ఎస్, బిజెపి, టిఆర్‌పి, టిజెఎస్, కాంగ్రెస్ పార్టీలోని కొంత మంది నాయకులు వీరి ఉద్యమానికి మద్ధతు తెలుపడంతో పాటు ఉద్యమంలో పాల్గొనడంతో మరింత ఊపునిచ్చినట్లు అయింది. దీనిలో భాగంగా సూర్యాపేట, కోదాడ నియోజక వర్గ కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బుల్లెట్ ట్రైన్ కోసం సాగుతున్న ఉద్యమంలో అన్ని వర్గాలు కలిసి వస్తున్నా అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు దీనిపై పల్లెత్తు మాట ఎత్తకపోవడం, ఉద్యమానికి మద్ధతు ఇవ్వకుండా కినుకు వహిస్తున్నారు. వీరి కినుకు వెనుక మతలబు ఏంటన్న దానిపై ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతుంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సాగుతున్న ఉద్యమానికి అధికార పార్టీకి చెందిన మాజీ మంత్రి, దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి దూరంగా ఉంటున్నారు. ఇదిలా ఉంటే కోదాడ నియోజక కేంద్రంలో సాగుతున్న ఉద్యమానికి స్థానిక శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా నుండి మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ శాసన సభ్యులు, రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డిలు కూడా దూరంగా ఉంటూ తమ అభిప్రాయాన్ని నేటికి ప్రకటించకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే ఈ ఉద్యమం మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన ఉద్యమకారులు ఛలో ఢిల్లీ కార్యక్రమం కూడా చేపట్టనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ తాజా మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాత్రం బుల్లెట్ ట్రైన్ ఉద్యమకారులను సిఎం రేవంత్ రెడ్డి వద్దకు తీసుకెళ్లి ప్రజల గొంతుకను వినిపిస్తామని ప్రకటించడం జరిగింది.

ప్రజల మదిని తొలుస్తున్న ప్రశ్నలు

బుల్లెట్ ట్రైన్ ఉద్యమానికి అధికార పార్టీకి చెందిన జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభా స్థానం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తమ్ పద్మావతి రెడ్డి, సూర్యాపేట నియోజక వర్గంలో పార్టీకి పెద్ద దిక్కుగా చెప్పుకుంటున్న ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి దూరంగా ఉండడంపై ప్రజల మదిలో అనేక ప్రశ్నలు తొలుస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుందూరు జానారెడ్డి, నల్లగొండ ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్న తన తనయుడు కుందూరు రఘువీర్ రెడ్డిలు కావాలనే సిఎం రేవంత్ రెడ్డితో చెప్పి సూర్యాపేట నుండి వెళ్లాల్సిన బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనను తమ ప్రాంతానికి మళ్లించినట్లు ప్రజలు ఆరోపించడం, కొంతమంది ముఖ్యమైన కాంగ్రెస్ కీలక ప్రజాప్రతినిధుల కుటుంబాలకు, వారి బంధువర్గానికి రాచకొండ గుట్టల వెంట వేలాది ఎకరాల భూములు ఉండడంతోనే శంషాబాద్ రూట్ మార్పు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు చెబుతూ ఉద్యమకారులు దుమ్మెత్తిపోస్తున్నారు. దీంతోనే వీరు దూరంగా ఉంటున్నారని దీనిపై ప్రజలు పెద్దఎత్తున చర్చించుకుంటున్నారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ప్రతిరోజు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే ఈ నేతలు బుల్లెట్ ట్రైన్ ఉద్యమం తమది కాదన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరును జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికైన వీరు బుల్లెట్ ట్రైన్ పై జరుగుతున్న ఉద్యమంపై తమ వైఖరి ఏంటో తెలుపాలని డిమాండ్ చేస్తున్నారు.



## ఎఐవైఎఫ్ తెలంగాణ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/అనంతగిరి:** నేటి నిరుద్యోగులకు, యువతకు కావాల్సింది మాటలు కాదు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అని ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి పాలకవర్గాలను డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 8, 9, 10వ తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరగనున్న రాష్ట్ర మూడవ మహాసభల సంభంధించిన గొడపత్రికను మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ యువత యువశక్తి అంటూ ప్రసంగాల్లో యువతను యువశక్తి అంటూ ప్రసంగాల్లో పొగడటం కాకుండా, వారికి శాశ్వత ఉపాధి, నాణ్యమైన విద్య, సామాజిక భద్రత, ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు కల్పించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ రాష్ట్ర మహాసభలకు యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వీరన్న, ఇంద్ర కరుణాకర్‌రెడ్డి, జానిపాషా, అఖిల్‌రెడ్డి, గోపియాదవ్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. షాపు యజమానికి రూ.83 వేల బిల్లు

నెలకు రూ.20 వేల లోపే వచ్చే బిల్లు..ఒక్కసారిగా రూ.83,131

బిల్లు చెల్లించలేదని కనెక్షన్ కట్..అప్పు చేసి రూ.50 వేలు చెల్లించిన యజమాని



**ప్రజాపక్షం/మునుగోడు:** విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం ఓ షాపు యజమానికి తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ప్రతినెలా రూ.20 వేల లోపే వచ్చే విద్యుత్ బిల్లు ఒక్కసారిగా రూ.83,131 రావడంతో షాపు యజమాని కంగుతిన్నాడు.ఇంత భారీగా బిల్లు రావడంపై ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ,బిల్లు చెల్లించలేదనే కారణంతో విద్యుత్ అధికారులు షాపు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.మునుగోడు మండల కేంద్రంలోని ఓ షాపునకు సాధారణంగా ప్రతినెలా రూ.20 వేల లోపే విద్యుత్ బిల్లు వస్తుందని యజమాని తెలిపారు.అయితే గత నెలలో ఏకంగా రూ.83,131 బిల్లు రావడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు.తనకు వచ్చే సాధారణ బిల్లుతో పోలిస్తే నాలుగు రెట్లకు పైగా అధికంగా బిల్లు రావడంతో అంత మొత్తం చెల్లించే స్థోమత లేక బిల్లు చెల్లించలేకపోయాడు.దీంతో విద్యుత్ అధికారులు బిల్లు బకాయి ఉందంటూ షాపు విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు.బిల్లు పూర్తిగా చెల్లించిన తర్వాతే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు స్పష్టం చేయడంతో యజమాని తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు.చివరకు షాపు కార్యకలాపాలు నిలిచిపోకుండా ఉండేందుకు బుధవారం అప్పు చేసి రూ.50 వేల బిల్లును చెల్లించడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.అయితే సిబ్బంది చేసిన తప్పిదానికి తాను అప్పు చేసి వేలాది రూపాయలు చెల్లించాల్సి వచ్చిందని షాపు యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారుల తప్పిదానికి వినియోగదారుడే మూల్యం చెల్లించాల్సి రావడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.బిల్లు జారీకి ముందే విద్యుత్ వినియోగాన్ని, మీటర్ రీడింగ్‌ను సిబ్బంది సరిగా పరిశీలిస్తే ఇలాంటి ఇబ్బందులు తలెత్తేవి కాదని వారు పేర్కొంటున్నారు.

**సిబ్బంది తప్పిదమే.. ఇద్దరికి మెమోలు :విద్యుత్ ఏఈ నరేందర్‌రెడ్డి**

ఈ ఘటనపై ఇస్తూ.. బిల్లు కొట్టే విషయంలో సిబ్బంది చేసిన తప్పిదం వల్లే షాపునకు రూ.83,131 బిల్లు వచ్చినట్లు తెలిపారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులైన ఇద్దరు ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు విద్యుత్ ఏఈ నరేందర్‌రెడ్డి వివరణ ఇచ్చారు



## జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నాణ్యమైన విద్య ద్వారానే వికసిత్ భారత్ కు పునాది పడుతుందని,తరగతి గదిలో జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుడు కీలక భూమిక పోషిస్తారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు.బుధవారం పట్టణంలోని రత్న ఫంక్షన్ హాల్ లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురువందన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వం ఉపాధ్యాయ గౌరవాన్ని పెంచేలా చూడాలని, దరఖాస్తుల ద్వారా ఉపాధ్యాయులను సన్మానించే విధానానికి స్వస్తి పలకాలని కోరారు.బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయి ఉద్యోగ పరీక్షలకు పోటీపడే పేద విద్యార్థులకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్,మెటీరియల్ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బత్తిని భాస్కర్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి రేణికుంట్ల రాజశేఖర్,రాష్ట్ర బాధ్యులు పర్వతం సంధ్యారాణి,ఇరుగు శ్రీరాములు,కట్టెబోయిన శ్రీనివాస్,కొమిరెల్లి భాస్కర్ రెడ్డి, కంచనపల్లి విజయ్ కుమార్,వివిధ మండలాల ఎంఈవోలు,గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్‌లో మళ్లీ జల వివాదం!

కుడి కాలువకు 2,023 క్యూసెక్కులు.. ఎడమ కాలువకు 408 క్యూసెక్కుల విడుదల


**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద మరోసారి జల వివాదం తెరపైకి వచ్చింది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు అనుమతులు, ముందస్తు సమన్వయం లేకుండానే ఇరు రాష్ట్రాల నీటిపారుదల అధికారులు కాలువలకు నీటిని విడుదల చేయడం వివాదానికి దారితీసింది.ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టులోకి సుమారు 20 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం 536.60 అడుగులకు చేరింది. మొత్తం నిల్వ సామర్థం 312 టీఎంసీలు కాగా,ప్రస్తుతం 181.3178 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కుడి కాలువకు పెరిగిన విడుదల

మొదట ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అధికారులు కుడి కాలువకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, ప్రస్తుతం 2,023 క్యూసెక్కులకు పెంచారు. అదే సమయంలో తెలంగాణ అధికారులు ఎడమ కాలువ ద్వారా 408 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

బోర్డు అనుమతులపై ప్రశ్నలు

ఇరు రాష్ట్రాల అధికారులు ఏకపక్షంగా నీటిని విడుదల చేయడంతో సాగర్ జలాల వినియోగంపై మరోసారి వివాదం నెలకొంది. కృష్ణా బోర్డు అనుమతులు ఉన్నాయా.ఏ ప్రాతిపదికన నీటిని విడుదల చేశారు.అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ఎడమ కాలువ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో సిమెంట్ లైనింగ్ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో నీటి విడుదలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాగర్‌లోకి వరద ప్రవాహం పెరుగుతున్న సమయంలోనే కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదల జరగడంతో ఉత్కంఠ నెలకొంది. ఇరు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి,కృష్ణా బోర్డు మార్గదర్శకాలకు అనుగుణంగా నీటిని వినియోగించాల్సిన అవసరం ఉందని నీటి రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## నూతన వధూవరులకు ఆశీర్వాదం





**ప్రజాపక్షం/మునుగోడు:** వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బోలుగూరి నరసింహ కుమార్తె సౌజన్య, మనోవిఘ్నేశ్వర్‌ల వివాహ వేడుకలు మండల కేంద్రంలోని ఓ పంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకు సిపిఐ జాతీయ కార్యదర్శి, పల్లా వెంకట్‌రెడ్డి,జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య,ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్దె శ్రీనివాస్,పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం,టి.వెంకటేశ్వర్లు,ఆర్ అంజా చారి,బచ్చనగోని గాలయ్య,మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# మహమ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి ఆదర్శం



నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి



భక్తిశ్రద్ధలతో ఈద్ మిలాద్-ఉన్-నబీ ర్యాలీ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ,శాంతి, సోదరభావం,మానవత్వం వంటి విలువలు సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని డిఎస్‌పి శివరాం రెడ్డి అన్నారు.బుధవారం పట్టణంలోని గడియారం సెంటర్‌లో మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో మిలాద్‌ఉన్‌నబీ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్త బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని,మత సామరస్యాన్ని, పరస్పర గౌరవాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిలాద్ కమిటీ అధ్యక్షుడు ఎం.డి మసీఉద్దీన్,కార్యదర్శి సయ్యద్ హబీబుద్దీన్,వన్ టౌన్ సీఐ టి.రాజశేఖర్ రెడ్డి,సిపిఎం నాయకుడు సయ్యద్ హషం,ఘౌస్ మొహియుద్దీన్,శివకుమార్ పాల్గొన్నారు.

ఈద్ మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా మిలాద్ జూలూస్ కమిటీ అధ్యక్షులు సల్మాన్ ఖాద్రి ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ లో మిలాద్ జూలూస్ ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ అమేర్ పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ ర్యాలీ దర్గా మెట్ల వద్ద ప్రారంభమై గడియారం సెంటర్, ఆర్‌పిరోడ్డు, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, ఓల్డ్ సిటీ చౌరస్తా, గంజ్ బజార్ మీదుగా భక్తిశ్రద్ధలతో సాగి తిరిగి దర్గా మెట్ల వద్ద ముగిసింది.అనంతరం దర్గా మెట్ల వద్ద దాదాపు 300 మందికి అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో మిలాద్ జూలూస్ కమిటీ ప్రెసిడెంట్ సల్మాన్ ఖాద్రి, వైస్ ప్రెసిడెంట్ ఆబేద్, అడ్వైజర్ ఎం.డి. కలీమ్ ఖాన్, మిలాద్ కమిటీ ప్రెసిడెంట్ మసీఉద్దీన్, సెక్రటరీ ఆబిద్, సీపీఎం సీనియర్ లీడర్ హాశం, సలీం పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి పట్టణంలో జలీల్ పుర మజీద్ కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుక ఈద్ మిలాద్‌ఉన్‌నబీ సందర్భంగా భక్తి గీతాలు శాంతి సందేశాన్ని అందిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జలీల్ పుర మసీదు నుండి ప్రారంభమై సమద్ చౌరస్తా, కుమ్మరి వాడ, నల్గొండ రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌరస్తా నుండి జలీల్ పుర వరకు కొనసాగింది. ర్యాలీలో చిన్న పిల్లల తో సహా వృద్ధులు పాల్గొని నారే తక్ బీర్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బుర్హాన్, బట్టు రామచంద్రయ్య, గౌరవాధ్యక్షుడు ముష్టక్ చౌదరి, ఉపాధ్యక్షుడు ముస్తఫా ఖాద్రి, షకీల్, కార్యదర్శి కాజం అహ్మద్, జాయింట్ సెక్రెటరీ ఇక్బాల్ అహ్మద్, గఫర్ చౌదరి, సాదిక్ అలీ, సలవుద్దీన్, అమీరుద్దీన్, కోశాధికారి రహీముద్దీన్ పాల్గొన్నారు.

డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా రోమాంచకం. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు.

రీల్




# 'డాయా' పోస్టర్ రిలీజ్

బాలీవుడ్ నటి కరీనా కపూర్ ఖాన్, పృథ్వీరాజ్ సుకుమారన్లతో కాంబినేషన్‌లో వస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'డాయా' చిత్రం పోసర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌తో సినిమా ఎలా ఉండబోతోందనే హింట్ను టీం ఇచ్చింది. ఆగస్టు 31న ట్రైలర్ విడుదల కానున్న తరుణంలో ఈ పోస్టర్ ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసేలా ఉన్నాయి. కథ పట్ల ఆసక్తిని రేకెత్తించేలా కొన్ని అంశాలను రివీల్ చేస్తూనే ఆ పాత్రల మధ్య ఉన్న సంబంధం గురించి అనేక ప్రశ్నలను లేవనెత్తేలా పోస్టర్ ఉంది. పోలీసుల హెచ్చరిక మధ్య, ఒకరికొకరు వ్యతిరేకదిశలో నిలబడి ఉన్న కరీనా కపూర్ ఖాన్, పృథ్వీరాజ్ సుకుమారన్లతో పాటు, బ్యాక్ గ్రౌండ్‌లో అస్పష్టంగా కనిపించే ఒక ముఖం ఈ పోస్టర్‌లో ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ పోస్టర్ ప్రేక్షకులలో కుతూహలాన్ని కలిగించేలా ఉంది. ఇది రెండు భిన్నమైన దృక్పథాలను సూచిస్తూ, ఆ పాత్రల మధ్య ఉన్న సంబంధం ఏంటి? ఏముంది అనే విషయాలపై ప్రేక్షకులను ఆలోచింపజేసేలా ఉంది.పోస్టర్లో మనం చూస్తున్న దానికి. మనకు కనిపించకుండా దాగి దాగి ఉన్నదానికి మధ్య స్పష్టమైన తేడా కనిపిస్తోంది. సమాధానాలు మాత్రం ఇంకా రహస్యంగానే ఉండిపోయేలా పోస్టర్ను చాలా చక్కగా డిజైన్ చేశారు. ట్రైలర్‌లో కొన్ని సమాధానాలు దొరికే అవకాశం ఉన్నా.. మరిన్ని ప్రశ్నలు తలెత్తే ఛాన్స్ కూడా ఉంటుంది. జంగ్లీ పిక్చర్స్, పెన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ సినిమా నిర్మిస్తోంది. అదే సమయంలో 'తల్వార్', 'రాజీ' తర్వాత జంగ్లీ పిక్చర్స్‌తో మేఘనా గుల్జార్ మూడో సారి కలిపి పని చేస్తున్నారు. ఇది కరీనా కపూర్ ఖాన్, పృథ్వీరాజ్ సుకుమారన్ కలయికతో వస్తున్న మొదటి చిత్రం. యదార్థ ఘటనల నుండి ప్రేరణ పొందిన 'డాయా' చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత చిత్రనిర్మాత మేఘనా గుల్జార్ దర్శకత్వం వహించారు. ఈ మూవీని యశ్ కేశ్వాని, సీమా అగర్వాల్, మేఘనా గుల్జార్ రచించారు. సత్యం, న్యాయం, జవాబుదారీతనం కలిసే ఒక ఉత్కంఠభరితమైన కథను 'డాయా' అందిస్తుందని టీం వాగ్దానం చేస్తుంది. జంగ్లీ పిక్చర్స్, డాక్టర్ జయంతిలాల్ గాడా (పెన్ స్టూడియోస్) నిర్మించగా ఈ మూవీని పెన్ మరుధర్ పంపిణీ చేయనుంది. 'డాయా' సెప్టెంబర్18న థియేటర్లలో రిలీజ్ కానుంది.

# మా హీరోయిన్ ప్రమోషన్స్‌కు గైర్హాజరు

'చిరంజీవి' నిర్మాత దీప్తి నడిమింటి ఆవేదన

కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న సినిమా 'చిరంజీవి'. ఈ చిత్రంలో ఈశ్వరి రావు, తనికెళ్ల భరణి, శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను కికు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. శుభ సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. 'చిరంజీవి' సినిమా ఈ నెల 28న థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ లో ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దీప్తి నడిమింటి మాట్లాడుతూ ఒక మంచి సినిమా చేశామనే నమ్మకంతో మేమంతా ఉన్నాం. సినిమా కంటెంట్ మీద నమ్మకంతో ఈ నెల 28న ధైర్యంగా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం. మీరు థియేటర్స్ కు రండి ఎక్కడా డిజప్పాయింట్ అవరు. ప్రొడ్యూసర్స్ గా నా గ్యారెంటీ అది. ఈ సినిమాలో హీరోయిన్ రోల్ కు చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది. ఆమె మా మూవీ ప్రమోషన్స్ కి రాకపోవడం బాధాకరం. ప్రొడ్యూసర్ కౌన్సిల్ నుంచి మాకు సహకారం అందించిన ప్రసన్నకుమార్ కి, సినిమా మేకింగ్ టైమ్ లో సపోర్ట్ చేసిన ఎడిటర్ ఛోటా కె ప్రసాద్ కు థ్యాంక్స్ చెబుతున్నాం అని అన్నారు. హీరో కికు యనమల మాట్లాడుతూ ఒక కాలేజ్ వాళ్లు మాత్రం ఈవెంట్ కు పర్మిషన్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. దాంతో మాకు సమయం వృథా అయ్యింది. కొన్ని థియేటర్స్ లో మా సినిమా ఫ్లెక్సీలను తీసేసి మరో పెద్ద సినిమా ఫ్లెక్సీలు పెడుతున్నారు. అది డబ్బింగ్ మూవీ. ఆ సినిమాకు ప్రాధాన్యత ఇవ్వండి తప్పు లేదు కానీ మన స్టైట్ తెలుగు సినిమాను ఎందుకు సపోర్ట్ చేయరు అని అడుగుతున్నా. మన సినిమాలకు పక్క రాష్ట్రాల్లో ప్రాధాన్యత ఇవ్వరు, సపోర్ట్ చేయరు. ఇక్కడ తెలుగులో కూడా తెలుగు సినిమాకు సహకరించకుంటే ఎలా. ఎవరు సపోర్ట్ చేయకున్నా మేము భయపడము.ఈ నెల 28న థియేటర్స్ లోకి వస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ యష్ మిట్టల్ కొరియోగ్రాఫర్ గోవింద్ , డీవోపీ రామకృష్ణ, ఎడిటర్ ఛోటా కె ప్రసాద్ , ప్రొడ్యూసర్ ప్రసన్నకుమార్ ,డైరెక్టర్ శుభ సాయి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.





# సుజయ్ ప్రొడక్షన్స్ ప్రేమకథ చిత్రం

యష్ తేజ్, జయశ్రీ జంటగా సుజయ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ఆర్ ఎన్ క్రియేషన్స్ సమర్పణలో చందు దర్శకత్వంలో కె గోపాల్, జె రవీందర్ నిర్మాతలుగా తెరకెక్కబోతున్న ప్రేమకథ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ కెమెరా స్విచ్ ఆన్ చెయ్యగా ముహూర్తం సన్నివేశానికి దర్శకుడు వివిన్ ఆదిత్య క్లాప్ కొట్టారు అలాగే మామిడి హరికృష్ణ స్క్రిప్ట్‌ను చిత్ర యూనిట్‌కు అందజేశారు.ప్రేమించుకొనే యువత తల్లి తండ్రులని దృష్టిలో ఉంచుకుంటే ఏం జరుగుతుంది? ప్రేమలో ఉన్న అబ్బాయి అమ్మాయి వారి పేరెంట్స్ గురించి ఎలా ఆలోచిస్తారు? వంటి సంఘటనలతో ఈ సినిమా కథాంశం ఉంటుందని దర్శకుడు చందు చెబుతున్నారు. ఒక సరికొత్త ప్రేమను తెరమీద ఆవిష్కరించబోతున్నందుకు ఆనందంగా ఉందని నిర్మాతలు కె గోపాల్, జె రవీందర్ తెలిపారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ భూపతి యాదగిరి, సంగీతం నాగ వంశీ, సినిమాటోగ్రఫీ నాని బిశెట్టి, సురేష్ జిల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రామకృష్ణ.

# క్యాన్సర్‌ను జయించిన మహిళ కథ 'పునర్నవి'




క్యాన్సర్‌ను జయించి, ఆత్మవిశ్వాసాన్ని ఆయుధంగా మలచుకొని జీవితంలో అత్యున్నత విజయాలను సాధించిన ధీరవనిత శ్రీమతి చురుకంటి సుమతి నిజ జీవిత కథ ఆధారంగా రూపొందించిన స్ఫూర్తిదాయక డాక్యుమెంటరీ 'పునర్నవి' ప్రత్యేక ప్రదర్శన ప్రసాద్ ల్యాబ్ లో జరిగింది. తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ డాక్యుమెంటరీని వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్యాన్సర్‌ను జయించిన ఒక మహిళ తన జీవితాన్ని తిరిగి నిర్మించుకొని అందాల పోటీల నుంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికల వరకు ఎదిగిన జీవన ప్రయాణాన్ని చిత్రరూపంలో సమాజానికి అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి స్ఫూర్తి దాయక చిత్రాలు క్యాన్సర్‌తో పోరాడుతున్న వారిలో కొత్త ఆశను, ధైర్యాన్ని నింపుతాయని ప్రశంసిస్తూ, నిర్మాత, దర్శకుడు డా. భీమగాని సుధాకర్ గౌడ్‌ని అభినందించారు. శ్రీ లక్ష్మి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సమర్పణలో, సంతోష్ ఫిలిమ్స్ నిర్మాణంలో 'పునర్నవి' చిత్రాన్ని నిర్మించారు. 'పునర్నవి' డాక్యుమెంటరీని గోవా ఇండియన్ పనోరమా ఫిల్మ్ ఫెస్టివల్‌కు పంపించామని, ప్రపంచవ్యాప్తంగా జరిగే వివిధ అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి ఫిల్మ్ ఫెస్టివల్స్, అవార్డుల పరిశీలనకు కూడా పంపించేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత, దర్శకుడు డా. భీమగాని సుధాకర్ గౌడ్ తెలిపారు. ఎడిటింగ్ బిటావరం శ్రీమన్నారాయణ నిర్వహించారు.

# 'స్పిరిట్'కు 'ఎ' సర్టిఫికెట్ వస్తది

'రోమాంచకం' ట్రైలర్ లాంచ్‌లో దర్శకుడు సందీప్ రెడ్డి

డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా రోమాంచకం. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఏషియన్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకలో రిలీజ్ చేస్తున్నారు. రోమాంచకం చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. చిత్ర సమర్పకులు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ నేను రోమాంచకం సినిమా చూశాను. చాలా బాగుంది. ఈ సినిమాలో హీరో క్యారెక్టరైజేషన్ ఇన్నోసెంట్‌గా ఉంటుంది. అలాంటి క్యారెక్టర్‌లో పర్‌ఫార్మ్ చేసి మెప్పించడం కష్టం. హీరో, హీరోయిన్, వారి స్నేహితుల క్యారెక్టర్స్ చూస్తుంటే సినిమాలా అనిపించదు. పక్క నుండి వీళ్లను చూస్తున్నట్లు అనిపిస్తుంటుంది. కథ విన్నప్పుడు నేను ఎంతగా నవ్వుకున్నానో, సినిమా చూశాక అంతకంటే ఎక్కువ నవ్వాను. ఫస్ట్ టైమ్ మా భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ సినిమాకు క్లీన్ యూ బై ఎ సెన్సార్ సర్టిఫికెట్ వస్తోంది. అన్నీ ఎ సర్టిఫికెట్‌లు వచ్చేవి. రాబోయే స్పిరిట్ కు కూడా ఎ సర్టిఫికెట్ నే వస్తుంది. ఈ కార్యక్రమంలో కాస్ట్యూమ్ డిజైనర్ కీర్తన,మ్యూజిక్ డైరెక్టర్ వాసుకి వైభవ్, డిఓపి పవన్ పప్పుల, యాక్టర్ వెంకటేష్ కాకుమాను, హీరోయిన్ అనంతిక సనిల్ కుమార్, డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ప్రొడ్యూసర్ ప్రణ యొ రెడ్డి వంగా, హీరో సుమంత్ ప్రభాస్ పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 25న 'అవెంజర్స్ ఎండ్‌గేమ్'



మార్వెల్ అభిమానులకు మరోసారి బిగ్ 'స్క్రీన్‌ప్లే అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించేందుకు మార్వెల్ స్టూడియోస్ సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'అవెంజర్స్: ఎండ్‌గేమ్'కు ప్రత్యేకమైన ఎంకోర్ ప్రదర్శనగా 'అవెంజర్స్ ఎండ్‌గౌమ్: ఎంకోర్' సెప్టెంబర్ 25న భారతదేశంలోని థియేటర్లలో విడుదల కానుంది. ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే ఐమాక్స్ తో పాటు మార్వెల్ స్టూడియోస్ సమర్పణతో ఇన్ఫినిటీ విజన్ సర్టిఫైడ్ ప్రీమియం లార్జ్ ఫార్మాట్ స్క్రీన్స్‌లోనూ ఈ స్పెషల్ ప్రెజెంటేషన్ అందుబాటులో ఉంటుంది. పెద్ద స్క్రీన్స్, మరింత ప్రకాశవంతమైన విజువల్స్, అత్యుత్తమ సౌండ్తో ప్రేక్షకులకు మరింత గొప్ప థియేట్రికల్ అనుభూతిని అందించనుంది.'అవెంజర్స్ ఎండ్‌గౌమ్: ఎంకోర్'లో థానోస్ కారణంగా ప్రపంచ జనాభాలో సగం మంది కనుమరుగైన తర్వాత మిగిలిన సూపర్‌హీరోలు ఎదుర్కొనే పరిస్థితులు, తమ ప్రియమైన వారిని తిరిగి తీసుకురావడానికి వారు చేసే పోరాటం ప్రధానంగా సాగుతుంది. విశ్వంలో శాంతి, సమతుల్యతను పునరుద్ధరించేందుకు అవెంజర్స్ మరోసారి ఏకమై థానోస్తో తలపడే మహా సంగ్రామం ప్రేక్షకులకు మరోసారి అద్భుతమైన అనుభూతిని అందించనుంది.ఈ చిత్రాన్ని కెవిన్ ఫైజీ నిర్మించగా, ఆంథనీ, జో రూసో దర్శకత్వం వహించారు. లూయిస్ డి'ఎస్పొసిటో, విక్టోరియా అలోన్సో, మైఖేల్ గ్రిల్లో, ట్రిన్ ట్రాన్, జాన్ ఫావ్రూ, జేమ్స్ గన్, స్టాన్ లీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు.

# రూ.3 వేల కోట్ల బ్యాంక్ స్కామ్?

సూత్రధారి సినీ నిర్మాత
నిరుద్యోగుల ఆధార్‌తో బ్యాంకు ఖాతాలు.. నకిలీ ఉద్యోగాలు..
కోట్లలో లోన్లు, క్రెడిట్ కార్డులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సినీ రంగంలో ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపించి నిరుద్యోగులను హైదరాబాద్‌కు రప్పించడం.. ఆధార్ కార్డులు తీసుకోవడం.. మొబైల్ నంబర్లు మార్చి ప్రముఖ బ్యాంకుల్లో ఖాతాలు తెరవడం.. నకిలీ కంపెనీల పేరుతో భారీ జీతాలు జమ చేయడం.. ఆ తర్వాత వారి పేర్లపై కోట్ల రూపాయల రుణాలు, క్రెడిట్ కార్డులు తీసుకోవడం.. చివరకు ఈఎంఐలు నిలిపి వేసి బ్యాంకులను, అమాయక బాధితులను మోసం చేశారు. ఈ ఉదంతం హైదరాబాద్ కేంద్రంగా ఏడాది కాలంగా కొనసాగింది. భారీ స్కెచ్ కు ఓ సినీ నిర్మాత సూత్రదారి అని తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులను హైదరాబాద్‌కు రప్పించి ఉద్యోగాలు, ఉచి త భోజనం, వసతి కల్పిస్తామని నమ్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నగరానికి వచ్చిన తర్వాత వారి ఆధార్ కార్డులను తీసుకుని కొత్త సిమ్ కా ర్డులు తీసుకున్నారని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్లను మార్చి ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి, కోటక్ తదితర బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించినట్లు తెలిసింది.

**నకిలీ కంపెనీలు.. నకిలీ ఉద్యోగాలు**

అల్టిమో బిజినెస్ సొల్యూషన్స్, స్కైలైన్ టెక్ ఇండియా, సేపియన్స్ ఇన్ఫోటెక్ వంటి కంపెనీల పేర్లను ఉపయోగించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, మేనేజర్ వంటి హోదాలతో నకిలీ ఆఫర్ లెటర్లు, ఐడి కార్డులు తయారు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుల బ్యాంకు ఖాతాల్లో నెలకు రూ.70 వేల నుం చి రూ.1.50 లక్షల వరకు జీతాలు జమవుతున్నట్లు చూపించి, కొంతకాలం క్రమం తప్పకుండా ఈఎంఐలు చెల్లించేవారని తెలిసింది. దీంతో బాధితుల సిబిల్ స్కోర్ పెరిగిన తర్వాత అసలు మోసం మొదలయ్యేదని ఆరోపణలు ఉన్నాయి.

**ఒకే రోజులో 15-20 బ్యాంకుల్లో రుణాలు?**

డిఎస్ఎల సహకారంతో ఒకే రోజులో 15 నుంచి 20 బ్యాంకుల్లో పర్సనల్ లోన్లు, క్రెడిట్ కార్డులకు దరఖాస్తు చేయించి భారీ మొత్తాలను డ్రా చేసినట్లు వీడియోలో ఆరోపించారు. ఆ తర్వాత 6 నుంచి 8 నెలల వరకు ఈఎంఐలు చెల్లించి ఒక్కసారిగా చెల్లింపులు నిలిపివేసేవారని సమాచారం. దీంతో బ్యాంకులకు భారీ నష్టం వాటిల్లడంతో పాటు, బాధితుల సిబిల్ స్కోర్లు దెబ్బతిని వారు రుణాలు పొందలేని పరిస్థితికి చేరుకున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**రూ.11 వేల జీతం.. పేరు మీద కోటికి పైగా రుణాలు!**

భద్రాచలానికి చెందిన టెడ్లా లక్ష్మ ణ్ ఉదంతాన్ని పరిశీలిస్తే హోటల్‌లో నెలకు రూ.11 వేల జీతానికి పనిచేస్తూ సైకిల్‌పై తిరిగే సాధారణ వ్యక్తి అయిన లక్ష్మ ణ్ పేరుతో కోటి రూపాయలకు పైగా రుణాలు, థార్ కారు లోన్, పెద్ద సంఖ్యలో క్రెడిట్ కార్డులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**మరణించిన వ్యక్తి పేరుతోనూ రుణం?**

కత్తుల మంగ అనే మహిళ 2021 నవంబర్ 24న మరణించినప్పటికీ, 2023లో ఆమె పేరుతో సేపియన్స్ ఇన్ఫోటెక్ సంస్థ ద్వారా రుణం తీసుకున్నట్లు వీడియోలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా రుణ రక్షణ బీమాలో నామినీగా తమకు చెందిన వ్యక్తులను చేర్చినట్లు సమాచారం.

**సినీ నిర్మాతపై ఆరోపణలు..**

ఈ వ్యవహారంలో ఓ సినీ నిర్మాత కీలకంగా ఉన్నాడని తెలిసింది. ఆయన సినీ నిర్మాతగా వ్యవహరిస్తూ, మోసం ద్వారా వచ్చిన డబ్బుతో ఇటీవలే ఓ తెలుగు సినిమా నిర్మించి తన సోదరుడిని హీరోగా పరిచయం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సినీ నిర్మాత వద్ద డ్రైవర్‌గా పనిచేస్తు, కూకట్‌పల్లిలో ఉంటున్న వ్యక్తి ఇంట్లో స్వైపింగ్ మెషిన్లు, పెద్ద సంఖ్యలో క్రెడిట్ కార్డులు ఉన్నట్లు తెలిసింది.

**పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలేదని బాధితుడి ఆరోపణ..**

తన పేరుతో భారీ మొత్తంలో రుణాలు తీసుకున్న విషయం తెలుసుకున్న టెడ్లా లక్ష్మ ణ్ 2026 జూన్ 27న భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో సినీ నిర్మాతతో పాటు అతని గ్యాంగ్ సభ్యులపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.3 వేల కోట్ల స్థాయిలో బ్యాంకింగ్ మోసం జరిగిందన్న ఆరోపణలు సంచలనం రేపుతున్న నేపథ్యంలో.. అసలు ఈ వ్యవహారంలో ఎంత మొత్తం మోసం జరిగింది? ఎంతమంది బాధితులు ఉన్నారు? ఎన్ని బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు? ఎవరి పాత్ర ఎంత? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.







# త్యాగాలు అమూల్యం

(మొదటి పేజీ తరువాయి)

పలువురు నాయకులు, గ్రామస్తులు భావోద్వేగంతో ఆయనను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, పాలమూరు జిల్లా వెనుకబాటుతనంపై నిరంతరం పోరాడుతూనే, దేశ రాజకీయాల్లో కమ్యూనిజం జెండాను ఎగరేసిన మహోన్నత నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కరువు, నిరుద్యోగం, వలసల నివారణకు సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం సురవరం జీవితాంతం కృషి చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని సరిచేసేందుకు ప్రత్యేక రాష్ట్ర సాధనే ఏకైక మార్గమని సిపిఐ జాతీయ వేదికపై బలంగా వినిపించి, పార్టీ వైఖరిని తెలంగాణకు అనుకూలంగా మార్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇపిఎఫ్ కరీంనగర్ సిపిఐ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంటు ఎంపి మల్లురవి, ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ సరిత, స్థానిక సర్పంచ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. సురవరం సుధాకర్ రెడ్డి ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సురవరం కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, నిఖిల్, కపిల్, సిపిఐ జోగులాంబ గద్వాల్ జిల్లా కార్యదర్శిలు బి.ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, సర్పంచ్ నాగలక్ష్మి, కంచుపాడు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# కాంగ్రెస్‌లోనే...

(మొదటి పేజీ తరువాయి)

తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కొండా మురళి కలిశారు. సిఎం రేవంత్‌రెడ్డిపై తన కుమార్తె కొండా సుస్మిత వ్యాఖ్యల నేపథ్యంలో, ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. భట్టి విక్రమార్కను కలిసిన అనంతరం కొండా మురళి మాట్లాడుతూ 'మా బిడ్డ వ్యాఖ్యలతో మాకు ఏం సంబంధం? మా బిడ్డకు స్వతంత్రంగా మాట్లాడే హక్కు ఉంది. ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. సుస్మితను ప్రశ్నించే హక్కు మాకు లేదు' అని అన్నారు. సుస్మిత తనకు తగ్గట్టుగా తాను ఉంటుందని, ఆమె చేసిన వ్యాఖ్యలపై తాము బాధ్యత వహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సుస్మిత వ్యాఖ్యలపై తాను భట్టి విక్రమార్కతో చర్చించలేదని మురళి తెలిపారు. ఓ బిల్లు విషయంలో ఆయనను కలిసినట్లు వెల్లడించారు. మంత్రి కొండా సురేఖ అందుబాటులో లేరంటూ జరుగుతున్న ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. కాంగ్రెస్ పార్టీని వీడే ఆలోచన తమకు లేదని కొండా మురళి స్పష్టం చేశారు. 100 శాతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని, గాంధీ కుటుంబంపై సంపూర్ణ విశ్వాసం ఉందని తెలిపారు. బిఆర్ఎస్ నుంచి కవిత బయటకు వెళ్లిన విషయాన్ని మురళి ప్రస్తావిస్తూ రాజకీయాల్లో ఎవరి నిర్ణయాలు వారికి ఉంటాయని పరోక్షంగా వ్యాఖ్యానించారు.

# 'కొండ'ంత ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

నమస్కారంతో సమాధానం ఇస్తున్నారు. తూర్పు నియోజకవర్గంలోని ప్రైవేట్ శుభకార్యాలకు మాత్రమే సురేఖ పరిమితమవుతున్నారు. మరో పక్క మంత్రి రియాక్షన్ కోసం పార్టీ శ్రేణులు, అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఆమె మాత్రం వ్యూహాత్మక మౌనం ప్రదర్శిస్తుండటంతో ఏం జరుగుతుందోననే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**టిపిసిసికి క్రమశిక్షణ నివేదిక.. కొండా శిబిరంలో కలకలం..**

కొండా సుస్మిత వ్యాఖ్యలు, తదుపరి పరిణామాలపై విచారణ పూర్తి చేసి నివేదికను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కు అందించినట్లు టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి మంగళ వారం సాయంత్రం మీడియా సమావేశంలో వెల్ల డించారు. మంత్రి సురేఖకు నోటీసులు జారీ చేయడం, ఆమె వివరణ ఇవ్వడం, అనంతరం కమిటీ తన అభిప్రాయాలను నివేదిక రూపంలో సిద్ధం చేసి సమర్పించడం వరకూ వ్యవహారం చేరింది. క్రమ శిక్షణ చర్యలు కఠినంగా ఉండాలని కోరినట్లు మల్లు రవి ప్రకటించడంతో కొండా సురేఖ ఎపిసోడ్ లో ఏం జరుగుతుంది? అనేది మరింత ఆసక్తికరంగా మారింది.రాజకీయంగా సుస్మిత వ్యాఖ్యల వ్యవహారం.. పరిపాలనా, పోలీసు కోణంలో నార్ల సుమంత్ కేసు.. రెండూ ఒకే సమయంలో తెరపైకి రావడంతో కొండా కుటుంబంపై రాజకీయ ఒత్తిడి పెరిగిందన్న చర్చ సాగుతోంది. ఆయన గతంలో మంత్రి సురే ఖకు ఓఎస్డీగా పనిచేసినందునే ఈ కేసు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి, హత్యాయత్నం ఆరోపణలతో నమోదైన కేసులో సుమంత్ డ్రైవర్ నవీన్ తోపాటు మరో ముగ్గురు అనుచరులను పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదులో జాప్యం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్ ను సస్పెండ్ చేయడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యం తెచ్చింది.

**ఉమ్మడి వరంగల్ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్**

ఇప్పటి వరకు కుమార్తె వ్యాఖ్యల వ్యవహారం లో మంత్రి సురేఖను బాధ్యురాలిని చేయాలా? లేదా అది సుస్మిత వ్యక్తిగత వ్యాఖ్య లుగానే పరిగణించాలా? అన్నది కాంగ్రె స్ లో చర్చ జరిగినా.. చివరకు క్రమశిక్షణ సంఘం నివేదికలో సురేఖ వ్యవహారంపైనా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పటికే మూడు పర్యాయాలు ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నా యని కమిటీ ప్రస్తావించడం.. ఈసారి కఠిన చర్యలకు సిఫారసు చేశామనడం.. కొండా శిబిరంలో కలకలం రేపుతోంది. ఇదే సమ యంలో సుమంత్ కేసులో పోలీసులపై చర్య లు తీసుకోవడం కూడా చర్చకు దారితీసింది. ఈ రెండు పరిణామాల మధ్య పార్టీ అధిష్టానం ఎలాంటి రాజకీయ సమీకరణాన్ని ఎంచుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో ఉమ్మడి వరంగల్ ప్రజాప్రతినిధులను హైదరాబాద్ కు పిలిపిం చడం.. క్రమశిక్షణ సంఘం నివేదిక తీవ్రత.. పీసీసీ స్థాయిలో తదుపరి కసరత్తుపై జరుగు తున్న ప్రచారం.. ఇవన్నీ కలిపి చూస్తే త్వర లోనే కీలక నిర్ణయం వెలువడే అవకాశముందన్న చర్చ సాగుతోంది. మంత్రి పదవిపై ప్రభావమా? పార్టీ పరంగా చర్యా? వివా దానికి ఫుల్‌స్టాపా? లేక సర్దుబాటా? కాంగ్రెస్ అధిష్టానం ఏం తేల్చబోతోందన్నదే ఇప్పుడు ఉమ్మడి వరంగల్ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# మరింత సంక్షోభంలోకి...

(మొదటి పేజీ తరువాయి)

అవసరం లేదు. ప్రకృతి పరిస్థితి ఈవిధంగా ఉంటే పాలకులు సైతం సాగు రంగం పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు.ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పరం చేసేందుకు ప్రయత్నిస్తుంది తప్ప సాగును ప్రోత్సహించే ఏ పథకాన్ని ముందుకు తీసుకు రాలేదు. గతంలో సాగు రంగానికి ఇచ్చే సబ్సిడీలలో కొన్నింటిని పూర్తిగా ఎత్తివేయగా మరికొన్ని పథకాల విషయంలో సబ్సిడీని తగ్గించింది. కేంద్ర ప్రభుత్వం రసాయన ఎరువుల ధరలపై నియంత్రణ కోల్పోవడం, ఉత్పత్తి సంస్థలకు సానుకూలంగా వ్యవహరించడంతో రసాయనిక ఎరువుల కొనుగోళ్లు ఇప్పుడు రైతులకు ఆదనపు భారంగా మారాయి. దీనితో పాటు ధరలు పెరిగినా రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందించ లేని స్థితి. యాప్‌ల ద్వారా యూరియా పొందే పద్ధతి ఇప్పుడు రైతులకు తలనొప్పిగా మారింది. గతంలో బ్యాంకులు వ్యవసాయ రుణాలను తక్కువ వడ్డీలకు ఇచ్చి సాగు రంగాన్ని ప్రోత్సహించేది.కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన సంస్కరణల పుణ్యమా అని బ్యాంకులు సాగు రంగానికి రుణాలు అందించే పరిస్థితి లేదు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన రుణమాఫీ కానీ రైతుల విషయంలో రుణం పొందెందుకు మధ్య ప్రైవేటు అప్పు పుట్టడం లేదు. ఒకవేళ ఎవరైనా అప్పు ఇచ్చిన వడ్డీ అసలును మించి పోయే పరిస్థితులు దాపురించాయి. వ్యవసాయ రంగంలో పెరిగిన యాంత్రీకరణ సైతం రైతాంగానికి ఇబ్బందికరంగా మారింది. పెట్టుబడి గణనీయంగా పెరిగింది. పెరిగిన పెట్టుబడి ఆధారంగా ప్రభుత్వం మద్ధతు ధర నిర్ణయించడం లేదు. ఏ పంటకు సంబంధించి నిర్ణయించిన మద్ధతు ధర రైతుకు ఊరటనివ్వకపోగా మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులను మద్ధతు ధరలకు కొనే పరిస్థితి లేక అడిగిన కాడికి ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. మొత్తంగా సహకరించిన ప్రకృతి, సాగుకు సానుకూలంగాలేని పాలకుల మధ్య వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతుండడంతో ప్రతి యేటా లక్షలాది కుటుంబాలు వ్యవసాయ రంగాన్ని వదిలి జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ రంగాల వైపు వెళ్తున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. సాగుపై ఆధారపడే వారి సంఖ్య ప్రతి యేటా గణనీయంగా తగ్గుతుంది. ఒకప్పుడు రైతులుగా ఉన్నవారు ఇ ప్పుడు పట్టణాలలో గుమస్తాలుగా, సెక్యూరిటీ గార్డ్స్‌గా, భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతే అది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీనితో పాటే ఉపాధి కరువై దేశ వ్యాప్తంగా ఒక విపత్కర పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. పాలకులు ప్రకృతిని శాసించలేకపోయినా తమ పరంగా ఇచ్చేటటువంటి ప్రోత్సాహకాలను అందించి సాగును సంక్షోభం నుంచి గట్టేక్కించాలని రైతులు కోరుతున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com